ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రి




4 అణాలు

8-8-56


ANDHRA PATRIKA

ILLUSTRATED WEEKLY




శాంతోమ్ చర్చి

ఫొటో: వి. దుర్గాప్రసాద్.



బొంబాయినగరాన్ని మహారాష్ట్రంలో చేర్చాలని నినాదాలు చేస్తూ పార్లమెంటు భవనం ఎదుట
మహారాష్ట్రులు ఈ నెల 27 న ప్రదర్శనలు జరిపారు. వీరిలో రెండువందలమంది స్త్రీలు కూడా పాల్గొన్నారు.



సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 50
సంచిక 49
8-8-56

దుర్ముఖి "శ్రావణ శుద్ధ ద్వితీయబుధవారం

విషయానుక్రమణిక

★

దేశముఖ్ రాజీనామా

ఆరేళ్లనుంచీ కేంద్ర ఆర్థిక మంత్రిగా పని చేస్తున్న శ్రీ చింతామణి దేశముఖ్ రాజీనామాను రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ జులై 24 న ఆమోదించారు బొంబాయి నగరాన్ని మహారాష్ట్రలో చేర్చనందుకు నిరసనగా శ్రీ దేశముఖ్ రాజీనామా ఇవ్వడం, అది చాలా రోజులనుంచీ ప్రధాని పరిశీలనలో వుండడం జరిగింది జూన్ నెలలో యూరప్ ఖండ పర్యటనకు వెళ్తూ తాను తిరిగివచ్చే వరకూ పదవిలో వుండవలసిందని శ్రీ దేశముఖ్‌ను ప్రధాని నెహ్రూ కోరారు. ప్రధాని రాజధానికి తిరిగి వచ్చిన మరునటి రోజే రాజీనామాను ఆమోదించినట్లు అధికార ప్రకటన వెలువడింది.

దేశ ఆర్థిక వ్యవహారాలను అత్యంత సామర్థ్యంతో నిర్వహించిన శ్రీ దేశముఖ్ ఆర్థిక మంత్రి పదవికి రాజీనామా ఇచ్చినందుకు సహృదయులైన భారతీయులందరూ విచారపడ్డారు. పూర్వాశ్రమంలో ఐ. సి. ఎస్. ఉద్యోగ తరగతికి చెందినవాడై నప్పటికీ శ్రీ దేశముఖ్, భీమా కంపెనీలను, ఇంపీరియల్ బ్యాంకును ప్రభుత్వాధీనం చేయడంలో దేశావసరాలను ప్రభుత్వ లక్ష్యాలను గమనించి, సోషలిస్ట్ సామాజిక వ్యవస్థా నిర్మాణానికి అనుగుణమైన ధోరణిలో మెలకువతోనూ, ముందు చూపుతోనూ వ్యవహరించగలిగారు. స్వతంత్ర భారత దేశంలో కేంద్రప్రభుత్వ ఆర్థికశాఖపై ఆధిపత్యం వహించిన వారిలో శ్రీ దేశముఖ్ మూడవ వాడు. మొదటి ఇద్దరు కీ॥ శే॥ ఆర్. కె. షణ్ముఖం శెట్టి; డా॥ జాన్ మత్తై వీరిలో కేంద్ర ఆర్థిక శాఖపై ఎక్కువకాలం ఆజ్ఞాయిషీ వహించింది శ్రీ దేశముఖ్

శ్రీ దేశముఖ్ తమ రాజీనామా కారణాలను నిర్మొహమాటంగా విశదీకరిస్తూ లోక్ సభలో జులై 25-న ఒక దీర్ఘ ప్రకటన చేశారు. బొంబాయి నగరాన్ని మహారాష్ట్రలో చేర్చకూడదనే నిర్ణయం మంత్రివర్గం సమిష్టిగా చేసింది కాదనీ, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణబిల్లు సెలెక్టుకమిటీ పరిశీలనలో వుండగా ప్రధాని నెహ్రూ జూన్ 3-వ అఖిలభారత కాంగ్రెస్ సంఘ సమావేశంలో (బొంబాయిలో) నగర భవిష్యత్తుపై ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించడం 'అసాధారణమైన' విషయమనీ శ్రీ దేశముఖ్ విమర్శించారు. మంత్రివర్గ ఉపసంఘంకూడా కేవలం పరిపాలనా విషయాలు మొదలైన చిల్లర



శ్రీ దేశముఖ్

సమస్యలను పరిశీలించిందటగాని ప్రధానమైన సమస్యలను ఎత్తుకోనేలేదట. మంత్రి వర్గ సభ్యులతో వ్యక్తిగతంగాకూడా ఎన్నడూ ఈ విషయాన్ని ప్రధాని చర్చించనే లేదనీ, ఆంధ్రరాష్ట్ర నిర్ణయ సందర్భంలో కూడా ప్రధాని ఇదేవిధంగా వ్యవహరించారనీ శ్రీ దేశముఖ్ ఆరోపణ. కేంద్ర మంత్రివర్గం దేశవ్యవహారాలను నడుపుతున్న ధోరణి ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధంగా వున్నదనే ధ్వని శ్రీ దేశముఖ్ ప్రసంగంలో వున్నది.

ప్రధాని నెహ్రూ దీనికి బహుసంతృప్తమైన సమాధానం చెబుతూ బొంబాయి సమస్యపై ప్రభుత్వ నిర్ణయం మంత్రివర్గంలో సమగ్రంగా చర్చించిన మీదటే జరిగిందన్నారు. అప్పుడు ఇంతకు మించే మీ చెప్పలేదు.

శ్రీ దేశముఖ్ చేసిన ఆరోపణలు చాలా ప్రధానమైనవి కాబట్టి. ప్రధాని నెహ్రూ పార్లమెంటులో జులై 30 న మరొక ప్రకటన చేశారు ప్రధాని పదవిలోవున్న తనకు ఒక విధానాన్ని నిర్ణయిస్తూ ప్రకటన చేసే అధికారం వున్నదని వాదించారు. దాన్ని కాదనలేము కాని, మంత్రివర్గ నిర్ణయ విధానంపై ఏర్పడిన అపోహలు మాత్రం ఈ ప్రకటనవల్ల తొలగిపోవడంలేదు మాజీ ఆర్థికమంత్రి బయటపెట్టిన లోపాలలో ఏ మాత్రం నిజంవున్నా, వాటిని వెంటనే చక్కబెట్టుకోవలసిన బాధ్యత కేంద్రప్రభుత్వంమీద వున్నది. ★

సూయజ్ తుఫాను

జులై 26. ఈజిప్టు ఇటీవలి చరిత్రలో అతి ప్రధానమైన రోజు. గత నాలుగేళ్లలో చరిత్రాత్మకమైన అనేక సంఘటనలు ఈజిప్టులో సరిగా ఆ తేదీనే జరిగినవి.

నాలుగేళ్ల క్రితం, ఫరూక్ రాజు రాజ్య భ్రష్టుడై వెళ్ళిపోయింది జులై 26 నే. రెండేళ్ల క్రితం, సూయజ్ ప్రాంతంలోని బ్రిటిష్ సేనల ఉపసంహరణపై బ్రిటన్ ఈజిప్టులమధ్య స్నేహపూర్వక ఒప్పందం కుదిరింది జులై 26 నే.

చివరకు, సూయజ్ కాలువ కంపెనీని తాము స్వాధీనపరుచుకుంటున్నట్లు ఈజిప్టు అధ్యక్షుడు నాసర్ ప్రకటించిందికూడా జులై 26 నే. అలెగ్జాండ్రియా నగరంలో దాదాపు లక్షన్నరమంది ప్రజలు హాజరైన బహిరంగ సమావేశంలో మొన్న జులై 26 న ప్రసంగిస్తూ అధ్యక్షుడు నాసర్, సూయజ్ కాలువలో నౌకాయాన వ్యవహారాలన్నిటిని నిర్వహిస్తున్న కంపెనీని ఆ రోజునుంచీ స్వాధీనపరుచుకోడానికి ఈజిప్టు ప్రభుత్వం నిశ్చయించిందని బహిరంగంగా ప్రకటించేసరికి ప్రపంచమంతా దిగ్భ్రాంతి చెందింది బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు మొదలైన పశ్చిమ రాజ్యాలు గగ్గోలు పెట్టిపోతున్నవి

"1952 జులై 26 న ఫరూక్ రాజు నిష్క్రమించాడు; సరిగా నాలుగేళ్ళ అనంతరం ఈనాడు విదేశీ సూయజ్ కంపెనీకి స్వస్తి చెబుతున్నాం," అన్నాడు కల్నల్ నాసర్. అతి ప్రధానమయిన ఆ ప్రసంగంలో నాసర్ ఇంకాకూడా తెలియజేశాడు: "సూయజ్ కాలువ కంపెనీ అక్రమముగా ధనార్జన చేస్తున్నది. ఈ కాలువ వల్ల కంపెనీకి సాలీనా మూడున్నర కోట్ల పౌనుల ఆదాయం వస్తున్నది ఇందులో ఈజిప్టుకు ఇస్తున్నది పదిలక్షల పౌనులు మాత్రమే. నూరేళ్ళ క్రితం సూయజ్ కాలువను ఈజిప్షియన్లే నిర్మించారు. ఆ నిర్మాణములో

★ సూయజ్ తుపాను ★

దాదాపు లక్షా ఇరవై వేలమంది ఈజిప్షియన్ ప్రజలు మరణించారు. అయినా లాభమంత విదేశాలకే పోతున్నది. కంపెనీ ఈజిప్టులో నే రిజిష్టరయినప్పటికీ, ప్రధాన కార్యాలయం పారిస్‌లో వుంది. వాటాలలో చాలాభాగం విదేశీయులవి. బ్రిటిషువారి వాటాలు అత్యధికం. కాలువ ఉపయోగం విషయంలో బ్రిటన్‌తో ఈజిప్టుకు ఒక కాలు ఒప్పందం వున్నది. ఈ ఒప్పందం మరొక పదమూడేళ్లలో కాని అంతం కాదు. పదమూడేళ్ళ అనంతరమయినా సూయజ్ కంపెనీ ఈజిప్టు అధీనం కావలసిందే......వాటాదారులకు ఇప్పటి మార్కెట్ ధరల ప్రకారం ఈజిప్టు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుంది. కంపెనీకి వున్న సమస్త ఆస్తులను ఈజిప్టు స్వాధీనం చేసుకుంటున్నది; దానికి వున్న అప్పుల భారాన్ని కూడా ఈజిప్టే స్వీకరిస్తున్నది. ఈజిప్టు ప్రభుత్వం అనుమతి లేనిదే సూయజ్ కంపెనీ నిధులను ఖర్చుచేసే అధికారం ఏ సంస్థకుగాని, ఏ ప్రభుత్వానికి గాని ఇక మీదట లేదు. కంపెనీ నిధులన్నిటినీ స్తంభింపజేస్తున్నాము. సర్వతంత్ర స్వతంత్ర ప్రతిపత్తి గల ఈజిప్టులో ఈ సూయజ్ కంపెనీ మరొక సర్వస్వతంత్ర వ్యవస్థమాదిరిగా ప్రబంధకంగా తయారై వ్యవహరిస్తున్నది. నేటితో దీని ఆటకు స్వస్తి. కంపెనీకి చెందిన ఆస్తులను వేటినీ అన్యాక్రాంతం చేసే అధికారం ఎవరికీ లేదు: కంపెనీ ఉద్యోగులెవరూ తమ తమ స్థానాలను వదిలిపెట్టి వెళ్లడానికి వీల్లేదని ఆజ్ఞాపించాం. కంపెనీ సక్రమ నిర్వహణకు తొమ్మిదిమంది సభ్యులతో ప్రత్యేక మండలి ఏర్పాటు అయింది. ఇది ఈజిప్టు ప్రభుత్వ వ్యాపార మంత్రి అధ్వర్యాన స్వతంత్రవ్యవస్థగా పనిచేస్తుంది."

అస్వాన్ డాం

అసలు ఈ సూయజ్ కంపెనీ స్వాధీనానికి నైల్ నదిపై ఈజిప్టు ప్రభుత్వం నిర్మించ దలచిన అస్వాన్ డాం విషయంలో ఇటీవల చెలరేగిన రగడే ముఖ్యకారణం. ఈజిప్టులో అస్వాన్ అనే పట్టణంవద్ద నైల్ నదిపై డాం నిర్మించదలచినందువల్ల దీనికి ఈ పేరువచ్చింది. ఇది దాదాపు 180 కోట్ల డాలర్లు (దాదాపు 600 కోట్లరూపాయలు) ఖర్చయ్యే బ్రహ్మాండమైన ప్రాజెక్టు. ఈజిప్టు ప్రజలు తమ ఆశలన్నిటినీ ఈ 'డాం' మీద పెట్టుకొని వున్నారు. విదేశాల ధనసాంకేతిక సహాయం లభ్యమైతే ఈ ప్రాజెక్టు నిర్మించడం ఈజిప్టుకు సులువుగా వుంటుంది. దాదాపు 10 లేక 15 లక్షల ఎకరాల భూమిని నైల్ నదీ జలాల సహాయంతో సుక్షేత్రంగా మార్చివేసి నాజర్ ప్రభుత్వం ప్రత్తి పంటలకు విశేష లాభాలను పొందుతున్నది. అస్వాన్ డాం నిర్మిస్తే తమ దేశంలో కూడా బంగారు పంటలు పండించుకోవచ్చునని ఈజిప్టు ప్రజలు ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు; కలలుకన్నారు. ఈ ప్రాజెక్టువల్ల 20 లక్షల ఎకరాల భూమిసాగై, 7½ లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి తయారవుతుంది.

అయితే బ్రిటన్అమెరికాల ఆకస్మిక నిర్ణయాలవల్ల ఈ ఆశలన్నీ నిరాశలుగా మారిపోయినవి. అస్వాన్ డాం నిర్మాణంలో సహాయపడడానికి రెండు మూడు మాసాలక్రితం వరకూ సర్వసంసిద్ధంగా వున్న బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలు హఠాత్తుగా తమ వైఖరిని మార్చుకొని, సహాయంచెయ్యలేమని ప్రకటించడం జరిగింది. ఈజిప్టు రాజకీయ రంగంలో ఏ విధానాన్ని అనుసరించినప్పటికీ, బాగ్దాద్ ఒప్పందాన్ని ప్రతిఘటిస్తున్నప్పటికీ అస్వాన్ డాం నిర్మాణానికి తోడ్పడేవిషయంలో తమ వైఖరేమీ మారదని ఆ రాజ్యాల ప్రముఖులు ప్రకటిస్తూ వచ్చారు. చివరకు బ్రిటన్ అమెరికా నాయకులు తమ వాగ్దానాలను తామే భంగపరచి, సంకుచిత దృష్టిని ప్రదర్శించారు. ఈజిప్టు అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగ విధానమే రష్యాకు సన్నిహితంగా ప్రవర్తిస్తూండడమే బ్రిటన్ అమెరికాల వైఖరిలో ఈమార్పు రావడానికి కారణం. బ్రిటన్ అమెరికాల వైఖరినే తానూ అవలంబించి ప్రపంచ బ్యాంకు కూడా అస్వాన్ డాం నిర్మాణంలో ఈజిప్టుకు సహాయపడలేనని చెప్పివేసింది.

గత్యంతరం లేదు

ఈ పరిస్థితులలో ఈజిప్టు ఒక నిర్ణయానికి రాక గత్యంతరం లేకపోయింది. పాశ్చాత్య రాజ్యాలు, ప్రపంచబ్యాంకు సహాయ నిరాకరణ ధోరణి అనుసరించినంత మాత్రాన అస్వాన్ డాం నిర్మాణాన్ని విరమించడమా, స్వయంశక్తిపై ఆధారపడి అయినా దాని నిర్మాణానికి ఉపక్రమించడమా అనే క్లిష్ట సమస్యను ఈజిప్టు తేల్చుకోవలసివచ్చింది. ఈజిప్టు ప్రజల భావిభాగ్యోన్నతిని అమోఘంగా రూపొందించే ఈ ప్రాజెక్టును ఆరు మూరైనా, మూరు ఆరైనా నిర్మించి తీరవలసిందేనని నాసర్ ప్రభుత్వం నిర్ణయించుకున్నది.

అందుచేతనే జూలై 26-వ అలెగ్జాండ్రియా సభలో మాట్లాడుతూ అధ్యక్షుడు నాసర్, "సూయజ్ కాలువ కంపెనీని స్వాధీనపరచుకోవడంవల్ల ఐదు సంవత్సరాలలో వచ్చే 50 కోట్ల డాలర్ల ఆదాయంతోనూ అస్వాన్ డాం నిర్మించదలిచాము. దీని నిర్మాణంలో సహాయపడి ఈజిప్టును తమ ఆర్థిక సామ్రాజ్యతత్వానికి లోబరుచుకోవాలని పాశ్చాత్య రాజ్యాలు ఒక పన్నాగం పన్నినవి. ఈజిప్టు అధ్యక్షపదవిలోవున్న నా స్థానాన్ని ప్రపంచ బ్యాంకు డైరక్టర్లలో ఒకరికి ధారాదత్తమయ్యేట్లు చేయడానికి ప్రయత్నించినవి. ఈ అవమానకరమైన షరతులకు ఈజిప్టు తలవొగ్గక నిరాకరించిన కారణంచేతనే బ్రిటన్, అమెరికాలు తమ సహాయ వాగ్దానాన్ని ఉపసంహరించుకున్నవి," అని కుండ బద్దలు కొట్టినట్లు ప్రకటించాడు.

బ్రిటన్ అమెరికా ప్రభుత్వాలు 7 కోట్ల డాలర్ల సహాయం మాత్రమే ఇవ్వగలమని వాగ్దానం చేస్తే, సూయజ్ కంపెనీ స్వాధీనంవల్ల ఈజిప్టు ప్రభుత్వానికి ఐదేళ్ళలో 50 కోట్ల డాలర్లవరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

అమెరికన్ దూత గాథ

ఈ సందర్భంలో అధ్యక్షుడు నాసర్ తనకూ అమెరికా ప్రత్యేక దూతగా వాషింగ్టన్‌నుంచి వచ్చిన జార్జి ఎలెన్‌కూ మధ్య ఇదివరలో జరిగిన ఒక ఘర్షణ గాథను కూడా బయటపెట్టాడు. ఈజిప్టు సోవియట్ రాజ్యకూటంనుంచి (ముఖ్యంగా జెకోస్లవాకియానుంచి) ఆయుధ బలాన్ని సేకరిస్తున్నందుకు తీవ్ర ఆక్షేపణను తెలియజేస్తూ అమెరికా జార్జి ఎలెన్‌ద్వారా ఒక లేఖను నాసర్‌కు పంపించింది. దాన్ని అందజేయడానికి అతను కైరో వచ్చి, తన రాకవిషయమై నాసర్‌కు తమ రాయబార కార్యాలయోద్యోగిద్వారా కబురు చేశాడట. జార్జి ఎలెన్ అప్పుడు అమెరికా విదేశాంగశాఖలో మధ్యప్రాచ్య వ్యవహారాల కార్యదర్శిగా పనిచేస్తుండేవాడు; ప్రస్తుతం గ్రీసులో అమెరికన్ రాయబారిగా వున్నాడు. కబురు తెచ్చిన రాయబార కార్యాలయోద్యోగితో "ఆ ఉత్తరం ఇవ్వడానికి అతగాడు నాదగ్గరకు వస్తే, గెంటించివేస్తా," అని తనన్నట్లు నాసర్ చెప్పుకున్నాడు.

"లేఖ ఇవ్వడానికి వస్తే నేను గెంటించివేస్తా; ఉత్తరం ఇవ్వకుండా స్వదేశానికి తిరిగిపోతే, ఉద్యోగంనుంచి అమెరికా గెంటివేస్తుంది. పాపం ఏంచేస్తాడు! అతగాడు! చివరకు ఆ లేఖ ఇవ్వకుండానే తిరిగిపోయాడు," అని నాసర్ వ్యాఖ్యానించాడు. సూయజ్ కంపెనీని తాము స్వాధీనం చేసుకొన్నప్పటికీ యథాప్రకారంవివిధ దేశాలకూ నౌకాయాన సౌకర్యం లభ్యమవుతుందనీ, ఇకమీద నౌకాయానపు రుసుములన్నిటిని ఈజిప్టు ఏర్పాటుచేసిన వ్యవస్థకే చెల్లించవలసి వుంటుందని కైరో ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

(56-వ పేజీ చూడండి)

గీర్వాణ భాషాభ్యాసం

౧౧

(గత సంచిక తరువాయి)

అటు పిమ్మట ఇంకొక ఆరుమాసాలకాలం గడిచి పోయేసరికి గుణాఢ్యుని బృహత్కథామహా కావ్యరచన సమాప్తమై పోయింది. ఆ ఆరుమాసాలలోను గుణాఢ్యుడు మరి ఒక లక్ష శ్లోకాల గ్రంథం రచించాడు. మొత్తంమీద బృహత్కథ అంతా ఏడు లక్షల శ్లోకాల మహాకావ్యంగా అవతరించింది.

"వ్యాసమహర్షి మహాభారతం దీని ముందిక దిగదుడుపే! ఎన్నెన్ని రోమహర్షణ ఘట్టాలు! ఒక మహాగాథలో ఇంకొకకథ చొప్పున ఎన్నెన్ని చిత్రవిచిత్రమైన చరిత్రలు దొర్లిపోయాయి! ఎన్నెన్ని దేవమానవ గంధర్వ గాథలు!"

అని నందివర్మ ఆ మహాకావ్య రచనకెంతైనా మురిసిపోయాడు. కాని అరణ్యంలో శబరులు మొదలైన ఆటవికులా కావ్యగాథా గానం చేసినంత మాత్రాన ప్రయోజన మేమీ లేదనీ తాను లిఖించిన మాతృకననుసరించి కరపరంపరగా ఎన్నెన్నో ప్రతికలావిర్భవించాలనీ, ప్రతిష్ఠాననగర విద్వాంసు లందరు స్వయంగా ఆ మహాకావ్య ప్రతికలు చదివి హర్షించాలనీ అనుకొన్నాడు.

అయితే ఇంకా కొన్ని ప్రతులు వ్రాయించడానికి శాల చక్రవర్తి ఆదరం అత్యంతావశ్యమని అతనికి తోచింది. లేకపోతే బృహత్కథ ఆటవికుల గేయరూపం కొంతకాలం నిలబడి ఆపైన క్రమక్రమంగా ఖిలమై నశించి పోగలదని భయంవేసింది.

కాని గుణాఢ్యుడు శాల చక్రవర్తి మాట పొత్తిగా చెవికెక్కనియ్యడం లేదు. అందుచేత ఆ విషయం ఆయన దగ్గర ప్రస్తావించి ప్రయోజనం లేదు. అయితే మరి గత్యంతరం?

నందివర్మ కేమీ పాలుపోక ఒకనాడా విషయం గుణసేనునితో ప్రస్తావించాడు.

గుణసేనునికి కూడా కొంత కాలాని [illegible] మహాగ్రంథం ఖిలమై పోగలదని భయంవేసింది. కాని ఆ విషయంలో శాల శాతవాహన చక్రవర్తి ఆదరం అర్థించడం అతనికేమీ నచ్చలేదు.

"నేను కూడా చక్రవర్తి సాహాయ్యం అర్థించ దలుచుకోలేదు. ఒకసారి ఆయన సమక్షంలో ఆమహాకావ్య ప్రశస్తినిగురించి ప్రసంగిస్తాను. ఆ గ్రంథంలో కొన్ని ఘట్టాలాయనకు స్వయంగాచదివి వినిపిస్తాను. ఏది ఏమైనా చక్రవర్తి ప్రాకృత కవితాభిమానులు గదా!

నూతనంగా పైశాచీ ప్రాకృతంలో అవతరించిన బృహత్కథ విని చక్రవర్తి ఎంతైనా ఆనందిస్తారనే అనుకొంటున్నాను. ఆయన ఆనందిస్తే గ్రంథవ్యాప్తి కెట్లైనా సదుపాయం చెయ్యకుండా ఉంటారా?" అన్నాడు. "ఇది ఆచార్యునికి తెలిస్తే వ్యవహారం చాలా విషమిస్తుందేమో!" అన్నాడు గుణసేనుడు.

"ఆయనకు తెలియకుండా నేనీ కార్యం సానుకూలపరుచుకొని వస్తాను గదా!"

ప్రాచీన గాథాలహరి

అన్నాడు నందివర్మ.

"తీరా పోనీ చక్రవర్తి ఆదరణ అంటే ఆచార్యులంగీకరించకపోతేనో!"

"అంతవరకు వచ్చిన తరువాత ఆయన మాత్రం కాదంటారా? అది నేను చూసుకుంటానులే!" అన్నాడు నందివర్మ.

ఆచార్యుడు వింధ్యవాసిని సన్నిధికి వెళ్ళి పోయినప్పటినుంచీ చక్రవర్తికావిషయంలో బాగా పశ్చాత్తాపం కలిగిందని నందివర్మకు కొంచెం మాచాయగా తెలిసింది. అందుచేతనే చక్రవర్తిసమక్షంలో బృహత్కథను గురించి ప్రసంగించడంవల్ల తాను తలపెట్టిన కార్యం సానుకూలపడవచ్చునని అనుకొన్నాడు. అదీగాక కాలం గడిచిన కొద్దీ గుణాఢ్యునికి చక్రవర్తిపై కలిగిన క్రోధంకూడా కొంతవరకు ఉపశమించింది. ఆ కారణాలన్నిటివల్ల తన సంకల్పం నెరవేరవచ్చునని బృహత్కథ బాగా వ్యాప్తి పొందవచ్చునని నందివర్మకు ధైర్యం కలిగింది.

తరవాత ఒకనాడతడాచార్యునికి తెలియకుండానే ప్రతిష్ఠానగరం వెళ్ళిపోయాడు. కాని ఎంత ప్రయత్నించినా నందివర్మకు చక్రవర్తిదర్శనందొరకలేదు. రాజద్వారంలో ప్రతీహారులుకూడా గుణాఢ్యమంత్రి శిష్యుడన్నమాట చెవిని పడగానే ఈసడించి మాట్లాడారు.

ఇక నందివర్మకేమి చెయ్యడానికీ పాలుపోక విదూషకుడు విశ్వంభరశర్మకా విషయం తెలియజేశాడు. విశ్వంభరశర్మకాచార్యునియెడల అఖండమైన భక్తిప్రపత్తులున్నాయనీ అందువల్ల అతడా విషయంలో సాయపడగలడనీ గ్రహించి నందివర్మ అతని ఆవిధంగా సాహాయ్యం అర్థించాడు.

విదూషకుడా ప్రార్థనవిని బాగా దీర్ఘాలోచనలోపడ్డాడు. కొంచెం సేపాలోచించి నందివర్మకేసి చూచి గుంభనగా ఒక చిన్ని చిరునవ్వు చిందించాడు.

"నందీ! చక్రవర్తిసందర్శనం కోసం నీ వింత శ్రమపడనక్కరలేదు. నేనే నిన్ను నావెంటబెట్టుకొని ప్రభు సన్నిధికి తోడుకు పోగలను. కాని ఒక్క మాట! నీ వొక్కసారివెళ్లి శర్వవర్మామాత్యులనే ఆదర్శనం ఇప్పించవలసిందని ప్రార్థిస్తావా!"

"అబ్బే! అది లాభంలేదు! ఇందులో ఆయన సాయపడతాడా ఏమన్నానా? నేనాయన దగ్గరికి వెళ్లేదిలేదు!" అన్నాడు నందివర్మ.

"పోనీయవయ్యా! ఆ మాట ఆయన నోటినించేరానీ! అపైన నేనున్నాను గా!" అన్నాడు విదూషకుడు.

"అసావాదిత్యో బ్రహ్మ అని ఆ డొంక తిరుగుడు వ్యవహారం ఎందుకు?" అన్నాడు నందివర్మ.

"అదిగో! అదే పరమ ఛాందసం అంటేను! ఎదటి పెద్ద మనిషి ఎందుకు మాట్లాడుతున్నారో కూడా గ్రహించుకోలేరు! మళ్లీ పెద్ద పెద్ద మహావిద్వాంసులమని విర్రవీగు

పి. గణపతిశాస్త్రి

★ గీర్వాణ భాషాభ్యాసం ★

లారు!" అన్నాడు విదూషకుడు కొంచెం వెటకారంగా.

"శర్వవర్మామాత్యుల కిదంతా తెలిస్తే వ్యవహారం అంతా పూర్తిగా చెడుతుం దేమో!"

"చెడనీ! అపైన నేనున్నానుగా! నీకెందుకు భయం!" అన్నాడు విదూషకుడు.

ఇక నందివర్మ ఏమి చెప్పడానికీ పాలుపోలేదు. వెంటనే శర్వవర్మామాత్యుని భవనానికి వెళ్ళిపోయాడు. మంత్రి నందివర్మను చూడగానే, చాలా చాలా గౌరవించాడు. స్వయంగా తన భవంతిలోనే అతనికి విడిది ఏర్పాటు చేయించాడు. గుణాఢ్యామాత్యుని గురించి ఎన్నెన్నో కుశలప్రశ్నలడిగాడు.

ఆ ధోరణిచూచి నందివర్మ మొట్టమొదటగా తన కన్నులే నమ్మలేక పోయాడు. శర్వవర్మామాత్యులింతటి సత్పురుషులని నాకింతకుముందెన్నడు చూచాయగానైనా తెలియలేదే! అని తనలో తానెంతో చింత పడ్డాడు.

తరవాత వినయంగా తన అభ్యర్థన శర్వవర్మకు తెలుపుదల చేశాడు. శర్వవర్మ అదంతా ఎంతో ఆప్యాయంగా, అతి శ్రద్ధగా ఆలకించి నెమ్మదిగా బుజగించాడు:

"నాయనా! ప్రభువుల దగ్గర పొందికగా, అతికినట్టుగా మాట్లాడడమనేది మాటలతో పనిగాదు! నీకెందుకా శ్రమ అంతాను! నేనే స్వయంగా ఆ విషయం ప్రభువుగారికి పూర్వాపరాలతో సహా విశదపరిచి క్షణంలో ఆ వ్యవహారం అంతా సానుకూలపరుచుకొని వస్తానుగదా!"

ఆ భరవసాతో నందివర్మ బ్రహ్మానందభరితుడై ఒక్కమారుగా ఉబ్బి తబ్బిబ్బైపోయాడు!

అటుపిమ్మట నాలుగైదు రోజులదాకా నందివర్మ మళ్లీ ఆ విషయం ప్రసంగించలేదు. అలాగలాగ రోజులు గడిచిపోయినా శర్వవర్మ తిరిగీ ఆ ప్రసంగం ఎత్తేధోరణే కనిపించలేదు! ఇక వేచిఉండలేక నందివర్మే శర్వవర్మామాత్యునితో తాను వచ్చినపని ఏమైనదని అడిగాడు. శర్వవర్మ బాగా గాఢాలోచనలో పడ్డాడు.

"అయితే నాయనా! గుణాఢ్యామాత్యులీమధ్యన ఎప్పుడైనా చక్రవర్తిని గురించి ఛలోక్తులేమైనా విసిరారా?" అన్నాడు.

"ఎందుకలా అడుగుతున్నారు?"

"కొంచెం అవసరమే వచ్చిందిలే! ముందు నేనడిగినదానికి సమాధానం చెప్పు!"

"వారికి ఛలోక్తులతో పనేముంది! అసలే వస్తే బాహాటంగా [illegible] అనేస్తారే!"

"అదే ప్రస్తుతం మన కొంపముంచింది!"

"ఏమి జరిగింది!"

"కిట్టనివాళ్లలో గోరంతలు కొండంతలు చేసి అవన్నీ చక్రవర్తిగారికి మోసుకు పోయారు!"

"చక్రవర్తి ఆస్థానంలో ఆయన కంత కిట్టనివారెవరూ లేరే!" అన్నాడు నందివర్మ ఎంతో అమాయకంగా.

"అయ్యో వెర్రివాడా! ఇక్కడ గోడలు కూడా ఒకరి ఉన్నతిచూచి సహించలేవయ్యా!"

"ఇంతకీ ఏమయింది?"

"కావడానికేముంది? చక్రవర్తి గుణాఢ్య పండితులమాట పొత్తిగా చెవికెక్కనియ్యలేదు!"

"ఏమన్నారు?"

"అనడానికేముంది! అనార్యమైన అపశబ్దాల భాషలో కావ్య వ్యాసంగమేమిటండీ! అని ఈసడించి కొట్టిపారేశారు."

ఆమాటవిని నందివర్మ నిలువునా నీరయిపోయాడు. తాను వచ్చినపని అంతా సానుకూలపడిపోయినదని అనుకొన్న అతని కదంతా ఒక పెద్ద పిడుగులా విరుచుకుపడింది.

ఆ తరవాత నందివర్మ ఎంతో మర్యాదగా శర్వవర్మదగ్గర సెలవుతీసుకొని వెంటనే విశ్వంభర శర్మగృహానికి వెళ్ళి జరిగినదంతా అతనికి పూసగుచ్చినట్లేకరువు పెట్టాడు. విదూషకుడదంతా విని ఒక్కమారుగా విరగబడి నవ్వాడు! నందివర్మకదేమీ బోధపడలేదు.

"ఎందుకలా నవ్వుతారు?" అన్నాడు ఎంతో మథనపడుతూ.

"ఏమీ లేదు! సరిగా నేననుకున్నట్టే జరిగిపోయింది. అందుకనే నాకంత నవ్వు వచ్చింది!"

నందివర్మ ఆ సమాధానం విని ఎంతైనా ఖిన్నుడైనాడు:

"చివరికి మీకుకూడా ఇదంతా వట్టి పరిహాసంగానే తోచిందన్నమాట!"

"నందీ! మన మహారాజులేమో పరబ్రహ్మమనీ, పరమేశ్వరుడనీ అంటారుగాని ప్రపంచం అంతా నాకొక పెద్ద ఛలోక్తిగా వట్టి పరిహాసంగా కనిపిస్తూంది! నువ్వేమనుకున్నా సరే! నాకు తోచినదది!"

"మీకేమి! మీ రదృష్టవంతులు! పొద్దస్తమానము హాస్యప్రసంగాలతో కాలక్షేపం చేస్తారు! నేనిప్పుడు రెండిటికీ చెడ్డరేవణ్ణైనాను! అసలే ఆచార్యుల అనుమతిలేకుండా నేనిక్కడికివచ్చాను. ఆపైన చక్రవర్తి అలాగన్నాక తిరిగీ ఆచార్యులముఖం చూడడానికి కూడా నాకు భయంగా ఉంది!" అని ఎన్నోవిధాల గుంజాటన పడ్డాడు.

"ఏమీ భయపడనక్కరలేదు! అన్నీ సవ్యంగా నడిచిపోతాయి. నేనున్నానన్నానుగా! నీకెందుకా భయం! వింధ్యవాసినీదేవి ఆలయానికివెళ్లి హాయిగా కళ్లుమూసుకు పడుకో?" అన్నాడు విదూషకుడెంతో ధీమాగా.


అత డావిధంగా ఎందుకు భరవసా ఇచ్చాడో నందివర్మకు తెలియలేదు. ఎంతగా అడిగినా కారణం చెప్పలేదు. వ్యవహారమేమీ చెయ్యిదాటిపోలేదని మాత్రమే నొక్కి నొక్కి చెప్పాడు

అటుతరవాత ఇక చేసేదేమీ లేక నందివర్మ తిరిగీ వింధ్యాటవికి వెళ్లిపోయాడు.

—సశేషం.

పువ్వు చెప్పిన కథ

రచన: ఆస్టిన్



విరుద్ధలక్షణాలకు. విభిన్న ప్రకృతులకూ నిలయుడైన జవహర్‌లాల్‌ను అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తే ఎదురయ్యేది పెద్ద ప్రశ్నార్థకమే! ఆగర్భశ్రీమంతుడైన జవహర్ సామ్యవాదాన్ని చేపట్టాడు ఏకాంతాన్ని, ప్రశాంతతనువాంఛించే జవహర్‌లాల్ కోట్లాది ప్రజల నాయకుడుగా, వారి కష్టసుఖాల మధ్య కాలం గడుపుతున్నాడు.

★ పువ్వు చెప్పిన కథ ★



30 ఏళ్ళనుండి ఆయనగురించి ప్రతిరోజూ పత్రికలు ఏదోఒకటి వ్రాస్తూనేఉన్నాయి. ఛాయాచిత్రాలు వేస్తూనేఉన్నాయి. మాటల్నిబట్టి, చేతల్నిబట్టి ఆయనను అర్థంచేసుకోవడానికి, స్వరూప స్వభావాలను సుస్పష్టం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనేఉన్నాయి. అయినా మిగిలేది ప్రశ్నార్థకమే.

ఈ ప్రశ్నార్థకం చాటున ఏముందో తెలుసుకోవడానికి, జవహర్‌లాల్‌కు తోడు నీడలుగాసంచరించిన, ఆయనకు ఆత్మీయులైన వచ్చి పుచ్చుకున్న మహిళల ప్రభావాన్ని పరిశీలిస్తే కొంత వీలు కలుగవచ్చు...

ఈ నాటికీ జవహర్‌లాల్ వదనంలో నిరాశా, నిస్పృహల రేఖలు గోచరిస్తూనే ఉంటాయి. ఆయన ఏకాకితనాన్ని సూచిస్తూనేఉంటాయి. ఆయనకు పంచప్రాణాలూ అయిన సహధర్మచారిణి కమల, ఇరవై ఏళ్ళనాడు జర్మనీలోని ఒక క్షయ విశ్రాంతి కేంద్రంలో ఒకరోజున, ఆయన చేతుల్లోనే కనులు మూసింది.

నెహ్రూ రాజకీయాల గోలనుండి తెరపి చేసుకుని బయటపడే క్షణాలలో మనసు విప్పి మంచీ చెడ్డా, కష్టం సుఖం మాట్లాడుకోవడానికి అభిలషించే సహచరులు మహిళలే. ఈనాడాయనకు నా అన్న వాళ్లలో, అత్యంత ఆత్మీయురాలు, సదా తోడు నీడగా ఉండేదీ ఆయన కుమార్తె ఇందిర.

నెహ్రూ ఆత్మీయులు—ఆయన కుటుంబం, ఆయన ఇద్దరు చెల్లెళ్లు, కుమార్తె ఇందిరాను. పెద్ద చెల్లెలు విజయలక్ష్మి మంచి ప్రతిభావంతురాలు. సోవియట్ యూనియన్‌కు రాయబారిగా వెళ్లిన మొదటి భారత మహిళ ఆవిడే. ఆ తరువాత అమెరికాలో రాయబారిగా ఉంటూ వచ్చింది. ఐక్యరాజ్యసమితి అధ్యక్ష స్థానాన్ని అలంకరించిన మొదటి మహిళ కూడా ఆవిడే. ఇప్పుడు విజయలక్ష్మి లండన్‌లో భారత రాయబారి.

"వాళ్లన్నయ్యమీద ఆవిడ అధికారం చెలాయిస్తుంది" అంటారు కొందరీనాడు.

"నిజానికి భారత దేశంమీద పెత్తనం సాగించేది ఆవిడే" అంటారు కొందరు గంభీరంగా.

ఈ రకం మాటలు విన్నపుడు విజయలక్ష్మి ఛర్రు మంటుంది. "ప్రధాన మంత్రి నాతో ఎన్నడూ, ఆయన ఊహాపోహాల గురించి తర్కించరు" అని ఆమె నొక్కి చెబుతుంది.

నెహ్రూ రెండవ చెల్లెలు కృష్ణ. ఆమె ఎన్నడూ రాజకీయ రంగంలో ప్రవేశించలేదు. ఎంతసేపూ తన సంసారమేమిటో తను నేర్చుకున్న కుట్టు అల్లకం పనులేమిటో, అంతే.

జవహర్లాల్ తల్లిచాటున పెరిగిన బిడ్డడు. చదువుకొనే ఈడు వచ్చాకకూడా ఆవిడ గారాబంకొద్దీ జవహర్‌ను బళ్లో వెయ్యలేదు. గవర్నెస్‌ను కుదిర్చి చదువు చెప్పించింది.

పదమూడవ ఏటనే పెళ్లి అయిన కాశ్మీర

ఈ వ్యాస రచయిత్రి, ప్రసిద్ధ అమెరికన్ పత్రికాధిపతి విలియం రెండాల్ఫ్ హార్‌స్ట్ సతి. "ఆస్టిన్" పేరిట పత్రికా ప్రపంచంలో రచయిత్రిగా ప్రసిద్ధికెక్కింది.

కొంతకాలం క్రితం, హార్‌స్ట్ దంపతులు ప్రపంచ పర్యటన చేస్తూ భారత దేశం వచ్చి, పండిత నెహ్రూను సందర్శించారు.

ఆ గోష్ఠిని పురస్కరించుకొని, హార్‌స్ట్‌సతి 'ఆస్టిన్', నెహ్రూ జీవితంలో మహిళల ప్రభావాన్ని పరిశీలించడం ద్వారా "తనకు గోచరించిన నెహ్రూను" ఇందులో చిత్రించింది.

ఈ దృష్ట్యా ఈమె వ్రాసిన వ్యాసాన్ని "ఆంధ్ర పత్రిక" ప్రచురిస్తున్నది. కింగ్‌ఫీచర్ సిండికేట్ పంపిన ఈ వ్యాసంపై హక్కులు 'ఆంధ్ర వారపత్రిక'వే.

సం॥



విజయలక్ష్మి

సుందరి స్వరూపరాణి, కులదీపకుడు జవహార్ మీద పంచ ప్రాణాలూ పెట్టుకుని, కంటికి రెప్పలా పెంచుకుంటూ వచ్చింది. స్వరూపరాణి సంప్రదాయం కలవారి ఇంట పుట్టి పెరిగిన యువతి. ఆచార సంప్రదాయాలంటే ఎనలేని గురి, గౌరవం ఉన్న మహిళ. పండిత మోతీలాల్ వేష భాషలలో భోజనాదికాలలో పాశ్చాత్య పద్ధతులు అవలంబించడంతో, ఆమె కూడా ఆయన అభిమతాలకు అనుగుణంగా నడుచుకుంటూ వచ్చింది.

అయితే ఆ పద్ధతులన్నీ ఆమెకు కొంత కలత కలిగించేవి.

పెంకిపిల్లవాడు జవహార్ గురించి కూడా ఆమె బెంగపెట్టుకునేది.

ఒకరోజున ఒక జ్యోతిశ్శాస్త్రజ్ఞుడు వచ్చి, జవహార్ లాల్ చాలా గొప్పవాడు అవుతాడని చెప్పాడు.

స్వరూపరాణికి ఆ మాట నమ్మకం కుదర లేదు తన కొడుకు పెంకితనం, ఆ పట్టుదలా చూస్తూవుంటే. అంత పెంకివాడూ ఉండుండి పరధ్యానంలో పడిపోతూ ఉండేవాడు.

తండ్రి అంటే జవహార్ లాల్ కు అమిత భయం. అయితే, అస్వస్థతో ఎపుడూ తీసుకునే తల్లి తననే వెనకేసుకొస్తుందని ధైర్యం. ఒక రోజున, వాళ్ళ నాన్నగారి బల్లసొరుగులో ఫౌంటెన్ పెన్ దొంగిలించాడు. ఆయన ఈ అల్లరిపిల్లవాణ్ణి పట్టుకొని చెంపలు వాయించేశాడు.

జవహార్ లాల్ కు ఆరోజు బాగా జ్ఞాపకం. "ఒక వంక నొప్పి. మరోవేపు, అభిమానం పౌరుషం ముంచెత్తుకొచ్చాయి. తిన్నగా అమ్మదగ్గరికి పరుగెత్తాను. అమ్మ ఏమీ అనదు. నేనేం చేసినా నయానచెప్పి లాలిస్తుందని తెలుసు" అంటారాయన.

నెహ్రూ పూర్వీకులు కాశ్మీరి బ్రాహ్మణులు. మొగల్ చక్రవర్తుల కొలువులో పెద్ద పెద్ద పదవులు నిర్వహించారు. విద్వాంసులు. ఆదిలో వారి కుటుంబనామం నెహ్రూ కాదు. కౌల్. ఒకప్పుడు ఒక చక్రవర్తి ఒక నహార్ (కాలువ) పక్కన ఉన్న చక్కని ప్రాసాదాన్ని వీరి కుటుంబానికి కానుకగా ఇచ్చాడు. దరిమిలా వీరిని "కౌల్ నహార్" అంటూ ఉండేవారు. ఆ పిలుపే క్రమంగా "కౌల్ నెహ్రూ" గా మారిపోయింది. మరి కొంతకాలానికి "కౌల్" అన్న పేరుపోయి 'నెహ్రూ' కుటుంబనామంగా మిగిలింది.

పదకొండేళ్లు, ఒక్కగానొక్క బిడ్డగా అల్లారుముద్దుగా తల్లిచాటున పెరిగాడు నెహ్రూ.

"అందరికీ అక్కచెల్లెళ్లు అన్నదమ్ములు ఉన్నారు. నాకు మాత్రం ఎవరూ లేరని ఒక్కణ్ణీ ఉన్నపుడు దిగులుపడేవాణ్ణి



కమల

అప్పట్లో" అంటారు నెహ్రూ. ఆయన పన్నెండో ఏట చెల్లెలు పుట్టింది.

అమ్మనీ నాన్ననీ వదిలి పరాయిచోట ఉండగలడని తోచగానే పండిత మోతీలాల్ జవహార్ ను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చేర్పించారు.

అపట్లో నెహ్రూ చదువు అంతంత మాత్రంగానే ఉండేదట!

ఇంగ్లాండ్ లో ఉండగానే, కలవారి బిడ్డడు, రూపసి అయిన నెహ్రూకు పెళ్ళి సంబంధాలు వస్తూఉండేవి.

"కాలేజిలో మేమంతా నవీనభావాలు కలవాళ్లం అని అనుకునేవాళ్లం నీతి అవి నీతులగురించి, సెక్సుగురించి అనుభవజ్ఞుల మల్లె చాలా గంభీరంగా, మాట్లాడుకునే వాళ్లం" అంటారు నెహ్రూ.

కబుర్లు ఎంత గంభీరంగా చెప్పుకున్నా, వాస్తవంలో సెక్సుసమస్యలను ఎదుర్కొనే టప్పుడు అంతా భయపడేవాళ్ళే. అందరికీ జంకేనట.

"నామటుకు నేనంటే. చాలా ఏళ్ళ వరకూ—కేంబ్రిడ్జినుండి వెళ్లిపోయిన కొంత కాలంవరకూ కూడా సెక్సువిజ్ఞానం అంతా సిద్ధాంతాలలోనే" అంటారాయన...

జవహార్ లాల్, రెండో చెల్లెలు కృష్ణతో కొన్నాళ్లు పారిస్ లో ఉండడం జరిగింది. ఆ అమ్మాయి పద్ధతులు జవహార్ కు అట్టే నచ్చలేదు కాబోలు. చివరికి ఒక రోజున

★ పువ్వు చెప్పిన కథ ★

చాలెన్ని శాస్త్రములందలించి, హితబోధ చెయ్యడానికి సిద్ధపడాడు.

కృష్ణ ఈముచ్చట, ఒకసారి, జవహార్‌లాల్ గురించి వ్రాస్తూ, ఆనాటి సన్నివేశాన్ని వివరించింది:

"ఆఁ...ఇదుగో చూడూ, కృష్ణా...... నీకో సంగతి చెప్పాలి..." అంటూ ప్రారంభించారట ఆరోజున.

అనుంగు సోదరుడు ఏదో చెప్పబోతున్నాడని ఆమె చెవులు అప్పగించింది.

"అదే అదే. చూడు......నువ్వు నాకనుకో, ఇపుడూ......నువ్వు చాలామంది ఫ్రెండ్సుతో షైర్లు చెలాయిస్తున్నావా,... అహాఁ...అది మంచిదే అనుకో. సహజమే అనుకో...అయితే చూశావూ...నీకు తెలుసనుకో....నీ కేమిటి, ఏ ఆడపిల్లకైనా తెలుస్తుంది; తెలియాలి...ఏమిటంటే......" అక్కడిదాకా వచ్చిన జవహార్‌లాల్‌కు, వాక్యం కుదరక విసుగెత్తింది. చిరాకేసింది. "హాఁగాడ్...."అంటూగొణుక్కున్నాడు.



ఎడ్వినా

స్వతహా, గంభీరంగా ఉంటే, ఆలోచించే, అన్నయ్య ఇలా మాటలు తడువుకుంటూ, అవస్థపడుతూ తలక్రిందులైపోతూ ఉంటే, చూడ్డం 19 ఏళ్ల కృష్ణకు సరదా. అలాగే సరదాగానే నవ్వుతూనే వింటూ చూస్తూ నిల్చుంది.

ఇంతకీ అన్నయ్య చెప్ప దలచుకున్నదేమిటో చెబుతున్నదేమిటో మాత్రం ఆ అమ్మాయికి అంతుపట్టలేదు.

"ఆడపిల్ల మొగాళ్లతో అలా తిరిగితే ఏంజరిగినా జరగొచ్చు. ఆసంగతి తెలీదు?" అన్నాడు అన్నయ్య తమాయించుకుంటూ, తడుముకుంటూ.

"ఏమౌతుందేం?" అంది కృష్ణ పెంకిగా.

అన్నయ్యకి, అక్కడితో చిరాకు వేసింది. నీకు చెప్పలేను బాబూ అన్నట్టు రెండు చేతుల్తో తల కొట్టుకున్నాడు. అంతలో తిక్క రేకెత్తుకొచ్చింది.

"ఇడియట్! నువ్వనేనా ఫ్రెండ్‌తో షికారెళ్తే, వాడు...ముద్దుపెట్టుకోడానికి ప్రయత్నించడూ?...అదీ."

"అలా ఎందుకు జరగాలి" అంది కృష్ణ కుతూహలం ప్రదర్శిస్తూ.


"ఓ! గాడ్!" అన్నాడు అన్నయ్య. అని అక్కడితో వాదించే ప్రయత్నం విరమించుకున్నాడు.

అప్పుడేకాదు, జవహార్‌లాల్ ఎప్పుడూ ఆడవాళ్లతో చివరకంటా వాదించి నెగ్గాలని చూడడు. మధ్యలో మాట్లాడ్డం మానేసి, వాళ్లమాటలు వింటూ ఊరుకుంటాడు.

నెహ్రూ జీవితంపై బలవత్తర ప్రభావం చూపిన మహిళలలో అనిబిసెంట్ ముఖ్యురాలు. థియొసాఫికల్ సొసైటీలో ఆమె వాగ్ధాటిని చూచిన నెహ్రూ ముగ్ధుడైపోయాడు. నెహ్రూ 13-వ ఏటనే అనిబిసెంట్‌ను చూడడం ఆమెపట్ల గౌరవం కుదరడం జరిగాయి ఆమె స్వయంగా, నెహ్రూకు శిష్యరికం ఇప్పించింది.

అనిబిసెంట్ జైలుకు వెళ్ళినరోజున, జవహార్‌లాల్ ఆమె ధైర్యసాహసాలకి ముగ్ధుడైపోయాడు. ఆరోజులలో స్వాతంత్ర్యోద్యమంతో దేశంలోని రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా ఉండేది ఆరంగంలో కాలుపెడితే చాలు, తానుకూడా అనిబిసెంట్‌లా చిటికెలో కారాగార ప్రవేశం చేయవచ్చునని నెహ్రూ గ్రహించాడు. సిరిసంపదలు, తనకుగల భద్రత, కోడా ఏవీ అడ్డురాలేవని అప్పుడే తట్టి ఉంటుంది.

స్వాతంత్ర్య సమరంలో ప్రవేశించాలన్న సంకల్పం కలిగినా, కొంతకాలం వరకూ అది సిద్ధించలేదు.



పండిత మోతీలాల్, జవహార్‌కు మంచి సంబంధం చూశారు. కాశ్మీర బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కమల అనే కుసుమ సుకుమార సుందరిని జవహార్‌కు ఇచ్చి వివాహం చేశారు. 1916-లో ఢిల్లీనగరంలో మహా వైభవంగా ఈ వివాహం జరిగింది. నవదంపతులు మనోహరమైన కాశ్మీరు సీమలో కొంతకాలం విహరించారు.

కొద్దిరోజుల తరువాత జవహార్‌లాల్ స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించాడు. అక్కడితో జవహార్ వైవాహికజీవిత సౌఖ్యానికి దూరమయ్యాడు. విశ్రాంతి, ప్రశాంతత ఉండేవికావు. కారాగారంలో ఉన్నపుడు, స్వేచ్ఛగా, సంతోషంగా గడిపినరోజులు తలపుకు వచ్చేవి. జీవితం వృథాయమయిపోయినట్టు సాగింది...తనకు కలిగిన ఆశలు, కోరికలు ... లక్ష్యాన్ని తలచుకొని సమాధానపడడం...సౌఖ్యాన్ని త్యాగం చేయడం, కష్టాలు ఎదుర్కొనడం, భరించడం పరిపాటి అయిపోయింది...

నెహ్రూ భార్య కమల సుకుమారి. బహు నెమ్మదిస్తురాలు. సహనశీల. ఎటొచ్చి ఇంటికోడలు. ఈ కోడలమ్మకూ, తెలివితేటలూ, చురుకుపాలూ మేళవించిన ఆడపడుచు విజయలక్ష్మికి ఏమంత అమోఘమైన పొత్తు అనురాగం పెల్లుబికేవి కావు. వదినా మరదళ్ల పొరపొచ్చాలు తప్పేవికావు. అసలు విజయలక్ష్మిని ఇంట్లో అంతా

"వాన్" అనేవారు. "వాన్" ధాటీ చెలాయించలేయేది. కమల మొరాయించేది. అయినా, బొరెందుకనుకుని, కమలే నిభాయించుకుని, నిగ్రహించుకుని తగ్గిపోయేది.

జవహర్ దంపతులు పెళ్లి అయిన తరువాత రెండుమూడేళ్లు చీకూచింతా, బెంగా బెసదా లేకుండా, డబ్బు సమకూర్చగల సౌఖ్యాలనీ అనుభవిస్తూ ఆనందంగా రోజులు గడిపారు.

1919 లో జవహర్‌లాల్ భారత రాజకీయ సంగ్రామరంగంలోకి లంఘించాడు. గాంధీజీ నాయకత్వాన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని కారాగారానికి వెళ్ళడం ప్రారంభించాడు. వినమ్ర భావంతోనే ఖైదులోకి వెళ్లేవాడు. ఐనా వదనంలో విజయగర్వం ఉట్టిపడేది.

కులదీపకుడి ధోరణి తండ్రి మోతిలాల్‌కు నచ్చలేదు. ఇద్దరూ తీవ్రాతితీవ్రంగా ఈవిషయమై వాదించుకునేవారు.

ఏడాది తిరిగేసరికి పండిత మోతిలాల్ కుమారుడితో భుజం కలిపి, స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటున్నారు.

దాదాపు తొమ్మిది సంవత్సరాలపాటు తండ్రి కొడుకులు దేశస్వాతంత్ర్యం కోసం కలిసి పోరాటం సాగించారు.

బ్రిటిషువారి ఖైదులలో కష్టాలుపడ్డ మోతీలాల్‌కు క్రమంగా ఆరోగ్యం దెబ్బతిని పోయింది. అస్వస్థులై మంచంపట్టారు. ఆయన అంతిమ ఘడియల గురించి జవహర్‌లాల్ వ్రాసుకున్న వాక్యాలు:

"ఆరోజున నేను ఆయన మంచంనగ్గరే కూర్చున్నాను. నిద్రపోతున్నారనుకున్నాను. నా కన్న మాతల్లి గారి దృష్టి నిశితమైనది. హఠాత్తుగా ఆమె ఒక్క కేక పెట్టింది. గోల చేయవద్దని, ఆయన నిద్ర చెడుతుందని మందలించాను నేను... అయితే అదే దీర్ఘ నిద్ర అయి పోయింది... ఆయనకు తిరిగి మెలకువ రాలేదు."



* * *

కమల, భర్తతో పాటు పల్లె పల్లెలా పర్యటిస్తూ అహింసా, స్వాతంత్ర్య సందేశాలను ప్రచారం చేయసాగింది. నిర్విరామమైన ఈ పర్యటనలవల్ల ఆమె ఆరోగ్యం దెబ్బతినసాగింది. ఏనాడూ ఆమె తనసుఖం సంగతి గాని, ఆరోగ్యం సంగతిగాని పట్టించుకుని ఎరగదు.

క్షయ అన్నారు. స్విట్జర్లాండ్ లో రెండేళ్ళు చికిత్స చేయించారు... తగ్గిందనుకున్నారు. కాని, తిరిగి ప్రకోపం కనబడింది. అయినా, ఆమె నిర్విరామంగా ఉద్యమ కార్యకలాపాలలో పాల్గొంటూ వచ్చింది. భర్తలాగే, ఆమెకూడా చెరసాల కటకటాల వెనుక చిరకాలం గడిపింది.

నెహ్రూ మొట్టమొదటిసారిగా ఖైదుకు వెళ్ళింది 1920 లో. ఆతరువాత అది పరిపాటిగా పరిణమించింది. ఎప్పుడూ జైలుకు వెళ్లడమో, వెళ్ళేపరిస్థితిలో ఉండడమో... ఈ చెరసాలే జవహర్ దంపతుల జీవితాలలో ఆనందమయ ఘడియలను చాలవరకు హరించివేసింది

కమల సుకుమార శరీరం క్రమంగా క్షీణించ సాగింది... నెహ్రూ ఇలా వ్రాసుకున్నారు:

"...రోజులలో కమల పసిపోరిగ ...రిలా భాసించేది. చాలా రోజుల ... నాడు, మా యింటి గుమ్మంలో అడుగు పెడుతున్న పెళ్లి కూతురా— అనిపించేది.

ఆ నాడు 17 ఏళ్లు ఉండేవేమో... సన్నగా బక్కపలచగా ఉండేది. కల్లాకపటం ఏకోశానా లేని పిల్ల. ఆనాడు మా ఇంటికొచ్చిన ఈ అమ్మాయి మనసు అతిసున్నితమైనదని... పుష్పంలా అతి నెమ్మదిగా వికసించే ఆ మనస్సును ఎంతో జాగ్రత్తగా, సున్నితంగా, మృదువుగా సాకాలనీ నేనుఅప్పుడు ఆనాడు బాగా గ్రహించలేదు... ఇప్పుడు ఈనాడు ఈ సుందరివన్న



ఇందిర

★ పువ్వు చెప్పిన కథ ★



వదలివెళ్లిపోతుందన్న ఆలోచన భరించ లేనిది..."

1936 వ సంవత్సరం. జర్మనీలో కమల కనులు మూసింది. అంతటితో జవహార్ లాల్ జీవితంలో ఒక అధ్యాయం ముగిసింది...

"ఆమెలో దృగ్గోచరం కాని మార్పేదో కలిగినట్లనిపించేది.

'ఎవరో పిలుస్తున్నారు అనేది....అదుగో ఎవరో వస్తున్నారు...అదేదో ప్రవేశిస్తుంది అనేది.

"ఫిబ్రవరి 28 వ తేదీ ఉదయం ఆమె అంతిమశ్వాస విడచింది...ఆమెను శ్మశాన వాటికకు తీసుకొని వెళ్లారు...కొది నిముషాలలో ఆ సుందర వదనం, సుకుమార శరీరం...అదృశ్యంఅయిపోయాయి. మిగిలినది –

కుమార్తె ఇందిరకు అప్పుడు 19 వ ఏడు. ఆమెను ఇక్కడే బడిలో చేర్పించి, జవహార్ లాల్ స్వదేశం బయల్దేరారు. ఏకాకినన్న భావం ఆవరించింది... "ఇంటికి బయల్దేరాను కాని, అది అసలు నాకు ఇల్లే కాదనిపించింది. నా పక్కన సజ్జలో చిన్న పేటిక ఉంది. అందులో కమల అవశేషాలున్నాయి... మేము కన్న కలలన్నీ ధగ్ధం అయిపోయాయి. చివరకు మిగిలినవి అస్తికలు..."

కొద్దికాలం తరువాత జవహర్లాల్ తల్లి స్వరూపరాణి కూడా గతించడంతో, గతంతో ఆయనకున్న ఆఖరి బంధం కూడా తెగిపోయింది..."

నాటి దిగులు ఏకాకినన్న వేదన నేటికి చాలవరకూ తగ్గిపోయాయి. ఇప్పుడు రొండ తెరిపి లేకుండా విదేశీ రాయబారులను ఇతర ప్రముఖులను సత్కరించడంలో మంచీ చెడ్డ మాట్లాడడంలో సరిపోతోంది.

పండిత నెహ్రూ వేకువనే నిద్రలేస్తారు. ఉదయం కొంచెం ప్రొద్దు తిరిగే వరకూ చెల్లెళ్లు విజయలక్ష్మి, కృష్ణాహతీ సింగ్ లతోనూ, కుమార్తె ఇందిరతోనూ కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తారు. అలవాటైన పాశ్చాత్య పద్ధతిలోనే ఉదయం "బ్రేక్ ఫాస్ట్" (ఓట్ మీల్, గుడ్లు, టోస్టు, కాఫీ, పండ్లరసం) ఆరగిస్తారు.

మధ్యాహ్నం భోజనానికి ఏర్పాట్లు, అతిథుల విషయం, సాయంకాలం పార్టీల విషయం కుమార్తె ఇందిర చూసుకుంటుంది. నెహ్రూ ఇంట జరిగే పార్టీలలో "కాక్ టెయిల్స్" ఉండవు. పార్టీలు రాత్రి 11 గంటలకల్లా అయిపోతాయి!

జవహర్ లాల్ నెహ్రూపట్ల అమితమైన భక్తిప్రపత్తులు, గౌరవం, ఆరాధనాభావం గల వారిలో ఒక యువతికి, ఆయన పార్టీలలో పాల్గొనే అదృష్టం ఎన్నడు లభించలేదట. నిజానికి ఆమె నెహ్రూ పరిచితురాలు కాదు. అయినా, నెహ్రూ ప్రతిరోజూ కోటుకు గుచ్చుకొనే 'పసుపుగులాబీ' పువ్వు అక్కడ ఉండడానికి ఆమే కారణమని చెబుతారు.

ఆ అమ్మాయి పేరేమిటో, ఊరేదో ఎవరికీ తెలియదు. రోజూ ఉదయం కార్యాలయానికి బయలుదేరే వేళకి ఆ అమ్మాయి, వచ్చి ఆయనను చూడడంకోసమని గుమ్మంలో కాచుకు నిలబడి ఉండేదట.

వర ఒక రోజున జవహర్లాల్ దర్శనం లభించింది.

అప్పుడా అమ్మాయి, సిగ్గుపడుతూ, తల వంచుకునే ఒక "పసుపుగులాబీ" పువ్వును ఆయన చేతికి అందిచ్చింది.

నెహ్రూ ఆ పువ్వును స్వీకరించి కారెక్కారు. కారు వెళ్లిపోయింది.

ఆ అమ్మాయి ఆ మర్నాటి ఉదయం కూడా ఆ వేళకే వచ్చింది. మళ్ళీ మందహాసం చేస్తూ సుందరమైన గులాబీని అందించింది.

తరువాతిరోజూనా ఆ మర్నాడూ అలాగే జరిగింది.

కొన్ని నాళ్ళపాటు ఆ అమ్మాయి అలా వేళకు వచ్చి పువ్వునిచ్చి వెళ్లేది.

ఆదిలో నెహ్రూ కొంత చిరాకు పడ్డారు. తరువాత ఆశ్చర్యపడ్డారు.

ఆపైన ఆనందమందారు.

ఆ అమ్మాయి పువ్వునిచ్చినపుడల్లా, వెంటనే దానిని, ఆప్యాయంగా కోటు బటన్ హోల్ లో గుచ్చి అలంకరించుకొనే వారు.

ఒకరోజున ఆ అమ్మాయి రాలేదు.

ఏ కారణంచేతనో మర్నాడుకూడా రాలేదు.


ఆ తరవాత, ఒకరోజున జవహర్ లాల్, తోటమాలిని పిలిపించి, ప్రతి ఉదయం ఓ పసుపుగులాబీ తెచ్చి పెట్టమన్నారట.

ఆ గులాబీపువ్వు రోజూ నెహ్రూ కోటును అలంకరించి మధుర పరిమళాలు గుబాళిస్తు ఉంటుంది.

నెహ్రూ గౌరవాభిమానాలకు పాత్రులైన మహిళలలో లార్డు మౌంట్ బాటన్ సతి ఎడ్వినా సింథియా మౌంట్ బాటెన్ ఒకర్తె. ఎడతెరిపి లేకుండా కబుర్లు చెప్పడం, ఏదో ఒక విషయంమీద వాదం వేసుకోవడం ఎడ్వినా పద్ధతి. కబుర్లు, వినడం చెప్పడం, వాదంవేసుకొని మధ్యలో ఆగిపోయి ఎవరి వాళ్లమాటలు వింటూ ఆనందించడం నెహ్రూకు ఇష్టం. ★

1929 నాటికి పండిత నెహ్రూకు యావద్భారత ఖ్యాతి వచ్చేసింది. ప్రజలూ, పత్రికలూ వేనోళ్ళ ఆయనను కొనియాడేవి. అప్పట్లో జవహర్ లాల్ చెల్లెళ్లు విజయలక్ష్మి, కృష్ణ, ఆయన భార్య కమల, కుమార్తె ఇందిరా కూడా విడుదుల పేరిట నెహ్రూతో ఎకసక్కెం ఆడేవారు. ఇంట్లో అలు గుయాచేరి భోజనాలారగించే వేళ, వాళ్ళంతా ఆయనన్ని "భారత భూషణా! ఆ కాఫీపాట్ ఇలా ఇయ్యి," "ఓ త్యాగమూర్తీ! కాస్త రొట్టెల పళ్లెం ఇలా అందుకో" అంటూ, అల్లరి పెట్టేవారట.

—వాణిగంధర్



32

ఎలాగో ఒక నెల గడిచింది. ఈ నెల లోపల సర్వజయ చాలా ఉపాయాలు ఆలోచించి చూసింది. కాని ఒక్కటి అనువైనదిగా కన్పించలేదు. ఒకటి రెండుసార్లు మళ్ళీ తమ ఊరికి వెళ్ళిపోదామని కూడా ఆలోచించక పోలేదు. కాని ఆ ఆలోచన వచ్చినప్పుడల్లా దాన్ని అణచుకునేది. అక్కడ ఉన్న ఇల్లు ఒక్కటే మిగిలినవన్నీ కొన్ని బాకీల క్రింద చెల్లకటి, కొన్ని అమ్ముకుని రావటం జరిగింది. భూమీ-పుట్రా యేం లేదు - ఇది మొదటి కారణం. ఇహ రెండోదేమిటంటే - అక్కడనుంచి వచ్చేముందు - కనిపించిన వాళ్ళతోనల్లా తన భవిష్యత్తంతా సుఖమయమే అని నమ్మకం కలిగేట్లు చెప్పి వచ్చింది. ఈ నిశ్చింది పురంగడ్డ వదిలిపెట్టిపోతేచాలు - ఈ దరిద్రపు ఊళ్ళో అంతే తన భర్త ప్రతిష్ఠను ఎవరూ గుర్తించలేక పోయారుకాని తాము వెళ్ళేచోట అయన్ని అందరూ నెత్తి నెట్టుకుంటారు. తమ స్థితిగతులు మారటానికి ఏడాది కూడా పట్టదు. అన్న సంగతి వాళ్ళకందరికీ ఎన్ని విధాలుగా నచ్చచెప్పింది: ఇది ఇంకా ఎనిమిదోమాసమే - ఏడాది పూర్తికాలేదు. ఈ లోపునే ఇలా నిస్సహాయ స్థితిలో - పైగా విధవయై వాళ్ళ ఎదుటకి పోయి నిలబడాలంటే లజ్జా సంకోచాలతో ఆమె క్రుంగిపోసాగింది. జరగనున్నదేదో ఇక్కడే జరుగుతుంది. పిల్లవాడి చెయ్యిపట్టుకుని, కాశీలో బిచ్చమెత్తుకుంటూ నయినాసరే - వాణ్ణి పెంచి పెద్దవాణ్ణి చేస్తుంది. ఇక్కడెవరు చూడొచ్చారు?

ఒక నెలపోయాక ఒక వీలు చిక్కింది. కేదారఘట్టంలో ఓ పెద్దమనిషి మిషన్ కార్యాలయంలో - తనకు పరిచితమైన ఓ ధనిక కుటుంబానికి ఓ బ్రాహ్మణ స్త్రీ కావాలని, యోగ్యురాలై ఉండాలని, వారి యింట్లో పనుల్లో సహాయపడేదయి ఉండాలని - తెలియచేశాడు. మిషన్ వారు ఇలాంటివాళ్ళ భోగట్టా యిస్తూ ఉంటారుగా: చివరికి మిషన్‌వారి శిఫార్సుతో ఆ పెద్దమనిషి అపూ వాళ్ళని అక్కడికి పంపటానికి అంగీకరించాడు. నడిసముద్రంలో కొట్టుకుపోతున్న సర్వజయకి గట్టు చిక్కింది. రెండు రోజులకే ఆ పెద్దమనిషి- వీళ్ళు అక్కడికి వెళ్ళటానికి సిద్ధంగా ఉండాలని, ఆ ధనిక కుటుంబానిదీ ఊరు కాదని, ఆ కుటుంబంలోని వారు కొందరు

> అనువాదం:
> ## మద్దిపట్ల సూరి

కాశీకి ఊరికే నే వస్తున్నారని, వాళ్ళు తిరిగి వెళ్ళేటప్పుడు వీళ్ళని వెంటపెట్టుకు వెడతారని తెలియచేశాడు.

పెద్ద పచ్చరంగు భవనం. కాశీలో ఉండే పెద్ద పెద్ద భవనాల్లాంటి భవనమే. అందరి కంటె వెనుక సర్వజయ పిల్లవాడి చెయ్యి పట్టుకుని, సంకుచితురాలయి లోపలికి వెళ్ళింది.

అంతఃపురంలో అడుగుపెట్టగానే స్వాగతపు సందడి బయలుదేరింది. తనకి కాదు, కాశీనుంచి తిరిగివచ్చినవారి కాస్వాగతం.

ఆసందడి కాస్త సద్దుమణిగాక గృహయజమానురాలు సర్వజయ దగ్గిరకు వచ్చింది. చాలా లావుగా ఉంటుంది, ఒకప్పుడు చాలా చక్కనిదై ఉంటుందని తోస్తుంది. ఏళ్ళు ఏభైకి పైనే ఉంటాయి. యజమానురాలికి నమస్కరించగానే ఆవిడ... "ఉండు, ఉండు... ఇలాగా—పాపం చిన్న వయసులోనే—ఏం అబ్బాయా వీడు? బాగున్నాడు. పేరేమిటి? అన్నది.

"అసలు కాశీయే నా ఏదీ? కాదూ? అయితే మరి—?" అడుగుతున్నారెవరో...

అందరూ తనకేసి కుతూహలంతో చూడటంతో సర్వజయ పెద్ద ఇరకాటంలో పడిపోయింది. గృహిణి ఆజ్ఞప్రకారం దాసీది వచ్చి సర్వజయను ఆమెకి ఏర్పాటుచేసిన గదిలోకి తీసుకెళ్ళాక కాస్త తెప్పరిలుకుంది.

మర్నాడునుంచి సర్వజయ మామూలుగా వంటపనుల్లోకి వెళ్ళింది. తానొక్కతే కాదు, నలుగురయిదుగురు వంటలక్కలున్నారు. మూడు, నాలుగు వంట యిళ్ళున్నాయి. శాకాహారానికి ఒకటి, మాంసాహారానికి ఒకటి, రొట్టెలవీ చేయటానికి ఒకటి... పై వాళ్ళ వంటలకు వేరే ఇంకొకది. నౌకర్లూ, దాసీలూ ఎంతమంది ఉన్నారో లెక్కేలేదు. అంతఃపురం మధ్యలోనే వంటిల్లు ఉన్నా కేటాయింపుగా ఉంటుంది. అక్కడ వంటవాళ్ళది, నౌకర్లదే యాజమాన్యమంతా. ఇంట్లో ఆడవాళ్ళు వచ్చి ఏదైనా పని పురమాయించటం వరకే. ప్రత్యేకమైన కారణమేమీ లేనిదే వంట యింట్లో ఎవరూ ఉండరు.

సర్వజయ ఏ వంట చేస్తుందన్న విషయమే మీమాంస వచ్చింది. తాను చాలా బాగా వంట చెయ్యగలనని సర్వజయ నమ్మకం. మాంసం కూరలు కాకుండా మామూలు కూరలు వండే బాధ్యత తనకు ఒప్పగించమన్నదామె. మరో వంటావిడ మోక్షదా వెటకారంగా నవ్వుతూ "బాబుగారి వంట చేస్తావా నువ్వు? ఏడ్డూరంగానే ఉందే." అని 'పాంచి' అనే దాసీదాన్ని పిలిచి, "ఇదుగో విన్నావా పాంచి! ఈ కాశీ ఆవిడ ఏమంటుందో విన్నావా. బాబుగారి వంట తాను చేస్తుందిట. అఁ, నీ పేరేమిటమ్మా? మరిచిపోయాను." అన్నది మోక్షదా పేరి

జరిగినకథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్ళో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లల కిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కని పిస్తుంది. బడి చదువుకూడా వాడికి ఏమీ అంటలేదు. ఇంట్లోనే తండ్రికితాలూకు పుస్తకాలన్నీ చదివేస్తూ ఉండేవాడు. ఒకసారి వాళ్ల ఊళ్ళోకి ఒకనాటక సమాజం వచ్చింది. వాళ్లువేసిన నాటకాలు చూసి అపూ తన్మయుడైపోయాడు. తనుకూడా పెద్దయ్యాక నాటక సమాజాల్లోచేరి నటుడైపోవాలని కలలు కన్నాడు. తను చూసిన నాటకం కథ ఆధారంగా స్వయంగా ఒక నాటకంకూడా రాసేశాడు. మొత్తానికి వాడి ఆదర్శాలకు ఆకాశమే అవధి. దుర్గకి మంచి సంబంధం ఏదన్నా చెయ్యాలని తల్లి ఆవేదన పడేది. కాని మంచిసంబంధాలనేవి హరిహరరాయ్ కుటుంబానికి ఎన్నటికీ అందని ద్రాక్షపండ్లే. ఎప్పుడో ఏదో అదృష్టం కలిసివచ్చి తమ సంసారం బాగుపడుతుందనీ, దుర్గ గొప్ప ఇంటి కోడలైపోతుందనీ, అపూ పెద్దవాడై ప్రయోజకుడై తమ కష్టాలు గట్టెక్కిస్తాడనీ ఆమె కలలు కనేది. కాని ఆ కలలు కల్లలుగానే మిగిలిపోయాయి.

ఒకసారి దుర్గకి జ్వరం పట్టుకుని ఎన్నాళ్ళకీ తగ్గలేదు. హరిహరుడు ఊళ్ళోలేడు. తల్లి, పిల్లలూ తిండికికూడా మొహం వాచిపోయారు. ఆఖరుకి ఒక భయంకరమైన రాత్రివేళ, వర్షం ప్రళయంగా కురుస్తున్నవేళ దుర్గ ప్రాణవాయువులు అనంతంలో లీనమైనాయి. ఆమె జనన మరణ, సుఖదుఃఖ ద్వంద్వాతీతమైన ఏదో అజ్ఞాతలోకానికి వెళ్లిపోయింది. హరిహరుడు ఊరినుంచి తిరిగి వచ్చినతరవాత గాని దుర్గ మరణం వార్త అతనికి తెలియలేదు. పిమ్మట హరిహరుని కుటుంబం అంతా నిశ్చిందిపురం విడిచిపెట్టి కాశీ చేరుకున్నారు. హరిహరుడు కాశీలో హరికథా కాలక్షేపాలతో జీవయాత్ర సాగిస్తూ కొంతకాలానికి జబ్బుచేసి చనిపోతాడు.

★ పథేర్ పాంచాలీ ★

కులమీది పెటకారపువవ్వ చూసి సర్వజయ ఆరోజున విస్తుపోయినమాటయితే వాస్తవమే కాని, తర్వాత రెండు మూడు రోజుల్లోనే తన పల్లెటూరితనం ఇక్కడ పనికివచ్చేది కాదని గ్రహించింది.

యజమానురాలు సర్వజయని రెండుసెల్లు ఆదరంగానే చూసింది. తేలికపనులు చెప్పేది కష్టసుఖాలు కనుక్కుంటూ ఉండేది. క్రమంగా నలుగురితో పాటే అయింది తానుకూడా. రెండుగంటలదాకా పనులుచేస్తూ కూర్చోటం మొదట్లో చాలా అలసటగా ఉండేది సర్వజయకి. ఇలా ఎప్పుడూ పొయ్యిసెగను కూర్చునే అలవాటు ఎన్నడూ లేదామెకి. అంత వేళమించి భోజనంచేసే అభ్యాసమూ లేదు. మిగతా వంటవాళ్లు తమకు చేపలకూరా. అవీ విడిగా తీసుకుని దాచుకునేవాళ్లు, కొంత తినేవాళ్లు, కొంత ఎక్కడికో పట్టుకుపోయేవాళ్లు.

అంతపెద్దవంట ఏర్పాట్లుచూసి, సర్వజయ తెలబోతూ ఉండేది. ఇంత భారీ ఏర్పాట్లు ఆమె కల్లోకూడా ఊహించి ఎరుగదు. విస్తుపోతూ తనలో తాను – "రెండు పూటలా కలిసి రోజుకి పిసెమనూనె ఖర్చు." రోజూ ఓ యజ్ఞానికి సరిపడ నెయ్యి ఖర్చు అనుకునేది. పల్లెటూళ్లో పేదసంసారపు అనుభవంతో. ఆమెకిలాంటివన్నీ అర్థమయేవి కావు.

ఓ రోజున సన్నబియ్యపు అన్నం గుండిగ దింపబోయేముందు, పూతుదాని కేకేసి, "పిన్నిగారూ, కొత్త గుండిగ పాయింపడ తారూ ?" అని అడిగింది.

పూతుదాని వినిపించుకోలేదు... ఇహ అన్నం చిమిడిపోతుందని, తానొక్కతే దింపబోయి, ఆ గుండిగ పడేసింది. వేడిగంజి కాలిమీద పడి బొబ్బ పొక్కింది. యజమానురాలు ఆ రోజునే సర్వజయని రొట్టెలు చేసే వంటగదికి బదిలీ చేసింది కాలు నయమయే దాకా ఏ పనీ ముట్టుకోవద్దు–అని చెప్పింది.

సర్వజయ పిల్లవాణ్ణి పెట్టుకుని క్రింద ఓగదిలో ఉండేది. ఆగది పడమటింటి వసారా ప్రక్కనే కాని ఆ గది చాలా క్రిందుగానూ చిత్తడిగానూ ఉంటుంది. పైగా ఏదో వాసన కూడా కొడుతూ ఉంటుంది. వాళ్లు కాశీలో కాపురం ఉన్న ఇల్లే ఇంతకంటె చాలా నయం. గోడలు క్రిందివైపు అంతా చవుడు తిరిగిపోయాయి. అపూ బయటనుంచి వచ్చి లోపల అడుగుపెట్టి

వప్పుడల్లా—"ఏమిటమ్మా వాసన కొడుతోంది. బియ్యం ముక్కిన వాసనా ఇంకేమయినానా చెప్పు. ఈ క్రింది గదులు మనుష్యులు కాపురం ఉండటానికని కట్టించినవి కాదు. అందుకనే వీటిల్లో నౌకర్లూ, వంట మనుష్యులూ ఉంటారు" అనేవాడు.

పై గదులన్నీ, అప్పూ బయటినుంచే చుట్టూ తిరిగి చూశాడు. పెద్దపెద్ద దర్వాజాలు, కిటికీలు, అద్దాలున్న కిటికీలు అన్నీ. ఆ గదులనిండా వేసున్న పెద్ద పెద్ద కుర్చీలు — నిగనిగలాడే టేబుల్సూ. అద్దాల్లోలాగా పాప కన్పించేటంత నిగనిగలాడుతూ ఉంటాయి. అప్పూవాళ్ళింట్లో పాత తివాచీ ముక్క ఉండేదే— అలాంటివే అంతకంటే పెద్దవీ మందంగా ఉండే క్రొత్త కార్పెట్లు పరచి ఉన్నాయి క్రింద. గోడలనున్న అద్దాలు ఇహ చెప్పనక్కరనేలేదు నిలువెల్లా కన్పించేటంత పెద్దపెద్ద అద్దాలు! ఇంత పెద్దపెద్ద అద్దాలు ఎక్కడ దొరుకుతాయి! ఒకదాని నొకటి అతికించి చేశారేమో! అనుకునేవాడు అప్పూ.

రెండో అంతస్తు వరండాలో ఓ పెద్ద గది ఉంది. అది ఎప్పుడూ తలుపులు మూసే ఉంటుంది. మధ్యమధ్య నౌకర్లూ వాళ్ళూ కాస్త గాలి చొరటానికని తెరుస్తూ ఉంటారు. అందులో ఏముందో చూడాలని వాడికి ఆపుకోలేనంత కుతూహలం కలిగేది. ఓ రోజున గది తలుపులు తెరిచి ఉండటం చూసి, లోపలకు వెళ్ళాడు...

ఎంతెంత పెద్దపటాలు, పాలరాతి బొమ్మలు, కుషన్ కుర్చీలు, అద్దాలు. అంతలో ఛటూ అనే పరిచారకుడు అప్పూ గదిలో ఉండటం చూసి, "ఎవరు నువ్వు?" ఎందుకు వచ్చావ్ ఈ గదిలోకి?" అని రుసరుసలాడుతూ అడిగాడు.

బహుశా ఆ రోజున వాడు దెబ్బలు తినాల్సివచ్చేదేమో! కాని మరొక దాసీది హాల్లోంచి వెడుతూ వెడుతూ, "ఇదుగో ఛటూ, విడిచిపెట్టు, ఏమీ అనకు. వాళ్ళమ్మ ఇక్కడే ఉంది. ఒకవేళ చూస్తుందేమో!" అన్నది.

అందరి భోజనాలూ అవీ అయిపోయాక ఏ రెండున్నరకో సర్వజయ తన గదిలోకివచ్చి, కాసేపు నడుం వాల్చేది. రోజు మొత్తం మీద అప్పుడే అమ్మతో కాస్త మనస్సు విప్పి మాట్లాడుకోవటానికి వీలని అప్పూ కూడా ఆ సమయానికి అప్పుడప్పుడింటికి వస్తూఉండేవాడు. వాళ్ళమ్మ రోజుకొకసారైనా తనను కలుసుకుంటూ ఉంటుంది. ఈ యింటికి వచ్చినప్పట్నుంచీ అప్పూ ఏమిటో దూరమైపోతున్నాడు. రోజంతా ఒకటే పని. పిల్లవాడికి దూరంగా ఉండవలసివస్తోంది. పనులన్నీ పూర్తిచేసుకుని రాత్రి ప్రొద్దుపోయాకవస్తే అప్పూ నిద్రపోతూ ఉంటాడు. మాట్లాట్టానికి వీలు కుదరదు. ఈ మధ్యాహ్నవేళకై ఆమె మనసు తహతహలాడుతూంటుంది.

తలుపుదగ్గిర అడుగుల చప్పుడైంది. "ఎవరు? అప్పూ, రారా" అన్నది సర్వజయ. తలుపు త్రోసుకుని వంటావిడ వచ్చింది లోపలికి.

"రండి పిన్నిగారూ, రండి. కూర్చోండి" అన్నది సర్వజయ. ఆమె వెనకాలే అప్పూ కూడా వచ్చాడు. ఆ వంటావిడ బాబుగారికి కొంచెం చుట్టం. అంచేత ఆమెని మర్యాద చేసి కూర్చోపెట్టింది. ఆవిడ ముఖం ముట

మాటలాడుతూంది. కాసేపు మెదలకుండా ఊరుకుని, "ఇవాళ పెద్దకోడలుగారేం చేసిందో చూశావా? నువ్వు రొట్టెలగదిలోనే ఉన్నావుగా! దాసీది వచ్చి ఓ గిన్నెతో చేపలు పెట్టి వెళ్ళింది. నేనది క్యాబేజీ కాబోలు అనుకున్నాను. ఎంత అవమానమో చూడు. పలావ్ లోకి చేపలు అని చెప్పి పంపితే సరిపోయేదిగా! ఆ దాసీది మాత్రం తక్కువదా? యజమానురాలికి ఇష్టురాలుగా!...అదుగో శ్రీకంఠ ఠాకూరి కూడా ఉన్నాడు. అడుగు ఇంకా" అన్నది.

కబుర్లతో కాలం దొర్లిపోయేది. "వస్తాను, వెళ్ళి మైదా కలపాలి తినుబండారాలు చెయ్యటానికి. నాలుగు కొట్టింది" అన్నది పిన్నిగారు.

ఆమె వెళ్ళిపోగానే అపూ తల్లి దగ్గరకు వచ్చి కూచున్నాడు. తల్లి గడ్డం పుణుకుతూ "మధ్యాహ్నమంతా ఎక్కడున్నావ్ నాయనా?" అని అడిగింది అపేక్షగా.

అపూ నవ్వుతూ "పైన గదిలో ఏదో యంత్రం పాడుతోందమ్మా! వసారాలో వింటూ నుంచున్నాను" అన్నాడు.

సర్వజయకి సంతోషమయింది.

"అవున్రా, నీకు బాబుగారి పిల్లలతో బాగా సావాసమయిందా? నిన్ను రమ్మని పిలుచుకు వెళ్లారా?"

"ఊఁ"

అపూ చెప్పింది అబద్ధం ఇది. వాడిని ఎవరూ పిలుచుకు వెళ్లలేదు. పైగదిలో గ్రాంఫోన్ ధ్వని విన్పించగానే కాసేపు వెనకాముందాడి, చివరికి భయపడుతూ భయపడుతూ పైకివెళ్ళి, గదితలుపు చాటున నుంచుని విన్నాడు. క్రిందికి వెళ్ళిపొమ్మంటారేమో అని క్షణక్షణమూ భయంగానే ఉండేది. ఆ పాట అయిపోయి క్రిందికి వచ్చే ముందు ఎవ్వరూ ఏం తిట్టలా. ఎందుకు తిడతారు? నేను బయటే నుంచుని విన్నానుగాని, బాబుగారి గదిలోకి వెళ్లలేదుగా! వీళ్లు చాలా మంచివాళ్లు—" అనుకునేవాడు.

ఈ యింట్లో పిల్లలతో వాడికి సావాసం కాలేదు. వాళ్లు వాణ్ణి తమ దగ్గరకే రానిచ్చే వాళ్ళు కాదు. ఆ రోజున రమేనీ, టేబూ, సమీర్, సంతూ—ఓ నలుచదరపు బల్లపరిచి, నల్లటి గుండ్రటి బిళ్ళలు పెట్టి ఏమిటో ఆడారు. దాని పేరు 'క్యారమ్స్'ట. వాడు కాస్త ఎడంగా నుంచుని చూశాడు ఆట. ఇంతకంటె వామన గుంటలాటే బాగుంది......

* * *

వైశాఖ శుద్ధంలో పెదబాబుగారి కూతురి పెళ్ళి అని ఇల్లంతా కోలాహలంగా ఉంది. గయ, ముంగేర్, అలహాబాద్, కలకత్తా, కాశీ - చాలాచోట్లనుంచి బంధువులు రాసాగారు. అందరూ శ్రీమంతులే. ప్రతివాళ్ళూ తమవెంట నౌకర్లను, దాసీలను తెచ్చుకున్నారు. క్రింద హాలు, వరాండా, రాత్రి వాళ్లు దఖలుపరచుకున్నారు. రాత్రంతా ఒకటే గొడవ.

ప్రొద్దున్నే యజమానురాలు సర్వజయని పిలిచి, "నువ్వోక పనిచెయ్, ఈ రెండు రోజులూ నీ వంటపని మానెయ్. చాలా చోట్లనుంచి అరణాలు, బహుమతులూ వస్తున్నాయి. నువ్వూ, మోక్షదా వాటి నన్నిటినీ అందుకుని మా రొట్టెలయింటి సామానుల గదిలో భద్రం చెయ్యండి. తీపి తినుబండారాలన్నీ అక్కడే ఉంచండి. పూలు, పళ్లు, ఇంకా పాడైపోయేవేవయినా ఉంటే అవీ 'సదూ' దాసీ చేతికిచ్చి పంపండి, లేదా అక్కడే ఉంచండి. ఫలాహారాల సమయానికి 'బామ్నీ' వచ్చి తీసుకువస్తుంది..." అని చెప్పింది.

ప్రొద్దునుంచి సాయంత్రంవరకూ నౌకర్లూ వాళ్ళూ ఎన్నిచోట్లనుంచి ఈ బహుమతులూ అవీ తీసుకువచ్చారో సర్వజయ లెక్కపెట్టలేకపోయింది. మిఠాయీలకీ వాటికి చోటే లేకపోయింది. చిన్న చిన్న వెండి కుంకుమ భరిణెలు, గంధపు గిన్నెలూ చాలా వచ్చాయి. మామిడిపళ్లు ఇంకా బాగా రావటంలేదు. అయినా వాటితో ఓగంప నిండిపోయింది.

సర్వజయ బామ్నీకి ఫలాహారాలందిస్తూ 'ఏమయితే యేం పిల్లవాడికి కాస్త - పాపం, వాడు గుమాస్తాల భోజనాల గదిలో మూల ఎక్కడో కూర్చుని, రెండు మెతుకులు తిని పోతాడు. వాడి విస్తట్లో రెండు మంచి చేపలుకాని, కాస్త మంచి కూరకాని, కాసిని పాలుకాని పోయటానికి లేదుకదా!

అప్పుడే 'సదూ' దాసీది తన పిల్లవాడి విస్తట్లో బాబుగారి వంటలోనివి అన్నీ తెచ్చివేస్తున్నది... అనుకుంది. వివాహం నాడు జనం చాలామంది ఉన్నారు. పెళ్ళివారు ప్రొద్దున రైల్లోవచ్చి ఊళ్ళో మరోకచోట విడిది ఏర్పాటుచేసుకున్నారు. ఇహ కాసేపటికి ప్రొద్దుక్రుంకుతుందనగా పెళ్ళికొడుకు ఊరేగుతూ వచ్చాడు. బయటి హాలు ఆహూతులతో నిండిపోయింది. హాల్లో అంతా జంపకానాలు పరిచారు. ఒకవైపున ఎత్తుగా పెళ్ళికొడుక్కి జరీపూలున్న ఎర్రటి మఖమల్ పరిచిన ఆసనం ఏర్పాటు చేశారు జరీపోగుల తోరణాలతో ప్రక్కన చాందినీ కట్టారు. రెండుప్రక్కలా పట్టుబాలీసులు, ప్రతిఆర్చికీ పెద్దపెద్ద మల్లెపూల దండల తోరణాలు—నాలుగు ప్రక్కలా పెళ్ళివారికి కుర్చీలూ, సోఫాలు, సెంట్లు, అత్తర్లు, పన్నీరు జల్లులు ఊహ్ కురుస్తున్నాయి.

అపూ ఇదేమీ చూడలేదు. వాడు పడుకుని నిద్రపోయాడు. ఒక్కసారి మాత్రం లోపలికివచ్చాడు వాడు. లోపల ఆడవాళ్ళ పేరంటం జరుగుతోంది. ఇంకా చాలా రాత్రివుంది అప్పటికి. తల్లి ఎక్కడవుందో కన్పించలేదు. ఆ పెళ్ళిజనం ఎవరెక్కడ ఏయేపనుల్లో ఉన్నారో! విలువైన బెనారెస్ పట్టుచీరెలు కట్టుకున్న వాళ్ళతో హాలులో ఎక్కడా ఇంత జాగా లేదు. చినబాబుగారి కూతురు అరుణ ఎవర్నో కేకేసి, బయటవైపు గదిలో ఉన్న 'ఆర్గన్' లోపలికి తీసుకురమ్మని చెపుతోంది.

వివాహమైన మూడోనాడు—ఓ నాటకం ఉండటంతో మళ్ళీ సందడి జాస్తిఅయింది. హాలులో ఒకమూల 'స్టేజ్' కట్టారు. ఇన్నాళ్ళనుంచీ జరుగుతున్న వాటిలో ఇదొక్కటే అపూని ఆకర్షించింది. ఇవాళ నాటకం ఉన్నట్టు వాడికిదివరకు తెలియదు. ఎంతో ఆసక్తితో ముందుగా మంచిచోటు చూసుకుందామనే ఉద్దేశంతో సాయంత్రం నుంచి అక్కడే కూర్చున్నాడు.

ఆహ్వానితులైన పెద్దలు క్రమంగా రావటం మొదలెట్టారు. నాలుగు వైపులా దీపాలు వెలిగాయి. ఇంట్లో దర్వానులు జరీతలపాగాలు ధరించి, ఆనాటకస్థలానికి వెలుపల, ద్వారందగ్గర నుంచున్నారు. గుమాస్తాలు ఇటూ అటూ తిరుగుతూ ఏర్పాట్లనీ చూస్తున్నారు. 'కన్సర్ట్' ప్రారంభమయింది. ఇంటి గుమాస్తా గిరీశ్ సర్కార్ తన దగ్గరకు వచ్చి, వంగి మొహంకేసిచూచి, "ఎవరు నువ్వు?" అని అడిగాడు. అపూ తలయెత్తి చూశాడు. కాని బిడియస్తుడవటంవల్ల కాసేపు ఏమీ మాట్లాడలేదు. వాడికి సమాధానంచెప్పే వ్యవధి ఇవ్వకుండానే—

"లే, లే ఇక్కడ బాబుగార్లు కూర్చుంటారు. లేచివెళ్ళు" అన్నాడు గిరీశ సర్కార్. అతడు అపూని కొంతవరకు పోల్చుకున్నాడు.

అపూ వెనక్కి తిరిగిచూసి, బిక్కమొహం వేసి, "సాయంత్రంనుంచీ కూర్చున్నాను నేనిక్కడ. వెనకాలఅంతా నిండిపోయింది. ఎక్కడికి వెళ్ళను?" అన్నాడు. వాని మాటింకా పూర్తికాకముందే గిరీశ్ సర్కార్ చెయ్యిపట్టుకుని గుంజి, లేవతీసి, "ఏం చెయ్యాలి నిన్ను! పెద్ద మొనగాడివిలా ఉన్నావే! బుద్ధిలేదూ? ముందువరుసలో బాబుగార్లు కూర్చుంటారు. వంటావిడ కొడుకువి వచ్చి కూచుంటావా అక్కడ! ఎక్కడికి వెళ్ళేదో చెప్పాలా? వెళ్ళు ఇక్కడ నుంచి. ఆ స్తంభందగ్గరో ఎక్కడో కూర్చో..." అన్నాడు.

వెనకనుంచి ఒకళ్ళిద్దరు పెత్తందార్లు "ఏమిటి? ఏం జరిగింది గిరీశ్? ఏమిటా గొడవ? ఎవరతడు?" అని అడిగారు.

"ఇదుగో చూడండి మేనేజరుగారూ! ఈ మొనగాడొచ్చి ఇక్కడ బాబుగార్ల చోటులో కూర్చున్నాడు—మరీ ముందు వరుసలో- చందననగర్ నుంచి వారంతా వచ్చారు. కూర్చోటానికి ఎక్కడా చోటు లేదు. లెమ్మంటే, వాదన వేసుకుంటున్నాడు."

"రెండు తగిలించరాదూ?" అన్నాడు మేనేజరు.

అపూ ముణుచుకుపోయి. అటూ యిటూ చూడకుండా దిమ్మెరపోయిన వాడిలా అక్కడినుంచి యివతలకు వచ్చేశాడు. అక్కడ కూర్చున్న వాళ్ళందరూ తనకేసే చూస్తున్నారేమో అని హఠాత్తుగా తోచింది వాడికి. ఇక్కడినుంచి ఒక్క పరుగుతీసి, ఇక్కడ కూర్చున్నవాళ్ళ కెవరికీ కంటపడని చోటుకు పారిపోదామనిపించింది ముందు. తర్వాత వాడు ఓ స్తంభం చాటుకుపోయి నుంచున్నాడు. భయంతో గజగజ వణికిపోతున్నాడు.

"అవమానంతో, సిగ్గుతో వాడిలో ఒకరకమైన కంపం బయల్దేరింది. కాస్త తమాయించుకుని, స్తంభం చాటునుంచి తొంగి చూశాడు... చుట్టూ నౌకరూ, చాకరూ పైన వరాండాలో రేకుల కవతలగా ఆడవాళ్ళు, దాసీలూ, వంటలక్కలూ క్రింది వరాండాలో నుంచునిఉన్నారు. వాళ్ళు ఈ జరిగినదంతా చూశారేమో! చూసి ఏమనుకున్నారో! అనుకోకుండా ఎంతపనిచేశాడు తాను! అది బాబుగార్ల చోటని తెలియదు తనకు. 'బహుశా తనసెవరూ చూసిఉండరులే, అందరూ పొరుగూళ్ళనుంచివచ్చిన వాళ్ళే. అసలు. తనెవరు గుర్తుపట్టిఉంటారు?' అని మాటిమాటికి మనస్సును సమాధానపరచుకోటానికి ప్రయత్నించసాగాడు...తర్వాత నాటకం ప్రారంభమయింది. వాడి దృష్టి అటు లేనేలేదు. ఎదురుగా ఈ జనం, దీపాలు, నౌకర్ల రొదలు—వేటిమీదికీ వాడి దృష్టి పోనేలేదు. ఛటూ నౌకరు హంస ఆకారంలోఉన్న వెండి పాన్‌దాన్ చేత పట్టుకుని, ఆహ్వానితులందరికీ వరుసగా తాంబూలాలు ఇస్తున్నాడు. అటుకేసిచూసే సరికి అపూ ఒళ్లు అదోలా అయిపోయింది. పైవరాండాకేసిచూసి, 'అక్కడ అమ్మలేదు కదా! అమ్మకీ సంగతి తెలిస్తే ఒకవేళ?' అనుకున్నాడు. కాని అపూ భయం నిరాధారమైనది. వాళ్ళఅమ్మ అసలు ఆ చాయలను ఎక్కడా లేదు. ఈ సంగతి అసలు ఆమె చెవిని పడనేలేదు......

—ఇంకా ఉంది.

టీకప్పులో తుఫాను

కోకా శ్రీసుధ

వంటింట్లోకి వచ్చి పుస్తకాలు టేబిలు మీదకు విసిరి

"హా! చంద్రమతీ! అని మూర్ఛిల్లును."
అని ఒక కేకవేసి కమల ప్రక్కన కూర్చున్నాడు పరమేశ్వరరావు.

కోస్తున్న అరటికాయలను ఆపేసి ఒక్కసారి ఉలిక్కిపడి చూచింది కమల.

'అటుల మూసెద వేల నే కాటుక కండ్లతో! 'పోదా' అన్నాడు ఆయాసంగా కమల జడ పట్టుకొని పరమేశ్వరరావు.

'కత్తి కొట్టులో దొరుకుతుంది' అంది కమల జడ లాక్కోవడానికి ప్రయత్నిస్తూ.

'నాకు పరిహద్దులవరకూ విచారం వస్తున్నది. మంచినీళ్లు' అన్నాడు పరమేశ్వరరావు కళ్ళజోడు తీస్తూ.

'కూజాలో ఉన్నాయి.' అంది కమల అరటికాయలు కడుగుతూ.

'ఔరా! భారతనారీ! పతిదేవుని ఎంత కష్టపెట్టుచుంటివి!' అన్నాడు కేకవేసుకుంటూ పరమేశ్వరరావు.

మాట్లాడలేదు కమల.

'కమలా!' అన్నాడు పరమేశ్వరరావు దప్పబడిపోయి.

'ఊ...' అంది కమల అరటికాయ తొడిమ కోస్తూ.

'కమలం'...అన్నాడు పరమేశ్వరరావు మళ్ళీ.

'ఊ...' అంది కమల మళ్ళీ.

'ఓహో! కమలాదేవిగారూ!' అన్నాడు చెవిమీద చేయి పెట్టుకుని రాగయుక్తంగా పరమేశం.

'అబ్బబ్బ! నన్ను పనిచేసుకోనీయండీ! ఇంకా స్నానంకూడా చేయలేదు' అంది కమల చిరాకు వ్యక్తపరుస్తూ. పరమేశ్వరరావు మౌనవ్రతం పూనాడు హఠాత్తుగా.

అరటికాయలు పొయ్యిమీద వేసి, పప్పులో నీళ్లుపోసి స్నానం చేయడానికి వెళ్తూ పరమేశ్వరరావు వంక చూచింది కమల. పరమేశ్వరరావు రెండు మోకాళ్ళమధ్య తలపెట్టి కూర్చున్నాడు.

కమల స్నానానికి వెళ్ళింది.

కొంతసేపయినాక కమల స్నానంచేసి వచ్చింది. ఇల్లంతా పొగ ఆక్రమించింది. పప్పు మాడువాసన వేస్తున్నది.

పుల్లలు ఎగదోసి, పప్పు క్రిందపెట్టి పరమేశ్వరరావు వైపు చూసింది కమల.

పరమేశం కళ్ళనుంచి గంగాభవానీ ప్రవహిస్తున్నది.

'అదేమిటీ! విచారం పరిహద్దులు దాటిందే' అంది కమల మాడిన పప్పుకేసి చూస్తూ.

మంచి కోపంతో లేచి బయటకువెళ్లాడు పరమేశ్వరరావు.

దారిలో ఉన్న గ్లాసు శబ్దం చేసుకుంటూ వంత పలికింది.

తిన్నగా వెళ్లి "మిటీరా మెడికా" పుస్తకం తిరగవేస్తూ మడత కుర్చీలో కూర్చున్నాడు పరమేశ్వరరావు.

కొంత సేపటికి కమల కాఫీ పట్టుకొచ్చింది.

పొడి దగ్గు దగ్గింది కమల.

పరమేశం తలెత్తలేదు.

ఏమండీ అంది కమల కాఫీ బల్లమీద పెడ్తూ.

'ఊ' అనలేదు పరమేశ్వరరావు

'ఏమండీ!' అంది కమల మళ్ళీ ఇంకో కుర్చీ దగ్గరకు లాక్కుంటూ.

మాట్లాడలేదు పరమేశ్వరరావు.

కుర్చీలో కూర్చోకుండా చివాలున లేచి వెళ్ళిపోయింది కమల.

"పరమేశం!" అనే కేక బయటనుంచి వినపడింది.

బయటకు వెళ్ళిపోయాడు పరమేశం.

చూస్తున్న ఆఫీసు కాగితాలు అటే వుంచి బయటకువచ్చి చల్లారిపోయిన కాఫీ వంక విస్తుపోయి చూచింది కమల.

అప్పుడు టైము ఆరయ్యింది.

ఆ పోవడం, పోవడం రాత్రి 9-30 గంటలకు వచ్చాడు పరమేశ్వరరావు.

'భోజనానికి వస్తారా!' అంది కమల గోడ వైపు చూస్తూ.

మాట్లాడకుండా సిగిరెట్టు వెలిగించాడు.

"సిగిరెట్లు కాలిస్తే ఆరోగ్యం పాడవుతుందని తెలియదు కాబోలు కాబోయే డాక్టరు గారికి!" అంది కమల గోడవైపు చూస్తూనే.

లోలోపల నవ్వుకుంటూ బూట్లు విప్పుకుంటున్నాడు పరమేశం.

"నా కాకలిగా వుంది" అంది కమల క్రీగంటతీస్తూ.

బూట్లు విప్పి తిన్నగా వంటింట్లోకి వెళ్ళాడు.

ఎన్నడూలేని అలవాటు చూసి ఆశ్చర్యపోతూ అతనిని అనుసరించింది కమల.

భోజనం దగ్గర తన ఇష్టమైన అరటికాయ వేపుడును గురించి పొగడలేదు పరమేశం.

తనకిష్టం కానటువంటి ఆహారనుగురించి చర్చించలేదు కమల.

భోజనాలు అయినాక కమల వంటింట్లో పనంతా చూసుకుని వచ్చేసరికి పరమేశం మంచంమీద పడుకుని చదువుతున్నాడు.

కమలకేమీ తోచక ఆఫీసు కాగితాలు చూస్తూ కూర్చుంది.

పరమేశం నిద్రపోయాడు.

ఈ అకాలపు తుఫాను అర్థంకాక లైటు ఆర్పి నిద్రపోయింది కమల.

6 గంటలకు లేచాడు పరమేశం.

పనిమనిషి తలుపు బాదుతూవుంది.

'వస్తున్నా' అంటూ సమాధానం చెప్పి తలుపుతీసి బ్రష్‌నోట్లో పెట్టాడు పరమేశం.

6-30 కల్లా స్నానం అయింది.

కమల ఇంకా నిద్రపోతూనే వుంది!

పరమేశం పొయ్యి వెలిగిస్తున్నాడు ఆకలి బాధకు తాళలేక.

"అదేమిటిబాబు! అమ్మాయిగోరిని లేపండి" అంది పనిమనిషి నవ్వుతూ.

'అమ్మాయి గోరికి అమ్మోరు పూనింది' అన్నాడు పరమేశ్వరరావు కాస్తగట్టిగా— అంటే ఇంటి పెంకులకు చలనం కలిగేటట్లు.

పనిమనిషి నవ్వుకుంటూ ఇల్లూడ్వడానికి లోపలికి వెళ్ళింది.

వెంటనే తిరిగివచ్చి అతనిదగ్గర నిలబడింది.

ఏమిటీ అట్లా నిలపడ్డావు అన్నాడు పరమేశం 7-30 కు జరగబోయే క్లాసు తలుచుకుంటూ.

"అమ్మాయిగోరికి "కాక కాసింది" బాబూ" అంది ఆదుర్దాగా పనిమనిషి.

అట్లాగే పరిగెత్తాడు పరమేశం లోపలికి.

నవ్వుకుంటూ పొయ్యి విసరడం మొదలు పెట్టింది పనిమనిషి.

కమల దగ్గరకువెళ్ళి వీపు తట్టుతూ కమలా అన్నాడు ఆదుర్దాగా పరమేశం.

'ఊఁ' అంది బలహీనంగా కమల.

'జ్వరం వచ్చిందా?' అన్నాడు విచారంగా పరమేశం.

'ఊఁ...' అంది కమల.

డాక్టర్ని పిలవనా?' అన్నాడు.

'వద్దుగాని ఇలా కూర్చోండి'

పరమేశం ప్రక్కలో కూర్చున్నాడు.

'నిన్న నామీద కోపం ఎందుకొచ్చింది?' అంది కమల.

"నీమీదా - కోపమా – అదేం లేదులే - నీతోడు!" అన్నాడు పరమేశం.

"ఆఫీసునుండి వచ్చాక చాలా చిరాకుగా వుంటుందని మీరే ఒప్పుకున్నారు కదా! మళ్ళీ నన్నిలా ఏడిపిస్తే ఎలా" అంది కమల.

"అదికాదులే. నిన్న పేపర్లో ఒకసైంటిస్టు చిన్న ప్రకటనచేశాడు,

ఆఫీసులో పనిచేసే ఆడవాళ్ళందరికీ సామాన్యంగా బట్టతలలు రావడానికి అవకాశాలున్నాయట! నీకు బటతలవొస్తే ఎలా వుంటావో అని అడుగుదామనుకున్నా" అన్నాడు పరమేశం.

ఏమాత్రం నవ్వు కనపడనీయకుండా.

'ఓస్ ఇంతేనా' అంటూ లేచికూర్చుంది కమల.

"జర్వం..."అన్నాడు పరమేశం ఆశ్చర్యంగా. "పోయింది" అందినవ్వుతూ కమల.

"అబ్బాయిగోరూ కాఫీ కాగింది" అని పనిమనిషి కేక వేసింది.

పరమేశ్వరరావు బుంగమూతి పెట్టుకూర్చున్నాడు.

పనిమనిషి మాడిన పప్పు గిన్నెతో సహా తీసుకువెళిపోయింది. ★

ప్రకటనసుందరి

'వరుడు కావలెను. కుల మత జాతి విచక్షణలేని హిందూ కన్యకు ఇరవై మూడేళ్లు మించని వరుడు కావలెను. కన్య చక్కని రూపసి. విద్యావంతురాలు. మంచి ఆస్తి. వివరములకు...'

ప్రకటన చదివిన కోటేశ్వరరావు ఫక్కున నవ్వాడు. కొంటెగా అందరికీ చూపిస్తూ, 'ఉద్యోగాలు దొరక్కపోతేమానె! దీనికన్నా పడెయ్యండ్రా అప్లికేషను' అన్నాడు.

క్లబ్బు క్లబ్బంతా గొల్లుమంది.

'ఇంతకూ ఆ ప్రకటన సుందరిదే కులమో? కట్టుబాట్లూ సంప్రదాయాల్తో బతికేవాళ్లం- ఎలా సాధ్యం?' ఫణిశాస్త్రి వ్యాఖ్యానించాడు.

ఎవరూ వినిపించుకొన్నట్టు లేదు.

నలుగురూ ప్రకటనమీదికి దాడితీసి చెణుకులు విసరడం మొదలుపెట్టారు.

ఇంతలో అప్పాజీరావు టిప్‌టాప్‌గా తయారైవచ్చి గుమ్మంలో కడుగుపెట్టాడు.

అందరి కళ్లు అతనివైపు తిరిగాయి-

'ఇంకేం? అప్పాజీకి అన్ని అర్హతలూ ఉన్నయ్!

అప్లికేషన్ రాసి పడేస్తేచాలు, రెక్కలు కట్టుకు వచ్చి వాల్తుంది' అన్నాడు రామకృష్ణ.

'ఏమిటా ఉద్యోగం?' అన్నాడు ఆత్రంగా.

ఆ ఉద్యోగార్హత తనలోనే చూచిన క్లబ్బు విరగబడి నవ్వింది మళ్ళీ.

కోటేశ్వర్రావు సాఫీగా, 'అబ్బె! ఏమంత పెద్ద ఉద్యోగం కాదురా! బోలెడంత జీతం! హాయిగా కాలుమీద కాలేసుక్కూచో వచ్చు. ఏటొచ్చీ ఇది ఆడవాళ్ల దగ్గర చేసే వుద్యోగంరా' అన్నాడు.

అప్పాజీరావు కోటేశ్వర్రావు హాస్యమాడుతున్నాడని ఊరుకొన్నాడు. ఫణిశాస్త్రి పేపరు లాక్కొని ప్రకటన ముందు పడేశాడు. 'ఓహో! ఇదా? మంచి ఉద్యోగమే!' అన్నాడు ఉప్పొంగిపోతూ.

క్లబ్బు నిరాశాజనకంగా నిశ్శబ్దం వహించింది.

'తప్పకుండా అప్లికేషన్ వేస్తాను. దీని అంతేమిటో చూడాలి' అన్నాడు నిర్లిప్తంగా.

అప్పాజీ అంత తేలిగ్గా లొంగిపోతాడనుకోలేదు. కొంతసేపు ఏడిపిద్దామనుకొన్న క్లబ్బుకి ఆఘాతం తగిలి, నోరుమూసుకూరకొంది. ఆశ్చర్యంతో వాపోయింది.

ఈ ప్రకటన సుందరిని నా కంటగడదామనుకొంటున్నారు కాబోలు' అన్నట్టు చూశాడు అందరి ముఖాలకేసి.

'రమణశ్రీ'

దీపాలు వెలిగాయి. తనలో కొత్తసమస్య మొలిచింది. క్లబ్బు వేళాకోళమాడినా అదే నిజమయ్యేలావుంది తనపట్ల. తన ఆవేదన వ్యక్తమయ్యే ప్రదేశంకోసం క్లబ్బుని కుబుసం విడిచినట్టు విడిచి బయల్దేరాడు ప్రియురాలిని ఊహాలోకాల్లో రంగురంగుల తెరల వెనక గవేషిస్తూ.

పోనీ క్లబ్బువాళ్ళన్నట్టు తమాషాకప్లికేషన్ పడేసి చూస్తే? ఏం జరుగుతుంది? జరగబోయే పరిణామాల్ని లీలగా అనుభవిస్తున్నాడు. ఈ అంతర్నాటకరంగంలో చిన్న పాత్ర వహిస్తే...చిత్రంగా వుంటుంది! నిజంగా ఆ అమ్మాయి తన్ని వరించినవాడు అందరి మొహాలు మాడిపోయి, యీర్ష్యాద్వేషాల్తో రగుల్కొంటాయి. ఫలాఫలాల్తో నిమిత్తంలేకుండా కాస్త కొత్త అనుభూతి పొందవచ్చు; పరిచయం పొందవచ్చు!

ఎలాంటివాళ్ళు యిలాంటి ప్రకటన చేస్తారు? ఎందుకు చేస్తారు? ఇందులో వంచనకు తావేమైనా వుందా? అందంలేనివాళ్ళు ఆదరాలేనివాళ్ళు ఇలాంటి ప్రకటన చెయ్యొచ్చు!

ఈ సారికా కన్య కోరితే ఎంతమంది రాకపోయ్యారు? ఇందులో వాళ్లేమాత్రం మోసం తలపెట్టినా తను నగుబాటుపాలు కావల్సివస్తుంది!

గదికివచ్చి ఆలోచనల్తో మరిగిపోయాడు. ఆ మరుగులో ప్రకటన సుందరి రూపశ్రీ రేఖామాత్రంగా నీడవడుతూ చెరిగిపోతోంది.

తల్లీదండ్రిలేని తనకి స్వేచ్ఛాస్వాతంత్ర్యం రెండూ ఉన్నాయి. ఐతే, మేనమామ చేతిలో డబ్బు చిక్కనందువల్ల తన ఆటలు బాగా సాగవు. అదే అతని దిగులు. ఇప్పుడైనా నీ ఆస్తెంతని అడిగితే మీనమేషాలు లెక్కపెట్టాల్సి వస్తుంది.

ఆ రాత్రి భావప్రకంపనల్తో ఏదో ప్రణయసందేశం పోష్టుమేన్ ద్వారా వెళ్ళింది. నాలుగురోజులకి సమాధానం నిదానంగా వచ్చింది. అల్లిబిల్లిగా అల్లుకొన్న అక్షరాల్లో భావసౌందర్యాన్ని విడదీసుకొని చదువుకొని మురిసిపోయాడు. తన స్వరూప స్వభావాల్ని లేఖామూలకంగానే గ్రహించిన తదీయసుందరి అపూర్వవిజ్ఞానానికి అప్పాజీ ఉప్పొంగిపోయాడు — 'ఈ స్వయంవరం గర్వానికి కారణభూతమైందికాదు! ప్రకటన పూర్వకమైన వరాన్వేషణ తప్పుగా భావిస్తే మేం చేసేదిలేదు. అన్నింటికీ విశాల హృదయంకావాలి! ఆకతాయితనంగా వంచ దృష్టితో వచ్చేవాళ్ళకి తగిన సమాధానం దొరక్కపోదు. మీ మనోగతమెలావున్నా మీరు ఉత్తరంతోనే ఆకర్షించారు. మీ పరిచయభాగ్యంకోసం ఎదురుచూస్తున్నాము—'

అప్పాజీరావుకి ముఖ్యమైనదంతా ఇదే! అతనిలో అహం పటాపంచలైంది.

అప్పాజీరావు వివాహ వ్యవహారంలో కలగజేసుకొన్నవాళ్లు పరాభూతులై తగిన సమాధానం దొరక్క తిరిగిపోయారు!

* * *

స్వయంవర ముహూర్తంనాటికి అప్పాజీ



లంబాడీలు

—ఫొటో: వి. కేశవశర్మ,

రావు అన్ని హంగుల్తో బయల్దేరాడు. చిరునామా ప్రకారం ఆ యింటి ముందు ఆగాడు ముందు చిన్న గేటు. రకరకాల పూలమొక్కల్తో అలిబిల్లి తీగల్తో అందముగా కనిపిస్తూన్న ముందర—ఆకర్షణీయముగా రేడియో స్టేషన్‌లో కట్టిన కట్టడం. ఇంత చక్కని భవనంలో మరెంత చక్కని అందాలరాణి నివసిస్తుందో? ఆ అందాలరాణి ప్రత్యక్షమై కోరిన వరమిస్తే చాలు!

గేటుదాటి లోపలికి దారితీశాడు ముసలి నౌకరు కునికిపాటు పడుతున్నాడు

ఎవరికోసం? అన్నట్టు తలెగరవేశాడు.

'ఈ యింట్లో ఎవరు?'

'అమ్మాయిగారూ, అమ్మగారూ ఉన్నారండి! ఎవరుగావాలి?' అన్నాడు. 'అమ్మాయిగారికోసమే ఐవుంటుంది!' అని చిరునవ్వు చిందాడు.

అమ్మాయిగారికి మగస్నేహితులు కూడా వున్నారన్నమాట. ఇందులో ఐతే వంచనాత్మకమైన దృక్పథం వుంటే తనకెంత ఆశాభంగం! వెలుగుల్లో నగుబాటు!

'లోపల హాల్లో కూచోండి బాబూ! త్వరలోనే వస్తారు. అప్పారావు హాల్లో కూచున్నాడు సోఫామీద హాలంతా తీర్చిదిద్దివుంది. నిలువుటద్దాలు, ఫోటోలు పటాల్లో నీనలీనుతూ కళ కళలాడుతూ నిశ్చలంగా వుంది గడియారం టిక్కులు, హృదయ నిస్వనం తప్పించి, ఎలాంటి శబ్దమూలేని హాల్లో ఏదో మాధుర్యం తరంగమయంగా కురంగలిపోంది. ప్రతీవస్తువు జాగ్రత్తగా పాలిష్ చేయబడి, నీపశాతూ ఉన్నతశ్రేణికి చెందిన వనితవానికి పెట్టింది పేరుగా నిలిచివుంది

అప్పాజీలో భావతరంగాల మోహ మధుర తరంగా శృంగార నౌక తొలమీద జారుతూ తేలుతూ సాగుతున్నది.

ఇంతలో ఎవరో వయసు మీద పడుతోన్న స్త్రీ నిశ్శబ్దాన్ని చీలుస్తూ అప్పాజీని పలకరించింది—

ప్రకటించి రప్పించినందుకు క్షమాపణ కోరుతూ, 'ఎవరూ ఆసరాలేక చివరికిలా చేయాల్సి వచ్చింది. దీనికి ఆ నేకమంది రకరకాల అపోహలుపోతారు. లోకం తీరే అంతే' అంది.

ఈ క్షమాపణెందుకో అప్పాజీలో కొత్త ఆవేశాన్ని రగిలించింది.

'దానికేంలెండి! అదేమంత క్షమాపణ కోరాల్సింది కాదు ఇలాంటి ప్రకటనలు ఈ కాలానికేం కొత్తగాదు! అందులో అసహాయస్థితిలో మీరు చేశారంటే అందులో తప్పేముంది? తప్పేదేముంది?'—అన్నాడు సహజధోరణిలో

'మనసులో మాట దాచుకోకుండా అన్నారు. అదే పదివేలు' అని ఉత్సాహం కనిపిస్తూ, 'అనేకమంది ఈ నమ్మం ఎక్కువాళ్ళకి గుర్తోచలు చేసి కొరగాకుండా చేశారు. అలాంటి శత్రుత్వంతో జీవించేవాళ్ళెంతకాలం నిలుస్తారు? ఎవళ్ళపాపం వాళ్ళది' అని ముఖం ముడుచుకొంది.

ఐతే తనకెవరూ అభిప్రాయపూర్వకంగా దురోచన చేయలేదేం? వాళ్ళ దృష్టిపథం నించి తప్పించుకొని వచ్చాడన్నమాట!— ఐతే ఇందులో అంతర్యమేమిటో ఊహించుకోలేక పోయాడు.

★ ప్రకటన సుందరి ★

'అమ్మాయి స్నానం చేస్తోంది!...... ఈ పాటికయిపోయేవుంటుంది. పంపిస్తావుండండి' అంటూ ఆవిడ లోపలకెళ్ళిపోయింది.

'అమ్మయ్య' అంటూ నిట్టూర్చాడు.

కదలికలో ఏవో మెరుపుతరంగాలు గోచరించాలి. చూపులో నిత్య నూతనత్వం స్ఫురించాలి' మెదడులో తియ్యని ఊహలు ధారపోసే రూపశ్రీ ప్రత్యక్షంకావాలి! వాక్కులో రసవత్తరమైన భావమాధుర్యాన్ని ఆస్వాదించాలి!

ప్రకటన సుందరి ప్రత్యక్షమైంది!

అభివాదన పురస్సరంగా పలకరించింది.

పూర్వోత్తరాల మేలుకలయిక ఆమెలో ఫేషన్. ఏదో అనుభూతికోసం తహతహలాడే వయసు-ఇరవయ్యేళ్ళకు మించని సౌందర్యం-మంచులో విడి సూర్యకిరణాలకి మిలమిల మెరుస్తోన్న బిందువులాంటి లావణ్యం-ప్రభాతోదయంలో అరుణరాగ రంజితమైన నీలాకాశం రంగు షిఫాన్ చీర, అరటాకు పచ్చని వెల్వెటు జాకెటు - వీటితో అందచందాలకి ఫేషన్లకి లోటు లేదనిపించింది.

మీరేం చదువుతున్నారు? ఎక్కడ?

ఏ గ్రూపు? టెక్నికల్ కోర్సు ఎందుకు చదవలేదు? ఇలాంటి పూర్వాపర ప్రశ్నలన్నీ ఐనాక, 'మరేమనుకోక మీ కులమేమిటో చెపుతారా? ఊరికే తెలుసుకోవాలనే కోర్కె తప్ప మరేం కాదనుకోండి! మీరు మరోలా భావిస్తే నేనేం మాట్లాడను' అంది చిన్నగా చిరునవ్వునవ్వుతూ అప్పాజీరావుకి ఈ ప్రశ్నతో ఎత్తిపొడుద్దామనిపించింది. 'కులప్రస్తావనలేని మీ ప్రకటన వ్యక్తిగతంగా ఎందుకొక్కవల్సి వచ్చిందో నాకర్థం కావడంలేదు. ఐతే మీ కులమేమిటో ముందు చెప్పి తర్వాత నన్నడగండి' అన్నాడు తీవిగా.

'మాకులం ఆదిలో ఎలుకల కులం మాతండ్రి పాముదర్మాలతో వ్యాపారం చేసి బాగా గడించాడు. పందుల్ని, అడవిపందుల్ని కూడా కొని అమ్మేవాడు. మా అదృష్టం బాగుండి, ఈ నాటికింత ఐశ్వర్యం నిలిచింది. ఇందులో ఏమీ దాపరికం లేదు.'

'మేం అరుంధతీయులం - అంటే తెలిసిందనుకొంటా'

'తెలియకేం! ఆ మాత్రందానికే అంత దాచుకోవాలా? ఎవరైనా ఏది ఎలా ఐనా, నా ఆదర్శాలకి, అభిరుచులకి ప్రతినిధులుగా నిలబడ్డారు. మీ వెనక ముందెవరైనా ఉంటే వారితో సంప్రదించండి! లేకపోతే ఏ చిక్కూ లేదు.'

'మా మేనమామొకడున్నాడు. నా ఆస్తి కీలకమంతా ఆయన చేతిలో ఉంది. కానీ రావాలంటే ఆయన ద్వారా రావాలి! ఆయనో పెద్ద కమతందారు! ఆయన చెప్పినట్లు వినకపోతే ఆస్తి దక్కనివ్వనంటాడు. ఆయన కనిపెంచుతోన్న ఒంటిపిల్లను చేసుకోకపోతే మోక్షం లేదంటాడు! ఇంకేలా చెప్పండి! ఆస్తి నన్నొదులుకోవాలి! ఒంటిపిల్ల నన్నా పెళ్ళాడాలి!'

'భలే చిక్కే తెచ్చిపెట్టారే! ఏదో ఉపాయాన ఆ డబ్బు కాస్తా చిక్కబట్టుకొని గట్టున పడందే మీకు ముక్తిలేదు. మీరూ మీయిషం - మధ్యనాయనేమిటి?'

అప్పాజీ నెమ్మదిగా సోఫాలోనించి లేచాడు. పోతేపోయింది. మన దగ్గరున్న డబ్బు చాల్లెండి అంటుందని ఆశించాడు. డబ్బు దగ్గిర గట్టి మనిషే!

'ఐతే నాకు తెలియక అడుగుతా' ఈ స్వయంవరానికింత వరకూ ఎవరూ రాలేదా?'

'రాకేం? నాకులం పేరు వినగానే, ముడుచుకుపోయేవారు. అలాంటి వాళ్ళంటే నాకసహ్యం. ఐనా ఎవరూ నా హృదయానికి నచ్చలేదు. ఇంతకూ ఘటన ఏది ఉండాలిగా'—

'మర్చిపోయాను. మీ పేరు?'

'తంగమణి'

సెలవుతీసుకొని బయల్దేరాడు. ఆపూట[illegible] ఉండమని మాట వరసకైనా అంటారేమో అని చూశాడు! కాని అంతమాట అన్న పాపాన పోందే ఎవరూనూ!

* * *

'ఇంతేనా? ఇంకేమన్నా వుందా?' అన్నాడు రామకృష్ణ.

'అంతకంటె మరేముంది? ముందు డబ్బు చేజిక్కించుకోమని సలహా యిచ్చింది. డబ్బుదగ్గర చాలా గట్టి-అది నేను మొదటి పరిచయంలో కనిపెట్టింది'

'తొలి సలహాయే నా చాలా బాగా యిచ్చింది. ఓనుమరి ఆవిడ డబ్బు మీద పడితే, త్వరగా కరిగిపోవడం మొదలు పెడతాయని'—

'సరే! ఇప్పుడు నన్నేం చేయమంటావు?'—'వెంటనే మీ మేనమామ, ఇంట్లో మకాంవేసి, నమ్మించి బతిమాలి బామాలి చేజిక్కించుకో' — అంతే!

ఆమాట విని అప్పాజీరావు మేనమామ ఊరు పరుగెత్తాడు ప్రణాళిక ఆలోచిస్తూ.

* * *

'మాయొచ్చాడు మావయ్యా—' అంటూ తల్లి సుబ్బమ్మ చెవిలో ఊదింది వంటిపిల్ల. తెచ్చి యిచ్చిన రిబ్బన్లు, జాకెట్టు ముద్దలూ, జడకుచ్చులూ రకరకాలు చూపించింది.

'ఇప్పట్నించీ ముచ్చిక చేసుకొంటున్నావే మావయ్య నిన్ను' అని సుబ్బమ్మ మేలమాడింది అల్లుణ్ణి చూసుకొని మురిసిపోయింది. 'నన్నే చేసుకుంటానన్నాడు గాదే?'

'ఎందుకు చేసుకోడూ? డబ్బంతా నాన్న చేతిలో చిక్కడి ఉంటేగా' అంది గడుసుదనంగా

'నాకా ఆలోచనే లేదుటవే!' అంటూ తెల్లబోయింది సుబ్బమ్మ మురిసిపోతున్న కూతుర్ని వెంటబెట్టుకొని వసారాలోకొచ్చి అప్పాజీరావుని పలకరించింది

'ఏరా అప్పయ్యా? పెద్దోడివేవావు. పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగాలు చేయబోతావు. అలాంటప్పుడు మాలాంటోళ్ళం గేపకం ఉంటాం?' కూతుర్ని ముందుకు తోస్తూ అంది 'చూడరా! దీని బతుకంతా నీ చేతుల్లో వుంది! నీళ్ళల్లో ముంచినా పాలల్లో ముంచినా నీదే బరువు బారం'


'అదేవిటత్తా! అలా గంటావూ? నా మనసు మీరు తప్పించి మరెవరున్నారూ?'

అప్పాజీ ఈ చిన్న మాటల్లో చాలావరకు తప్పించుకొన్నాడు. నూకాల్ని తను పెళ్ళి చేసుకోకపోతే మరెవరని వాపోయాడు. అప్పాజీ కంఠంలో గాద్గదికతని, కళ్ళలో తిరుగుతోన్న కన్నీళ్ళని చూసి సుబ్బమ్మ కరిగిపోయింది.

'ఆరు మూడయినా, మూడు ఆరయినా, నూకాల్ని చేసుకుంటాను. పాపం దాని బతుక్కి కాలొక్కటే లోపించింది గాని ఏం లోటు! నాకున్న ఆస్తి చాలు-ఇంకో చిన్నవాణ్ణి చితకవాణ్ణి కాదు బరువూ బాధ్యత భరించగల శక్తి వుంది! ఎక్కడో నా ఉద్యోగం చేసుకొంటూ నూకాల్ని పోషించుకోలేకపోను! ఎంతకాలం ఎదిగిన పిల్లని ఇంట్లో పెట్టుకొని మీరుమాత్రం ముద్దుముచ్చట తీరకుండా కళ్ళు కాయలు కాపించుకొంటారు!'

సుబ్బమ్మకి అప్పాజీ ధోరణి చక్కగా నచ్చింది. ఎంతో బుద్ధిమంతుడనిపించుకొంది! నూకాలమ్మకి కూడా సంతోషం ముమ్మురమైంది. హృదయం పరవళ్ళు తొక్కింది చదువుకొన్న బావ, అందాల కందం-వయస్సుకి వయస్సూ-అన్నిటా అనుకూలమైన స్వాభావికతతో తనకంతకంటే మంచి మొగుడెక్కణ్ణించి వస్తాడు!-తన రొట్టకాలు చూసుకొని గతుక్కుమంది!

సుబ్బమ్మ వంటింట్లోకి వెళ్ళింది.



★ ప్రకటన సుందరి ★

అప్పాజీరావు పడక గదిలోకి దారి తీశాడు. వెన్నంటి కాళ్లీడ్చుకొంటూ వెళ్లింది నూకాలమ్మ.

'ఏం నూకా! నన్ను పెళ్లి చేసుకోవడం నీకిష్టమేనా?'

నూకాలు సిగుపడుతూ, 'అదేంటి బావా? నిన్ను గాకపోతే ఇంకెవర్ని? అమ్మ చెప్పింది కదా! అలాగే నేనూ అనుకొంటున్నా. పాలముంచినా నీళ్లముంచినా నీదే భారం... ఇంతవరకూ నువ్వు చేసుకోవేమో అని భయపడి పోయాను'.

నూకాల్ని దగ్గరికి తీసుకోపోయాడు. వారించింది. అదే చాలనుకొని ఊరుకొన్నాడు-తనెంతో ప్రేమ ఉన్నట్టు నటించాలి! సిగ్గును చిందరవందర చేస్తూ తల్లిదండ్రులముందు అన్యోన్యత ప్రదర్శిస్తే వాళ్లకి తనమీద విశ్వాసం జనించి, తన పథకం పారుతుంది!

ఉన్న నాల్గురోజులూ వాళ్ళని నమ్మిస్తూ మీలునామా కాగితాలు, ఇనపెట్టెలో నగలూ నాణాలు అనుపానులు అన్నీ సంగ్రహించుకొన్నాడు. పెళ్ళికి ముహూర్తం దగ్గరలో నే నిర్ణయించాడు. బ్యాంకులో వేసిన డబ్బు తన పేర మామచేత మార్పించాడు. అంతా వారం రోజుల్లో పూర్తిచేసుకొని బయట పడాడు. అవతల ముహూర్తం ముంచుకొస్తోంది!

* * *

'ఏమిటీ హంగామా!'

అంది రంగమణి ఉచ్ఛ్వాసనిశ్వాసాల్లో నవ్వుల్లో నలుగుతూ.

అంతా సంగ్రహించుకొచ్చాను! ఈ నగల మూట జాగ్రత్తపెట్టు.'—అన్నాడు అప్పాజీ.

'ఎంతయినా డబ్బుతో పని బ్యాంకులో దాచుకోలేక పోయారా?'

మూట విప్పి చూసింది. కాసుల పేరు, జిగినీ గొలుసు, చంద్రహారాలు మొత్తం ఏభయి అరవై కాసులకి తక్కువుండదు. రంగమణి కళ్లు రంగత్తర్థంగాల్లా పొంగాయి ఇక దాచడం ఇష్టం లేక దాచినట్టు దాచింది. తనని బాగా హృదయంతో సన్నిహితమౌతోన్న వ్యక్తి విశ్వాస నిశ్వాసం ప్రవర్తించెయ్యడం పెద్ద ఆశ్చర్యమేవుంది?

'నాలో ఎలాంటి అనిశ్చలతా లేదు. భావగంభీరమైన హృదయ పంకేజంలో తీయని మధుతరంగం, తుమ్మెద ఝుంకారం విలిపిస్తున్న ఈ రేయి వెన్నెల పూతకి తళుకెక్కి కైపెక్కుస్తున్నది. ఈ మధుర యామినిలో నాగమ్యాన్ని చేరడానికి ఆటంకమేమిటి?' అనుకొన్నాడు. క్రమంగా గమ్యం సాధించాడు.

అలా ఎంతకాలం సౌఖ్యాన్వేషణలో ఉండిపోయాడో వారాలూ, వర్షాలూ తిథులూ నక్షత్రాలు ఏమీ తెలిసి వచ్చినవి కావు!

'ఎంతకాలం ఇలా కూర్చుని తినడం? ఇదేం పురుష లక్షణం కాదు'

రంగమణి హితోపదేశానికి, అప్పాజీరావు నవ్వుతూ, నాలో బలహీనత చూశావుగా! ఒక్కక్షణం నిన్ను విడిచి వుండలేను! అలా వుంటే నేనేదో వేదనతో చావాల్సి వస్తుంది'—

రంగమణికి అప్పాజీ అంటే విసుగు పుట్టింది. ఆనాటి నించీ తప్పించుకు తిరగడం మొదలు పెట్టింది. రంగమణి విషయంలో అప్పాజీ జోక్యం లేదు! రాను రాను అతని ఆరోగ్యం క్షీణించడంతో విషయం పట్టించుకొనేవాడే లేకపొయ్యాడు.

'ఇదేం అన్యాయం?' అని వాపోయాడు.

'కర్మ పరిపాకం' అని రంగమణి నవ్వింది. 'నువ్వు తెచ్చిన డబ్బంతా ఐపోయింది! ఐనా నీమీద అభిమానంతో ఆలోచిస్తున్నాం! లేకపోతే ఈ పరికే...'

'ఆఁ' ఒక్కసారి స్తంభించిపోయాడు నరాల్లో రక్తం గడ్డకట్టుకొని ప్రవహించడం మానేసింది. ఏ కొండసానుపుల్నించో కాలు జారిపడిపోతున్నాడు రేసులు రేసులుగా చీలిపోతోన్న అతని జవసత్వాలు గాలిలో ఎగిరిపోతున్నాయి ఆస్తి..కన్ను మూసుకొని జపిస్తోంది ఏ మహారణ్య మధ్యంలోనో!

'నా ఆస్తి నాకు పారెయ్యండి.'

గావు కేక వినిపించింది అతని కంఠంలో నించి' ఒకవికటాట్టహాసం ..భద్రకాళిలో చనోజ్జ్వలగోచిళ్ళట...రంగమణిలో కనిపించింది...గడగడ వణికిపోయాడు.

నీఆస్తి ఏనాడో కరిగిపోయింది! ఎవరు నువ్వు? పీనుగుతో సమానం! ఇక్కడ్నించి బయల్దేరి నీ బతుకు నువ్వు చూసుకో! నువ్వెవరు? నేనెవరు? నామెళ్ళో తాళిగట్టావా? నీ మేనమావబిడ్డ ననుకొన్నావా?

ఇంత మోసమా? యీ ప్రపంచం! ఛీ! నీపాపిష్టి మొహం చూపెడూడదు! సకల పాపాలకు మాలిన్యాలకు నిలయమైన నీముఖం, నీ హృదయం ఇంత పాషాణంతో నిండిందని ఇప్పుడు తెలిసింది!

అన్యాయంగా కావల్సినవాళ్లని మోసం చేసి డబ్బంతా నీముఖాన పోసాను. నూకాలు నా ఉసురుపడి ఎంత దుఃఖిస్తోందో! కుంటు కుంటూ సాగిపోతున్న నూకాలు అవమానం పాలై ఏనూతిలోనో గోతిలోనో పడ్డానికి...అబ్బ! తలచుకొంటే చాలు... తనవంటి నిండా బురద గుండెల్నిండా బాడి...

రంగమణి లోకం దద్దరిల్లేటు నవ్వుతోంది ఇంకా నవ్వుతోంది! ఆ నవ్వులోంచే మళ్ళి అపూర్వమైన ప్రకటన వెలువడింది తగుడు కావాలని, చిరునామా మారి...

అప్పాజీ చీకటిదారుల్లో పడి ఏ లోకాలకో పయనం సాగిస్తున్నాడు! ★

తంజావూరు వీణ

తంజావూరు వీణ తల్చుకున్నప్పుడల్లా తన్మయమైపోతుంది దుర్గ. ఒక్కటే ఒక్క కోరిక...... తీయని కోరిక........ పట్టెమంచంమీద కూర్చుని పగటికలలు కంటూంది. దుర్గకి దుఃఖం పొర్లుకొస్తూంది. వరండాలో వాణి, వనజా...క్షీ...రో... కల్యాణిలో దంచేస్తూంది వీణమీద. విద్వాన్ భాగవతార్ ...వాణివీణతో తనో వీణ మేళవింపజేస్తూ మధురస్వరాలతో మత్తెక్కించేస్తున్నాడు. తంజావూరు వీణ— మొన్ననే వాళ్ళనాన్న వాణికి మూడువందలెట్టి ముచ్చటగా తెప్పించాడట. వాణి ఎంత అదృష్టవంతురాలూ! దేనికైనా పెట్టి పుట్టాలి...రోజూ పొద్దున్నే ఏడుగంటలకల్లా వాణి వరండాలో కూర్చుని వాయించుకుంటూ...ఉంటుంది...

"దుర్గ పట్టెమంచంమీద కూర్చుని పగటికలలు కంటూ...ఉంటుంది నాన్న ముందరి వరండాలో కూర్చుని Files తో సతమతమవుతూ— ఉంటాడు అన్నయ్య ఆల్జీబ్రాతో గాబరాపడుతూ...ఉంటాడు. ఇవతల తమ్ముడు ఇంగ్లీషుతో యిల్లెగర కొడుతూ ఉంటాడు. చిట్టిచెల్లాయి చిట్టిబొమ్మల పెళ్ళి చేసుకుంటూ...ఉంటుంది. అవతల అమ్మ వంటతో వరుగైపోతూ... ఉంటుంది తనేమో తంజావూరు వీణకోసం తల్లడిల్లిపోతూ..... ఉంటుంది. ఎప్పుడు కొనుక్కుంటానా? ఎప్పుడు వాయించుకుంటానా?" అని కలలు కంటూంది. ఏమో! ఎప్పుడో! చిన్నప్పటినుంచీ కంటూన్న కలలన్నీ ఎప్పటికి నెరవేరుతాయో ఏమో?

"నా నాన్నకూడా వాణివాళ్ళ నాన్నలాగే పెద్ద ఆఫీసరైతే? నేనుకూడా తప్పకుండా తంజావూరు వీణ కొనుక్కునేదాన్నికదా!" తన జీవితంలో యెప్పటికైనా ఈ కోరిక తీరాల్సిందే......! తనకి పదేళ్ళప్పటినుంచీ గుండెల్లో గూడుకట్టుకున్న ఈ తీవ్రమైన తీయని కోరిక హృదయకుహరంలో తీగలలుకుంటూ వచ్చింది.

తనకి పదోయేట దుర్గ మేనమామగారింటికి మద్రాసు వెళ్ళింది. అప్పుడు ఒకరోజు మామయ్య తన పిల్లలతోపాటు తన్నికూడా పాటకచేరీకి తీసికొని వెళ్లాడు. అదే ప్రథమం తను పాటకచేరీకి వెళ్లడం. రసికరంజని హాలంతా క్రిక్కిరిసి యిసుకవేస్తే రాలకుండా వుంది! చీమకూడా చిటుక్కుమనడంలేదెక్కడా! దుర్గ మామయ్యప్రక్కనే ముందరిసీట్లోనే కూర్చుంది.

ఆనందం! కాదు. తన్మయమైపోతూంది...

"ఎవరావిడ?"

"ఎవరేమిటే?" వరవీణామృదుపాణి.... వనరుహలోచనరాణి...తియ్యని కంఠం... కమ్మని రాగం ... అమృతాలొలికించే గాత్రం...! "భేష్! భేష్!!" చప్పట్లతోటి తాళాలతోటి హాలంతా మార్మోగిపోతూంది.

జె. వి. రత్నావళి

అబ్బ! తంజావూరు వీణ! ఎంతచక్కగా వాయించేస్తూంది!...ఒక్క తీగమీటుతో ఒక్క వెయ్యి హృదయాల్ని మైకం కప్పేస్తుంది! తనుకూడా తప్పకుండా వీణ కొనుక్కోవాలి!

"మామయ్యా! నాకలాంటి వీణ కొనవా?"

"ఓస్! అలాగే!"

శంఖంలోంచి ఓంకారం పుట్టినట్టే కంఠంలోంచి గమకం మేళవిస్తూంది గాత్రం! అంతా పరవశులైపోయి ప్రతిమల్లా వింటున్నారు. మధుర స్వప్నాలతీగలు చుట్టలు చుట్టలుగా చుట్టుకుని తురిమేస్తున్నాయి నా హృదయాన్ని! పాటకచ్చేరీ అయిపోయింది.

అంతా బయటికి వచ్చేశాం.

"అమ్మా! నాకూడా అలాంటి వీణ కొనవే" పసి హృదయం పరుగులెత్తింది.

"వీణంత బరువులేవు! అప్పుడే వీణేమిటే" కళ్ళనీళ్లు తుడిచింది అమ్మ.

"పెళ్లయాక మీ ఆయన కొంటాడులే!" వెకిలిగా నవ్వుతూ మామయ్య అన్నాడు.

తను వీణ నేర్చుకోవాలంటే పెళ్లవాలన్నమాట.

తంజావూరు వీణ తల్చుకున్నప్పుడల్లా... తలడిల్లిపోతూంది.

దుర్గకి దుఃఖం పొరుకొస్తూంది.

పసిహృదయంలో పాతుకుపోయిన ఆనాటి మొలక ఈనాడుకూడా ఫలస్వరూపానికి పరుగెడుతూంది. అమ్మకి వంటింట్లో వండడం వడ్డించడం......తనకి పెళ్ళిచెయ్యడం యివితప్ప మరేతాపత్రయం ఉండదు.

నాన్నకి కళ్ళముందు కాగితాలకట్టలు... హృదయంలో పాగమారిపోయిన ఊహలు ...చెవుల్లో....ఆఫీసరు....హాహాకారాలూ ...తప్ప వీణశృతులు వినిపించనే......వినిపించవు

"ఆఫీసరువయ్యాక కొంటానులే!" ఊరుకోబెట్టేవాడు నాన్న. నాన్న ఆఫీసరెప్పుడవుతాడు? ఆ శుభముహూర్తం ఎప్పుడొస్తుందీ? తను తంజావూరు వీణ ఎప్పుడు కొనుక్కుంటుందీ? ఆ శుభముహూర్తంకోసరం కళ్ళుకాయలు కాచేలా నిరీక్షిస్తూంది దుర్గ. కాలంకోసరం ఎదురుచూస్తూనే......ఉంది. నిరీక్షిస్తూన్నకొద్దీ ......నిముషాలు యుగాలైపోతున్నాయి! నయనాలు నరాలపటుత్వం తప్పి ముత్యాలు జలజలా రాలుస్తున్నాయి. తంజావూరు వీణ! తల్చుకున్నప్పుడల్లా తన్మయమైపోతూంది ...నాన్న ఆఫీసరవాలి. తంజావూరు వీణ కొనాలి

"నాన్న ఆఫీసరైతేమాత్రం! ఆఫీసరుకి తగ్గ ఖర్చులుండకుంటాయి. అన్నయ్య కాలేజీ చదువు...నీ పెళ్ళి...నాన్నగారి రక్తపు చుక్కలన్నీ పోడగట్టి లెక్కబెట్టి నీకు కట్నం పొయ్యాలి...తప్పదుకదా!

ఒక్కమాటు దుర్గకి దుఃఖం పొర్లుకొచ్చింది...హృదయంలో అగ్నిపర్వతం బ్రద్దలైంది......గోదావరి గట్లు తెంచుకు ప్రవహించింది...అబ్బ! నాన్నగారి రక్తపుబొట్లు రాలందే తనకి పెళ్ళికాదు! కాకపోతే వచ్చిన నష్టం?...మిన్ను విరిగి మీద పడిపోతుందేమో!......భూకంపం బయలుదేరదుకదా!............ఔను పెళ్ళి చేసుకోకపోతే తన్నెవరు భరిస్తారు? కాళ్ళు కడుపులో పెట్టుకుని పడుక్కుంటే?..... ఛీ! ఏమైనా గానీ నేను చస్తే పెళ్ళిచేసుకోను...అడుగునుంచి మంట బెట్టి మీదినుంచి నీళ్లు పోసినట్లు చిన్నప్పటినుంచీ కోరికల్ని అణచిపెట్టి కనకాభిషేకం చేస్తేమాత్రం తనకి ఆనందమా? తన చిట్టిచెల్లాయి పుట్టినప్పుడు అమ్మమ్మ...అల్లుడితో—ఏమమ్మాయి! రెండో మాట

★ తంజావూరు వీణ ★

కూడా కట్టడం ప్రారంభించిక" అని అంటుంది. పుట్టిన రోజునుంచీ పెళ్ళికిపోట్లాం కట్టడం తోటే సరిపోతూంది ప్రయత్నం. పెళ్లీడొచ్చినా చివరికి ప్రయత్నం ప్రయత్నం గానే ఉండిపోతూంది!

"ముష్టాడు పాడుకుంటూ వస్తున్నాడు. స్వేచ్ఛగా ఎలా పాడుకుంటూ తిరుగుతున్నాడో చక్కగా!

ఔను! అదే బాగుంది. ఈ పెళ్లిచేసుకునే కన్న అలా గుళ్ళో గుడ్డిదై పాడుకుంటూ కూర్చుంటే నలుగురూ తలో కానీ వెయ్యక పోతారా! ఛీ!—తనకన్నీ యిలాంటి పిచ్చి ఊహలే...కాక పోతే యేమిటి? తిండిగుడ్డలకోసరం పెళ్ళిచేసుకోవాలా?... చేసుకోక పోతే తనేం చెయ్యాలి? తనేం ధనవంతురాలు కాదు గదా! కాలుమీద కాలు వేసుకుని కూర్చుందుకు......పోనీ తనకి చదువన్నా వచ్చా సంపాదించుకుని తినడానికి?" పోనీ తను ఏ గ్రుడ్డిదైనా అయిందా? గుళ్ళోకూర్చుని దేవుడికి చెవుడు పోయేలా శ్రావ్యంగా పాడడానికి!...తనకి గాత్రం ఉన్నా సంగీం కూడా రాదు!... దేవుడు ఎంత నిర్దయుడు? ఉ...త్త...రాతి గుండెవాడు. లేకపోతే యేమిటి? అడుగడుగుని అవరోధాలే!......అన్నీ ఆశలే...అవి తీరే అవకాశాలే లేవుగానీ! ఏమైనాసరే ... ఆ ముష్టాడిలాగే ముష్టైనాయెత్తి బ్రతుకుతాను గానీ పెళ్ళిమాత్రం ఛస్తే చేసుకోను!

అయినా అంతా అలాంటి మేళమే!

అసలీమొగాళ్లంతా యింతే...ఉ...త్త మోసగాళ్లు! వీళ్లెందుకు పెళ్ళి చేసుకోవాలి......ఈ ఆడవాళ్ళకి పెళ్లి చేసుకోవడం తప్ప ఇంకేం చేతగాదుగా!...అందుకే పెళ్లి చేసుకోవాలి. పెళ్లిమాట జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అమ్మ అన్నమాటలు జ్ఞప్తికి వస్తాయి నాన్నగారి రక్తపుచుక్కలు వడగట్టి లెక్కపెట్టి కట్నం పోస్తేనేగానీ తనకి పెళ్లి కాదు...! అలాంటి రక్తం పిండుకుత్రాగే రాక్షసుల్నే? పెళ్లి చేసుకోవడం? ఔను సాక్షాత్తూ రాక్షసులే. కట్నం మ్రింగే కలియుగ రాక్షసులు. కాక పోతే...ఏమిటీ...కాకిగోల?...ఆనాడు...దాసుగాడు చూడరాదు! ఏం చేశాడోను. ప్రతి సెలవులకీ వచ్చేవాడు. తన్నెవరు రమ్మన్నారూ? రైలుదిగడం తడవు...వచ్చిపడేవాడు తనదగ్గరికి. విసుగు విరామము లేకుండా రాత్రింబగళ్లు...తిండి తిప్పలు కూడా మరిచిపోయి...పేకాటో...కేరం బోర్డో పెట్టుక్కూర్చుని..ఊపిరి సలపనిచ్చే వాడు కాదు ఆఖరికి ఆటలు ఆడి ఆడి నిద్రాహారాలు కూడా యెక్కడే ప్రారంభించాడు. ఈ వేసవి సెలవుల్లో అయితే మరీను...బొత్తుగా యింటికే వెళ్లడం మానేశాడు కబుర్లతో మాకుటుంబాన్నంతా కనికట్టులా కట్టేశాడు. అన్నయ్య స్నేహితుడు అమ్మా నాన్నామాత్రం ఏమంటారూ? ఓరమాపులు చూసుకుంటూ వచ్చేవాడు చేతిలో సిగరెట్టు పీడూను...

అమ్మకి అతనంటే మరీను...వాళ్ళె తెలియదు.

నాన్న కూడా అంతే ఆలోచించేవాడు కాదు. అలాంటి గారడీగాడు అల్లుడైతే చాలని మురిసిపోయేవారు! పెళ్లి ప్రస్తావన జరిగినప్పటి నుంచీ మరీ పిచ్చుపెరిగి పోయాడు. సందు దొరికితే చాలు...కొంగుపట్టుకు లాగి...కోతి చేష్టలు పీడూను. రంగద్వాలలోంచి నఖసిఖపర్యంతం నాణ్యంకట్టేవాడు. వెధవ వికారచేష్టలు...పీడూను. ఆ వేళ అదే ఆఖరిసారి దాసు సెలవులయ్యాక ఊరెళ్లిపోతున్నాడు. "దుర్గా! నీకు త...దుర్గాదాసుడు సుమా! ఏది-నీ చెయ్యి! ఒట్టు పెట్టుకుంటున్నాను. నిన్ను తప్ప యింకెవ్వర్నీ పెళ్ళి చేసుకోడీ దుర్గాదాసు వెళ్ళొస్తాను! శెలవా?...ఊ!...అను!" అని అనిపించుకుని మరీ రైలెక్కాడు. యేమిటీ శపథాలూ?... ఎందుకు ఈ నిర్బంధనలు? నిట్టూర్పులూను. తనేమన్నా పెదవివిప్పి ప్రార్థించిందా? కాళ్ళుపట్టుకుని బతిమలాకిందా? కవ్వించి కాళ్ళదన్నడానికి? అమ్మా, నాన్నా ఉత్త అమాయకులు. అబ్బాయి స్నేహితుడేగదా! అని పొంగిపోయారు. కట్నంలేకుండా అల్లుడొస్తాడేమోనని ఆనందసాగరంలో మునిగిపోయారు.

అది తల్చుకుంటూంటే యిప్పటికీ నాకు అరికాలి మంట...నెత్తి కొస్తూంటుంది. ఆ వేళ...అర్ధరాత్రి వేళ...అన్నయ్య తనూ సినిమాకెళ్ళొచ్చారు. తలుపుతీసింది .. చీకటి చాటునుంచి జడపట్టుకుని గుంజుకున్నాడు. ప్రక్కనే పెద్దతూంకాలువ ఉంది వరానికి వరదలై ప్రవహిస్తూను. కాలుజారితే?...తన గతేం కావాల్సిందీ?...వెంటనే దవడపళ్ళు రాలగొట్టాలనుకుంది తను. కానీ ... మళ్ళీ నలుగురిలోనూ తనకే చిన్నతనమనిపించింది.

ఆ వెళ్ళడం వెళ్ళడం మళ్ళీ కంటికి కనిపిస్తే ఒట్టు. రెండేళ్ళయిందిప్పటికి మొన్న అన్నయ్యకి పెళ్ళిశుభలేఖ వచ్చింది. అమ్మా నాన్నా నిర్ఘాంతపోయారు!...ఈ దుర్గాదాసు దుమ్ముగులిపెం చేసి ఉంగును...... అనవసరంగా అల్లరవడం యిషంలేక కానీ! ఔను...ఆడది అల్లరవుతే అవమానంకదూ!

ముల్లొచ్చి అరిటాకుమీద పడ్డా ఆకుకే ప్రమాదం! ఆకొచ్చి ముల్లుమీద పడ్డా ఆకుకే ప్రమాదం!......

ఎటొచ్చీ! ఆడదానికే అవమానం!

అందుచేత జరిగినమోసం నోరెత్తిచెప్పుకుందుకుకూడా అర్హతలేదు ఆడదానికి గుటుక్కున మ్రింగేసి కుక్కిన పేనలే చచ్చినట్లు పడుండడం తప్ప. గుటకలు మ్రింగుతూ గుడ్లప్ప చెప్పాలి వీళ్ళమోసానికి నలుగురిలోనూ అల్లరిపడితే? మళ్ళీ తనకి పెళ్ళి కాదు ఏమిదౌర్భాగ్యం?......దేవుడు వీళ్ళనేమీ చెయ్యడేం?...అవును.. దేవుడుకూడా ఉ...త్త......మొగవాడేగా!...ఛ...వెధవలు! ఇలాంటివాళ్ళు నెవరు పెళ్ళిచేసుకుంటారు?...కానీ ... వాణ్ణి...ఆ దాసుగాణ్ణి ...తల్చుకుంటూంటే......తన హృదయం రగిలిపోతూంటుంది. ఉత్త ... రౌడీవెధవ ...ఎన్నికుటుంబాలకిలా ఆరనిచిచ్చు అంటించాడో!......తల్చుకున్నప్పుడల్లా

'నేను ముందరే చెప్పాను.'

"అబ్బాయ్. ఏవిట్రా ఈ మార్కులు? నీ ప్రోగ్రెస్ రిపోర్టు నాకేం బాగుండలేదు సుమీ."

"అదే నాన్నా. మేష్టారితో నేనూ చెప్పా! 'మా నాన్నకి ఇది నచ్చదండీ' అని. అయినా సరే చూపించి రమ్మని ఆయన పంతం పట్టాడు."

కడుపు మండిపోతూంటుంది. తన కీమంట చల్లారదు! అందుకే తల్చుకోదు. తలపుకి రాకుండా తనకో తంజావూరు వీణ ఉంటే?...తల్చుకుంటేనే...తన్మయమై పోతూంది. మీరాలా మీటుకుంటూ కూర్చుందును! వాణిలా వాయించుకుంటూ కూర్చున్న తను!...దుఃఖం పొర్లుకొస్తూంది.

వాణీ! ఎప్పుడూ అలా వాయించుకుంటూ కూర్చుంటుంది! తనెప్పుడూ పట్టె మంచంమీద పడుక్కుని పగటికలలు కంటూ.. ఉంటుంది!......నాన్నెప్పుడూ కాగితాలకట్టల్ని కళ్ళకి కట్టేసుకుని ... కూర్చుంటాడు.

అన్నయ్యెప్పుడూ ఆల్జీబ్రాతో అవస్థపడుతూ ఉంటాడు! అమ్మెప్పుడూ వంటింట్లోనే తిరుగుతూ పోతూ......ఉంటుంది. తనెప్పుడూ తంజావూరు వీణకోసరం తహతహలాడుతూ ఉంటుంది. ఆ వేళ ఆ పాటకచేరీలో ఆవిడ ఎంతబాగా...వీణని మేళవింప జేసింది! అప్పుడే మైపోయింది...యిప్పుడు? ఆవిడ వీణామృతగానం తప్ప తన వీనులకింకేమీ......వినిపించడం లేదిప్పుడు. తన వీణా విలాపం ఎవరితో...చెప్పుకుంటుంది?

తన హృదయ 'వీధినిండా వీణలు......విపణి వీధినిండా......వీణలు......రేడియోలో...వీణలు......అంతా వీణా ప్రపంచం! తన కళ్ళముం దెప్పుడు చూసినా వీణలు కళ్ళకి కట్టినట్లే కనిపిస్తాయి కళ్ళు మూసే కలల ప్రపంచం! కళ్లు విప్పితే వీణా ప్రపంచం! అయినా...తనలాంటి...దరిద్రుల కిలాంటి కోరిక లెందుకియ్యాలి భగవంతుడు?....

చిన్నప్పుడు మామయ్య...అస్తమానూ-అనేవాడు. దీనికంఠం "కోయిలకంఠం" అని, ప్రతి సినిమాకి తీసికొని వెళ్ళేవాడు. తను ఒక్కసారి వింటేచాలు ఏకసంతగ్రాహిలా అక్కడికక్కడే పాడేసేదాన్ని చిన్నప్పుడు! ఆ వేళ సినిమాలో మామయ్య స్నేహితుడు కూడా నా పాటవిని "ఈ అమ్మాయికి సంగీతం నేర్పించవయ్యా! గానామృతవాహిని అయిపోతుంది." అన్నాడు. మామయ్య మాట్లాడలేదు!...ఔను కందికి లేని దురద కతి పీటకా! తన తలిదండ్రులకే అక్కర లేదు. తన సంగతి! అందులోనూ సంగీతం కోసరం కలవరించే దెవరు? తను ఏ తంజావూరులోనైనా పుట్టివుంటే! ఈ పాటికి ఏ గానకోకిలో అయివుండేది! ... దురదృష్టవశాత్తు ఆంధ్ర దేశంలో పుట్టింది. ఈనగాచి నక్కలపాలు చేసినట్లు మన సంగీతాన్ని అరవల పొద్దులోకి అప్పగించేశారు ఆంధ్రుల ధర్మమా అంటూ!

సినిమాల్లోకి వెళ్ళిపోతే?......ఏ ప్లేబేక్ సాంగ్సైనా పాడగలేది గదా! ఏ జిక్కియో! లతామంగేష్కరో!! వాళ్ళకి అమ్మమ్మ అయిపోయి ఉండేది కానీ......ఛీ! మళ్ళీ ఆ వేదవాసు...జ్ఞాపకం వస్తున్నాడు! త్యాగయ్య చెప్పినట్లు...ఎంతివారలైనా...కాంత దాసులే! ఎక్కడికి వెళ్ళినా... అందులోనూ...సినిమా రంగంలో దాసులాంటి దౌర్భాగ్యులే అందరూను. తనకింక వీణ ఎలాగొస్తుంది!...ఛీ! తంజావూరు వీణ తల్చుకున్నప్పుడల్లా తన్మయురాలైపోతుంది. త్యాగయ్య ఎంత గొప్పవాడు! రామదాసు ఎంత ధన్యుడు! ఏ నారదుడైనా వచ్చి తనకి కూడా ప్రత్యక్షమై ఏవీణైనా ప్రసాదించకూడదూ!...గంధర్వాంశం ఉంటేనే కానీ గానకళ అందరికీ అబ్బదట! కళకే కరవై పోయింది ఈ కలియుగంలో! కళారాధకులంత కన్నా కంటికి నలుసై పోయారు! ఎక్కడైనా.... తనలాంటి కళకోసరం కలవరించే వాళ్ళుంటే...అది వాళ్ళకి అందరాని పండై కూర్చుంటోంది!

అన్నయ్యకి కాలేజీ ఫీజు కట్టాలి! ... తనకి కట్నమిచ్చి పెళ్ళిచెయ్యాలి! ఒక్కొక్కప్పుడు యింట్లో కుండలు డింకీలు కొట్టే పరిస్థితి యేర్పడుతూంటే...జీవితాలు గడవడమే దుర్లభమై పోతూంటే సంగీత సాహిత్యాలెవరికి కావాలి?

నాన్న ఆఫీసరైతే ఆశలన్నీ ఫలిస్తాయి... ఆ శుభముహూర్తం కూడా అనుకున్నాళ్ళకి రానే వచ్చింది! నాన్న ఆఫీసరయ్యాడు. ఆ వేళ ఆనందం తాండవమాడింది! ఒక్కసారి యిల్లంతా! నాన్న నవ్వాడు ఆ వేళ!......

నాన్న ఆఫీసరయ్యాడు — అన్నయ్యకి వాచీ కావాలి!

నాన్న ఆఫీసరయ్యాడు — తనకేమో తంజావూరు వీణ కావాలి!

నాన్న ఆఫీసరయ్యాడు — తమ్ముడికి స్కూలికి వెళ్ళడానికి సైకిలు కావాలి!

నాన్న ఆఫీసరయ్యాడు — అమ్మకేమో గొలుసు కావాలి!

నాన్న ఆఫీసరయ్యాడు — చిటి చెల్లాయికి సిల్కుగౌను కావాలి!

నాన్న ఆఫీసరయ్యాడు — నాన్నకేం కావాలి?

మేమంతా నాన్న వాళ్ళమే గా! మాకన్నీ ఉంటే నాన్నకున్నట్టే!"


అనుకున్నాళ్ళకి నాన్న అంతకుముందు రెండు నెలలుగా... అక్టింగుగా ఆఫీసరు చేసిన డబ్బు ఐదువందలూ ... ఒకసారి కురిశాయి!

అన్నయ్య ఆ వేళ వంద రూపాయలూ పెట్టి వాచీ కొనుక్కున్నాడు! తమ్ముడు ఆ వేళ వందరూపాయలూ పెట్టి సైకిలు కొనుక్కున్నాడు! అమ్మ ఆ వేళ నూటయాభై రూపాయలు పెట్టి గొలుసు కొనుక్కుంది! చిట్టి చెల్లికి మిగతా యాభై పెట్టి చిన్న గొలుసు కొనేసింది అమ్మ! ఇంక తన వాటాకి మిగిలింది వంద! కాళ్లు దల్లబడ్డాయి! కళ్లు చెమ్మగిల్లాయి! వందరూపాయలకెవడిస్తాడు...వీణ? అమ్మ - వెళ్లక తొందర గాను. ఆ వందా కూడా ఆరిపోతే...! అసలుకే మోసం వస్తుంది తొందర పెటింది. తనకి.. వీణ వద్దన్నా! ఎవరూ వినే స్థితిలో కూడా లేరు!...


తండ్రి వెంటబెట్టుకొని బజార్లన్నీ తిరిగాం! దుకాణాలన్నీ దూరాం! వీణలన్నీ మాశాం! తంజావూరు వీణ తాహతుకి మించిపోయింది! మూడువందలు... రెండువందల యాభైకి...రకరకాలున్నాయి! వేరాని కెక్కడా దూరసంగులేదు! తలవంగి పోయింది...

"ఇక్కడన్నీ ఖరీదైనవే ఉంటాయి! చూపించమంటారా?" గుమ్మంలోంచి గీరగా చెబుతున్నాడా దుకాణదారుడు వీణలు


(42-వ పేజీ చూడండి)



సరుకు ర



వా ఙా　　ఫొటో: జి. ఎస్. శర్మ.



సరుకు ర



నందిలాల్ జస్వంతలాల్ దర్శకత్వాన తయారైన "తాజ్" చిత్రంలో వైజయంతిమాల.

★ బొంబాయి సినిమా లేఖ ★

జెకోస్లావాకియాకు వెళ్లిన భారత చలన చిత్ర ప్రతినిధివర్గ నాయకుడు శ్రీ బిమల్ రాయ్, అక్కడ తమ కొత్త కొత్త చిత్రం "మధుమతి"కి ప్రారంభోత్సవం చేసుకున్నారు. చిత్రంలో కొంత భాగాన్ని, ఆదేశంలో 'షూట్' చేయాలని ఆయన సంకల్పం. ఒక భారతీయ నిర్మాత, మరో దేశంలో తన చిత్రానికి ప్రారంభోత్సవం జరపడానికి ఇదే తొలిసారి. మొట మొదట చిత్రించిన సన్నివేశంలో, దిలీప్‌కుమార్ కెమేరా ఎదట నిలచారు. ఈ చిత్రంలో నాయిక వైజయంతిమాల. ఆమెకు కూడా జెక్ ఉత్సవ సంఘం ఆహ్వానం పంపారుగాని, కారణాంతరాలవలన ఆమె అక్కడికి వెళ్ళటం పడలేదు.

* * *


ఇంకా అనేక చోట్ల చలన చిత్రోత్సవాలు జరుగబోతున్నాయి. మన దేశం వాటిలో పాల్గొనబోతోంది. ఈ సందర్భంలో, ప్రభుత్వమూ చలన చిత్ర పరిశ్రమ వారూ కూడా ఆలోచించ వలసిన విషయం ఒకటి ఉంది. పదిదేశాల వారు కూడే చోట ఒక దేశపు చలనచిత్రాలు చూపించినపుడు, చూచేవారు ఆయా చిత్రాల ద్వారా, ఆ దేశపు చలనచిత్ర పరిశ్రమ కళా సాంకేతిక రంగాలలో అందుకొన్న ప్రమాణాలను అర్థం చేసుకోవడంతో పాటు, ఆదేశీయుల సాంస్కృతిక సంపదను, తీరు తెన్నులను అవగాహన చేసుకొన ప్రయత్నిస్తారు. మంచి చిత్రానికి బహుమతి ఇచ్చి గౌరవించడం అంటే, ఆదేశపు ప్రజల సంస్కృతిని గౌరవించడం అన్నమాట. అందువలన అంతర్జాతీయ ఉత్సవాలకు చలన చిత్రాలను పంపినపుడు అవి మన ప్రజల జీవన విధానాలను, మన సంస్కృతినీ ఎంత వరకూ ప్రతిబింబిస్తున్నాయన్న విషయం ఆలోచించి మరీ వ్యవహరించాలి. ఇంత వరకూ, ప్రభుత్వంగాని, పరిశ్రమలో పెద్దలు గాని ఈవిషయం పట్టించుకొనకపోవడం శోచనీయం.

* * *


నటుడు శేఖర్, "ఛోటీ బాబు" అనే చిత్రం నిర్మిస్తున్నాడు. అందులో అతడు, నిమ్మీ ముఖ్యభూమికలు నిర్వహిస్తారు. న్యాయ శర్మ నిర్మిస్తున్న "కినారే కినారే" లో దేవానంద్, మీనాకుమారీల జంట పాల్గొంటున్నది. దేవానంద్ నటించే మరో చిత్రం "ఫంటూష్". దీనికి నిర్మాత దేవానందే. హాస్యరస ప్రధానమైన ఈ చిత్రంలో నాయిక సింధీనటి శీలారామాని, దేవానంద్ సోదరుడు చేతన్ ఆనంద్ దర్శకుడు. శంకర్ ముఖర్జీ నిర్మిస్తున్న "బారిష్" (వర్షం) అనే చిత్రంలో నూతన్ రకరకాల దుస్తులలో కనబడుతుంది. కుంభవృష్టివల్ల జలమయం అయిపోయిన కార్మికులవాస ఈ చిత్రానికి కథా స్థలం.

షెక్ ఫతేలాల్ దర్శకత్వాన తయారవుతున్న "అయోధ్యాపతి"లో అభి భట్టాచార్య దశరథుడుగాను, ఉషా కిరణ్ కైకేయి గాను నటిస్తూన్నారు.

బెర్లిన్ చలన చిత్రోత్సవంనుంచి తిరిగి వచ్చిన సత్యేన్ బోస్ ("బందిష్" నిర్మాత) తమ కొత్త చిత్రం "ఏక్ గాఁవ్ కీ కహానీ" ప్రారంభించారు. ప్రసిద్ధ ప్లేబాక్ గాయకుడు తలత్ మహముద్, మాలాసిన్హా, అభి భట్టాచార్య ఇందులో నటిస్తున్నారు. రాజ్ కపూర్ కొత్త చిత్రం "జాగ్ తే రహో"లో నర్గీస్ "గస్ అర్దస్"గా కనబడబోతున్నది. చిన్న భూమికే అయినా కథలో దీనికి ప్రాముఖ్యం ఉన్నదట. ఇందులో సుమిత్ర మోతీలాల్, ప్రదీప్‌కుమార్, సులోచన



అనుపమవారి "ముద్దుబిడ్డ" లో జమున, మాస్టర్ వెంకటేశ్వర్.



జెక్ చలనచిత్రోత్సవానికి వెళ్ళిన దిలీప్‌కుమార్, బిమల్ రాయ్ (భారతబృందం నాయకుడు), ఆయనభార్య, పిల్లలూ, చేతన్‌ఆనంద్, శీలారామాని.

చటర్జీ ప్రభృతులు పాల్గొన్నారు. సంగీత దర్శకుడు సలీల్ చౌదరి. ఈ చిత్రం త్వరలో నే విడుదల కాబోతుంది.

(ఆంధ్రవారపత్రిక బొంబాయి విలేఖరి)

★

గతవారం 'ఆంధ్రవారపత్రిక' 31-వ పుటలో ఛాయాచిత్రం నాట్యతార 'చంద్రకాంత' అని గమనించప్రార్థన.

సినిమా వార్తలు

యోగానంద్ దర్శకత్వాన తయారైన తమిళ చిత్రం "మఘుడై వీరన్" విజయాన్ని పురస్కరించుకుని, ఆ చిత్ర నిర్మాతలు కృష్ణాపిక్చర్స్ హిందీ, తెలుగు భాషలలో కూడా ఆ చిత్రం నిర్మించ నిశ్చయించారు. ఈ రెండిటికీ కూడా యోగానంద్ దర్శకత్వం నిర్వహిస్తారు. హిందీ చిత్రానికి బొంబాయి నటీనటులను తీసుకవస్తారట.

* * *

శరత్ రచన "బిందుగారబ్బాయి" ఆధారంగా అనసూయా ఫిలింస్ వారు నిర్మిస్తున్న చిత్రం "ముద్దుబిడ్డ" ఈ నెలలో నే విడుదల



ప్రభా ప్రొడక్షన్స్ వారి "ఆడపెత్తనం" లో అమ్మాజీ.

★ సినిమా వార్తలు ★

కాబోతోంది. జమున, లక్ష్మీరాజ్యం, నాగయ్య, జగ్గయ్య, మాస్టర్ వెంకటేశ్వర్ ఇందులో పాల్గొన్నారు. దర్శకుడు తిలక్.

* * *

ఈ నెలలోనే విడుదలకానున్న మరో చిత్రం శంకర్ ప్రొడక్షన్స్‌వారి 'సదారమ' జానకి, రేలంగి, ముక్కామల, కౌశిక్, కళ్యాణకుమార్ మొదలగువారు ఇందులో నటించారు. ఈ చిత్రంలో కొన్ని సన్ని వేశాలు గేవాకలర్ లో చిత్రించారట.

* * *

మహీవారి "శ్రీ గౌరీ మహాత్మ్యం" కూడా ఈ నెలలోనే విడుదల అవుతోంది. శ్రీరంజని, సూర్యకళ, రామారావు, రేలంగి ప్రభృతులు పాల్గొన్న ఈ చిత్రం దర్శకుడు యోగానంద్.

* * *

శోభాపిక్చర్స్‌వారి "బాలసన్యాసమ్మ" చిత్రం, ఆగస్టు 23న విడుదల అవుతోంది. కృష్ణకుమారి, జి. వరలక్ష్మి, సూర్యకాంతం, జగ్గయ్య, రేలంగి, చలం, రమ్మడి ఇందులో ప్రధాన భూమికలు నిర్వహించారు. శ్రీ పి. సుబ్బారావు దీనికి దర్శకుడు. సంగీతం రాజేశ్వరరావు.

* * *

లక్ష్మీ ప్రొడక్షన్స్‌వారి "ఇలవేలుపు" అర్ధశతదినోత్సవాలు చేసుకోబోతున్నది. ప్రసాద్ పర్యవేక్షణక్రింద, యోగానంద్ దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో అంజలి, నాగేశ్వరరావు, రేలంగి, కృష్ణకుమారి, రమ్మడి ప్రభృతులు పాల్గొన్నారు

* * *

ఇప్పుడు ప్రముఖనగరాలలో అర్ధశతదినోత్సవాలు చేసుకుంటున్న చిత్రం రాజ్యం పిక్చర్స్‌వారి "హరిశ్చంద్ర". లక్ష్మీరాజ్యం, రంగారావు, రేలంగి, రమ్మడి ఇందులో పాల్గొన్నారు. దర్శకుడు జంపన.

* * *

"వేజెస్ ఆఫ్ ఫియర్" అనే ఫ్రెంచి చిత్రం "నెత్తురు కూడు" అన్న పేరుతో ఈ మధ్య విజయవాడలో విడుదల అయింది. సినిమాస్కోప్, టెక్నికలర్ వంటి హంగులు విశేషాకర్షణలూ లేకపోయినా, ఈ మంచి ఫ్రెంచి చిత్రం అక్కడ విశేష జనాదరణ పొందింది. డబ్బు అవసరం కొద్దీ, ప్రాణాలకు తెగించి, అత్యంత ప్రమాదకర మైనపని ఒప్పుకున్న నలుగురు వ్యక్తుల కథ ఇది. ఒక అమెరికన్ నూనె కంపెనీ పనుపున, అత్యంత ప్రమాదకర మైన ప్రేలుడు సామగ్రిని లారీలలో వేసుకొని వీళ్లు మూడువందల మైళ్ల దూరం గతుకుల దారిన ప్రయాణం చేయవలసి వస్తుంది. బయలుదేరిన నలుగురిలో ఒకడే అసంగి చేరుతాడు. అయితే, తిరుగు ప్రయాణం అయినవాడు ఇలు చేరేలోగా ప్రమాదంపాలై మరణిస్తాడు. ఈ చిత్రం కొన్ని, లారీడ్రైవర్లు చాలామందిని ఆకర్షించింది. ★

అమెరికన్ బడులలో చలనచిత్రాల స్థానం

విద్యాబోధనలో చలన చిత్రాలను విరివిగా వినియోగించే దేశాలలో అమెరికా ఒకటి. చలన చిత్రాల ప్రదర్శనలేని కొన్ని చోట్ల, 'స్లైడ్'లను ఉపయోగిస్తున్నారు. స్లైడ్‌లను




అనుపమావారి "ముద్దుబిడ్డ"లో పీర్ల పండుగ సంబరాలు.

మన దేశంలో వ్యాపార ప్రకటనలకు మాత్రమే వినియోగిస్తున్నారు. సౌండ్ ప్రొజెక్టరు కొనుక్కునే తాహతులేని పాఠశాలలో ఈ స్లైడ్‌లూ, స్లైడ్ ప్రొజెక్టర్లూ ఉపయోగించడం వాంఛనీయమని అక్కడ సేకరించిన వివరాలవల్ల తేలింది. మొత్తం మీద విద్యాబోధనలో ఈ సాధనాన్ని వినియోగించే పాఠశాలల సంఖ్య 1946 నాటి కన్న 1954 నాటికి రెట్టింపు పెరిగిందట. వీటిలో తరచుగా చలన చిత్రాలను ఉపయోగించే ప్రాథమిక పాఠశాలల సంఖ్య నూటికి 15 నుండి 35 వరకు, సెకండరీపాఠశాలల సంఖ్య నూటికి 25 నుండి 40 వరకూ పెరిగింది.

* * *

ఉమర్‌ఖయాం

పారమౌంట్ పిక్చర్స్‌వారు నిర్మిస్తున్న "ఉమర్ ఖయం" చిత్రంలో బ్రిటిష్ నటుడు క్రెవర్ హోవర్డ్‌ను, అమెరికన్ నటుడు రేమండ్‌మాసీని తీసుకున్నారు. రేమండ్ మాసీ ఇందులో పర్షియన్ ప్రభువు భూమికను నిర్వహిస్తాడు. ఉమర్ భూమికను కార్నల్ వైల్డ్‌కు, ఉమర్ ప్రియురాలి భూమికను డెబ్రాపాజెట్‌కు ఇవ్వడం విదితమే.



"సినిమాస్కోప్ కెమేరాలు కొనక్కరలేదు—మమ్మల్ని తీసుకుంటే"

అలెగ్జాండర్ కథ

యునైటెడ్ ఆర్టిస్ట్స్‌వారి "అలెగ్జాండర్ ది గ్రేట్" చిత్రం అమెరికాలో విడుదల అయింది. అలెగ్జాండర్‌గా రిచర్డ్ బర్టన్, అతని తండ్రి, మాసిడోనియా ప్రభువు ఫిలిప్‌గా ఫ్రెడరిక్ మార్చ్, అలెగ్జాండరు పతిగా క్లెయిర్ బ్లూం, నటించారు. ★



సమతావారి "అమరజీవి" లో నంబియార్, సావిత్రి.

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్‌వాలెస్

అరుణవలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

32. జాక్‌తో కలిసి ప్రయాణం

పోలీసు కార్యాలయం విషమస్థితిలో పడింది. హార్వే ఫ్రాయంట్ దారుణ హత్యా వార్త అన్ని పత్రికలలోనూ సంపూర్ణ వివరాలతో సహా ప్రచురింపబడింది. అరుణవలయం నేరాలను గూర్చి పార్లమెంటులో రానున్న ప్రశ్నలు, పోలీసు కార్యాలయంలో జరుగుతున్న రహస్య చర్చలు, అన్నిటికంటే, సాధారణంగా తనతో సన్నిహితంగా వ్యవహరించే అధికారులందరూ తనకు దూరదూరంగా మెలగడం, ఇవన్నీ ఇన్‌స్పెక్టర్ పార్‌కు ఆందోళన కలిగించక పోలేదు.

అరుణవలయంచేసిన నేరాల పూర్తి జాబితాను వివరంగా ప్రకటించని పత్రికలేదు. మొదటినుండీ అరుణవలయం రహస్యాలను ఛేదించవలసిన బాధ్యత పార్‌కు అప్పగించబడినదనే విషయాన్ని కూడా ఏ పత్రికా విస్మరించలేదు.

ఫ్రాన్సులో కొంత భోగట్టా సేకరించవలసి ఉందనే కారణంపై పార్ సెలవు అడిగి తీసుకున్నాడు. అతడు కోశంలో లేని సమయం చూసి అతనిపై అధికారులు మరొక ఇన్‌స్పెక్టరును నియమించడానికి ఏర్పాటు కూడా చేసుకున్నారు. పార్‌కు పోలీసు కార్యాలయంలో ఒకే ఒక స్నేహితుడున్నాడు. అతడు కమీషనర్ కర్నల్ మోర్టన్.

కర్నల్ మోర్టన్ పార్ తరఫున వాదించాడు. కాని లాభం లేదని అతనికీ తెలుసు. డెరిక్ యేల్ కూడా అతనికి తోడ్పడ్డాడు. యేల్ పోలీసు కార్యాలయానికి వెళ్లి ఫ్రాయంట్ హత్య విషయంలో పార్ చేసిన తప్పేమీ లేదని చెప్పాడు.

"నేను కూడా హత్య సమయంలో అక్కడ ఉన్నాను నన్ను తన ప్రాణరక్షణకు ఫ్రాయంట్ నియోగించాడు. అయినా నేనుకూడా ఏమీ చేయలేక పోయాను. అందుచేత పార్ మీద అనవసరంగా నింద వేయడం భావ్యంకాదు" అని యేల్ వాదించాడు.

కమీషనర్ కుర్చీలో వెనక్కి చేరగిలబడి చేతులు కట్టుకుని కూర్చున్నాడు. "మిస్టర్ యేల్! నిన్ను కించపరచడానికి కాదుగాని, అధికారరీత్యా నీ ఉనికిని మేము పరిగణించడానికి వీల్లేదు నువ్వు ఏం చెప్పినా, ఎంత చెప్పినా పార్ బాధ్యత తొలగిపోదు. అతనికి అనేకసార్లు అవకాశ మిచ్చాము అన్ని అవకాశాలనూ అతడు వృథా చేసుకున్నాడు"

యేల్ వెళ్ళిపోవడానికి లేచాడు. ఆగమని కమీషనరు సంజ్ఞ చేశాడు.

"మిస్టర్ యేల్! నాకు ఒక విషయమై చిన్న సందేహం వచ్చింది. జేమ్స్ బియర్డ్‌మోర్‌ను చంపిన నాచికుడు సిల్లీ ఉన్నాడే, అతనికి సంబంధించిన సందేహం ఒకటి నాకు తీరలేదు నువ్వేమైనా చెప్పగలవా?"

యేల్ తలవూపి, మళ్లీ కుర్చీలో కూర్చున్నాడు.

"ఆ సిబీ వాఙ్మూలాన్ని మీరు తీసుకుంటున్నప్పుడు జైలుగదిలో ఎవరెవరున్నారు?" అని కర్నల్ మోర్టన్ అడిగాడు.

"నేను, పార్, మరొక పార్డు హాండ్ రైటరూ ఉన్నాము"

"మగవాడా, ఆడదా?"

"మగవాడే మీ సిబ్బందిలోవాడే అనుకుంటాను. అంతే, ఇంకెవ్వరూ లేరు. జైలరు మేమక్కడ ఉండగానే ఒకటి రెండుసార్లువచ్చాడు. నీళ్లు తీసుకునివచ్చింది జైలరే అనీళ్లలోనే ఆతరవాత విషం కలపబడింది" అన్నాడు యేల్.

కమీషనరు ఒక ఫైలు తీసి అందులోంచి ఒక కాగితం తీశాడు.

"ఇది జైలరు ఇచ్చిన వాఙ్మూలం. ఇందులో అనవసరమైనవన్నీ వదిలేసి ముఖ్యమైన విషయాలు మాత్రం చదువుతాను" అని కమీషనరు కళ్లజోడు పెట్టుకుని నెమ్మదిగా చదవసాగాడు:

"జైలుగది తలుపు నేను వెళ్లేటప్పటికి తెరిచేఉన్నది. ఖైదీ తను పడుకునే బల్లమీద కూర్చున్నాడు మిస్టర్ పార్ ఖైదీకి అభిముఖంగా కూర్చున్నాడు. మిస్టర్ యేల్ తలుపువైపు వీపుతిప్పి కూర్చున్నాడు. మంచినీళ్ల కోసమని ఏర్పాటుచేయబడిన కొళాయి నుండి ఒకడబ్బాలో సగందాకా నీళ్లుపట్టి గదిలోకి తీసుకువెళ్లాను. ఇంతలో ఇంకోగది నుండి బెల్ వినిపించడంతో నీళ్లడబ్బా అక్కడపెట్టి వెళ్లాను. దొడ్డివైపు తలుపుతీసే ఉన్నప్పటికీ ఆడబ్బాలో అప్పుడు ఏమి కలపడానికీ అవకాశంలేదని నానమ్మకం. మళ్లీ గదిలోకి తిరిగివచ్చేటప్పటికి మిస్టర్ పార్ నాచేతిలోంచి డబ్బా అందుకుని ఒకప్రక్కన పెట్టి, తమపనికి అడ్డం రావద్దని నాతో అన్నాడు."

"మాశావా, అక్కడ పార్డు హాండ్ రైటరొకడు ఉన్న సంగతే ఇందులో ప్రస్తావనకురాలేదు. అమనిషిని ఇక్కడినించి తీసుకువెళ్లారా, అక్కడే కుదుర్చుకున్నారా?" అని కమీషనరు అడిగాడు.

"మీ కార్యాలయం సిబ్బందిలో వాడే అయి ఉంటాడని నా నమ్మకం," అని యేల్ జవాబిచ్చాడు.

"పార్ నడిగి తెలుసుకోవాలి" అన్నాడు కమీషనర్. పార్‌కు టెలిఫోను చేశాడు. పార్ అప్పుడే ఫ్రాన్సునుండి తిరిగివచ్చాడు. అతన్ని అడగగా పార్డుహాండ్ రైటర్‌ను పోలీసు కార్యాలయంనుంచి తీసుకు వెళ్లలేదనీ, అక్కడే కుదుర్చుకున్నామనీ చెప్పాడు. సిబీ ఖూనీ గొడవలో పార్టు హాండ్ మనిషిని గూర్చి ఆలోచించే శ్రద్ధ తాను తీసుకోలేదని కూడా చెప్పాడు. అతడు సిబీ వాఙ్మూలాన్ని టైపుచేసి

ఇచ్చినందుకు గాను ఫీజాకూడా ఇచ్చినట్లు తనకు గుర్తుందని పార్ అన్నాడు. అతడంత కంటే ఇంకేమీ చెప్పలేకపోయాడు.

టెలిఫోనులో ఈ సంభాషణ అంతా డెరిక్ రేల్ వింటూనే ఉన్నాడు. సంభాషణ ముగియగానే కమీషనర్ ముఖం చూసి పార్ చెప్పినదేమీలేదని అసంతృప్తి పడుతున్నాడని రేల్ గ్రహించాడు.

"మిస్టర్ రేల్! పార్టుహాండ్ రైటర్ ఎవడో నీకైనా గుర్తున్నదా?"

"ఊహూ. లేదు. అతడు పార్ పక్కనే కూర్చున్నాడు. అతని ముఖం అటు తిరిగి ఉండడంచేత నేను సరిగ్గా చూడనేలేదు." అన్నాడు రేల్.

కమీషనరు ఏదో అస్పష్టంగా గొణుక్కొని ఇలా అన్నాడు:

"ఆ పార్టుహాండ్ రైటరు అరుణాచలయం నుంచి వచ్చిన వాడైనా కావచ్చు. అంత ముఖ్యమైన పనికి, ముక్కూ మొహం ఎరగని వాణ్ని ఎవణ్నో తీసుకోవడం ఘోరమైన తప్పిదం. పార్ చాలా పొరపాటు చేశాడు. పార్ అంటే నాకుఅభిమానంలేదని కాదు. కొంచెం పూర్వ కాలపు వాడనుకో. అలాంటి పూర్వకాలపు పోలీసు అధికార్లను చూస్తే మీ లాంటి ప్రైవేటు డిటెక్టివులకు వేళాకోళంగానే ఉంటుంది. కాని అతని పడుచుదనంలో అతడు మంచి సామర్థ్యంతోనే పనిచేశాడు. ఏమైనా అతడు ఉద్యోగంనుంచి తప్పుకోవాల్సిందే. పార్‌తో ఇదివరకే చెప్పాను. గనక నీకిప్పుడు చెప్పినా ఫరవా లేదు. అతని రాజీనామా విషయం ఇదివరకే నిర్ణయమైపోయింది. నాకూ విచారంగానే ఉంది, కాని ఏం చేస్తాం."

పార్ చేత రాజీనామా ఇప్పిస్తున్నారనేది రేల్‌కు తెలియని వార్త కాదు. పోలీసు కార్యాలయంలో ప్రతి బాలుడికీ తెలిసిన విషయమే.

కాని ఈ విషయమే ఏమీ పట్టించుకోకుండా ఇన్‌స్పెక్టర్ పార్ తన పని తాను చేసుకు పోతున్నాడు. తనకి ఉద్యోగం పోతోందనే సంగతే తెలియనట్లు తిరుగుతున్నాడు. తన తర్వాత తన ఉద్యోగంలోకి రానున్న వ్యక్తిని ఆఫీసులో కలుసుకున్నప్పుడు కూడా ఎలాటి అరమరిక లేకుండా పలకరించి మర్యాదగా వ్యవహరించాడు.

ఒకనాటి సాయంత్రము పార్ జాక్ బియర్డు మోర్‌ను తలవని తలంపుగా కలుసుకున్నాడు. పార్ అంత హుషారుగా ఉండడము చూసి జాక్ ఆశ్చర్యపడ్డాడు.

"మిస్టర్ పార్! ఎంతవరకూ వచ్చింది అపరాధ పరిశోధన?" అని జాక్ అడిగాడు.

"నా ఉద్యోగాంతం వరకూ వచ్చింది," అన్నాడు పార్.

★ అరుణాచలయం ★

ఇన్‌స్పెక్టర్ పార్ రిటైరవుతున్నాడనే విషయమై జాక్ మొదటిసారిగా విన్నాడు.

"నిజంగా మీరు రాజీనామా ఇచ్చేస్తున్నారా?" జాక్ నమ్మలేక అడిగాడు. "అరుణాచలయం కేసుకు సంబంధించిన రహస్యాలనేకం మీ చేతుల్లో ఉన్నాయి. దోషిని పట్టుకునే ఆశలు పూర్తిగా వదిలేసుకుంటే తప్ప, మిమ్మల్ని ఇటువంటి క్లిష్ట తరుణంలో అధికారులు విడిచిపెడతారనుకోను."

అధికారులు ఏమని భావిస్తున్నదీ తెలపడానికి పార్ సుముఖత చూపించలేదు.

ఆవాళ జాక్ నగరానికి దూరాన గ్రామములో ఉన్న తన గృహానికి ప్రయాణమవుతున్నాడు. అక్కడ తన తండ్రి హత్య జరిగిన తర్వాత ఇంతవరకూ మళ్ళీ అటు వెళ్ళలేదు. కాని ఎస్టేటుకు సంబంధించిన అత్యవసర వ్యవహారాలేవో చక్కబెట్టుకోవడానికి వెళ్లితీరక తప్పదని వెడుతున్నాడు.

"ఒక్కడివేనా?" అని పార్ ఏదో ఆలోచిస్తూ అడిగాడు.

"అవును," అని పార్ భావం గ్రహించి జాక్ ఇలా అన్నాడు: "మిస్టర్ పార్! మీరు కూడా రాగూడదూ నాతో? వస్తే చాలా బావుంటుంది. ఈ అరుణాచలయం దర్యాప్తు పనేమీ లేకపోతే నాతో రండి."

"దానికేమిలే, నేను లేకపోయినంతలో అది ఏమీ ఆగిపోదు. నీతో నేనూ వస్తాను. మీ తండ్రిగారు పోయిన తరవాత నేను ఆ వైపు మళ్ళీ వెళ్లలేదు. ఒకసారి ఆ ప్రాంతం మళ్లీ చూడడం మంచిదనుకుంటాను," అన్నాడు పార్.

మరొక రెండు రోజులు సెలవు కావాలని పార్ కోరాడు. అతను అడిగితే జీవితాంతంవరకూ సెలవు పొడిగించడానికి సిద్ధంగా ఉన్న అధికారులు రెండు రోజుల సెలవుకు వెంటనే అంగీకరించారు.

పార్ ముందు ఇంటికివెళ్ళి కావలసిన బట్టలూ అవీ ఒక చిన్న సంచీలో పెట్టుకుని జాక్‌ను స్టేషనులో కలుసుకున్నాడు.

కారులో దూర ప్రయాణానికి రోడ్లు

గాని, గాలిగాని అనుకూలంగా లేకపోవడం చేత రైలులోనే ప్రయాణం చేయదలచారు. రైలుప్రయాణమే సుఖమని పార్ కూడా అన్నాడు.

వెళ్ళేముందు పార్ ఒక చిన్న చీటీ వ్రాసి డెరిక్ యేల్‌కు పంపించాడు. చీటీలో తనెక్కడికి వెడుతున్నదీ వ్రాసి "అత్యవసర పరిస్థితులేవైనా తటస్థించి నగరానికి నేను రావడం జరూరని నువ్వు భావించిన పక్షంలో నాకు వెంటనే కబురు చెయ్యి. నేను వచ్చేస్తాను." అని కూడా చేర్చాడు.

33. మరో బెదిరింపు

జాక్‌కు ఇన్‌స్పెక్టర్ పార్ కలిసి ప్రయాణం చెయ్యడగినంత ఉత్సాహవంతుడుగా తోచలేదు. పార్ తనతో బోలెడు వార్తాపత్రికలు తెచ్చుకున్నాడు. వాటిలో అరుణ వలయాన్ని గూర్చి పడిన వ్యాఖ్యలన్నీ అతి శ్రద్ధగా చదవడం మొదలుపెట్టాడు. ప్రతి పత్రికలోనూ పార్‌ను గూర్చిన విమర్శలు ఘాటు ఘాటైనవి ప్రచురింపబడ్డాయి. అవన్నీ అతడు తీరికగా చదవడం చూసి జాక్ ఆశ్చర్యపడ్డాడు. ఎందుకవన్నీ చదువుతున్నారని జాక్ అడిగాడు.

పార్ ఒక పత్రికను తన మోకాళ్ళపై పరుచుకుని, కళ్ళజోడు తీసి జాక్ కేసి చూస్తూ "ఊరికేనే చదువుతున్నాను. విమర్శ చదవడంలో తప్పేముంది? తను చేసింది తప్పని అనుకున్నప్పుడే ఎవడికైనా ఇటువంటి విమర్శ చూస్తే కోపం కలుగుతుంది. నేను చేస్తోంది తప్పుకాదని నాకు తెలుసు కనక ఈ పత్రికలు ఏం వ్రాసినా నాకు బాధలేదు," అన్నాడు.

"మీరు చేస్తోంది తప్పుకాదని మీకు తెలుసన్నమాట. ఏ విషయంలో?" అని జాక్ అడిగాడు. కాని పార్ సమాధానమివ్వలేదు.

బియర్డ్ మోర్ ఎస్టేటు సమీపంలోని చిన్న స్టేషనువద్ద రైలు దిగారు. అక్కడి నుంచి బియర్డ్ మోర్ గృహం నాలుగుమైళ్ళ దూరం ఉంది. ఆ నాలుగు మైళ్లూ కారులో వెళ్లారు.

ఇంటికి చేరగానే అంతకుముందే అక్కడికి వచ్చిన జాక్ బట్లరు ఇన్‌స్పెక్టర్ పార్‌కు ఒక టెలిగ్రాము అందించాడు.

ఆ కవరు తీసుకుని పార్ అటూ ఇటూ తిప్పి చూశాడు. "ఎంతసేపైంది ఇది వచ్చి?" అని అడిగాడు.

"ఇప్పుడే ఒక అయిదు నిమిషాల కిందట ఎవరో సైకిలు మీద వచ్చి ఇచ్చి వెళ్లాడు", అని బట్లరు చెప్పాడు.

కవరు చించి టెలిగ్రాము తీసి చదివాడు. డెరిక్ యేల్ నుండి అది వచ్చింది. అందులో "తక్షణం లండను రావాలి. కొత్త సంఘటన ఒకటి జరిగింది" అని ఉంది.

ఆ కాగితం జాక్‌కిచ్చాడు.

"అయితే మీరు వెడతారన్నమాట. కాని మళ్ళీ తొమ్మిదింటిదాకా రైలు లేదే", అన్నాడు జాక్. తన అతిథి అంత తొందరగా వెళ్ళిపోతున్నందుకు జాక్‌కు విచారం కలిగింది.

"నేను వెళ్ళను. ఇంతదూరం ప్రయాణం చేసి మళ్ళీ ఇప్పుడు రైలులో పడిపోవాలంటే నాకు చిరాకు", అని తాపీగా జవాబిచ్చాడు పార్.

పార్ స్వభావాన్ని గూర్చి తానూహించుకున్న దానికి ఇది విరుద్ధంగా కనబడింది. అయినా అతడు వెళ్ళడం లేదన్నందుకు సంతోషం కూడా కలిగింది.

పార్ మళ్ళీ టెలిగ్రాము తీసి చూశాడు.

"మనం లండనులో బయలుదేరిన అరగంటకే అతడు ఈ టెలిగ్రాము పంపించి ఉండాలి. అన్నట్లు నీకు టెలిఫోను ఉంది కదూ?"

పార్ లండనుకు ఫోన్ చేశాడు. పదిహేను నిమిషాలకిగాని లైను దొరకలేదు.

అతడు ఫోనులో ఏదో మాట్లాడడం జాక్ పక్క గదిలోంచి విన్నాడు. వెంటనే పార్ ఫోను మూసేసి వచ్చాడు.

"నేననుకున్నట్టే అయింది. అది మోసం. ఇప్పుడే నేను యేల్‌తో మాట్లాడాను. అతడు తన కేమీ తెలియదన్నాడు", అని చెప్పాడు పార్.

"మోసమని మీరుముందే ఊహించారా?"

"అవును. నాకూ యేల్ తెలివి తేటలు అబ్బుతున్నాయి".

ఆ రాత్రి చాలసేపు ఇద్దరూ పేకాట ఆడుతూ గడిపారు. అర్ధరాత్రిదాకా ఆడి లేచారు.

ఇన్‌స్పెక్టరుకు పడక ఏర్పాటు చేసినగది కేప్ట బియర్డ్ మోర్ బ్రతికి ఉండగా వాడుకున్న గదే. బాగా విశాలంగా ఉంది. నాలుగు పెద్ద పెద్ద కిటికీలున్నాయి.

"నువ్వెక్కడ పడుకుంటున్నావు?" అని పార్ జాక్‌ను అడిగాడు.

"ఈ పక్క గదిలోనే".

పార్ తలుపు వేసుకుని గడియకూడా బిగించుకున్నాడు.


జాక్ గదితలుపుకూడా మూసిన చప్పుడు విన్న తరువాత కోటు విప్పేసి తనతో తెచ్చుకున్న సిల్కు ఓవర్ కోటు తొడుక్కున్నాడు. లైటు ఆర్పేసి కిటికీ తలుపులు తెరిచాడు.

బయట అంత చీకటిగా లేదు. పక్కమీద పడుకుని పార్ తన దగ్గరలో ఉన్న కిటికీలోంచి చూస్తూ నిద్రించడానికి ప్రయత్నించాడు.

తెలవారుఝామున అతనికి మెలకువ వచ్చింది. ఇంకా చీకటిగానే ఉంది. ఉన్నట్లుండి ఉలికిపడినట్లు లేచాడు. కిటికీ వద్దకు వెళ్లాడు. ఎక్కడో ఒక కారు బుర్ మని ధ్వనిచేస్తున్నట్లు వినబడింది. వెంటనే ధ్వని ఆగిపోయింది. గదిలో వున్న వాష్ స్టాండువద్దకు వెళ్లి చల్లని జలంతో ముఖం తడుపుకొని నెమ్మదిగా తుడుచుకున్నాడు. మళ్ళీ కిటికీవద్దకువెళ్లి, ఒక కుర్చీలాక్కుని ఇంటి ముందర భాగంలో కనబడుతున్నంతమేరా చూస్తూ కూర్చున్నాడు.

అరగంటసేపు అలా కూర్చున్న తరువాత ఒక నల్లని ఆకృతి చెట్లనీడలవద్ద కనబడింది. ఆ నల్లని ఆకృతి వెంటనే ఇంటిని సమీపించి మళ్ళీ చీకట్లో అంతర్హితమైపోయింది.

ఇన్‌స్పెక్టర్ పార్ గదిలోంచి నిశ్శబ్దంగా బయటికి వచ్చాడు. మెట్లు దిగి క్రిందికి వెళ్లాడు. సింహద్వారం గడియవేసి తాళం కూడా వేసివుంది. అతి ప్రయత్నం మీద కొంతసేపటికతడు దాన్ని తెరిచాడు. బయటికి వచ్చి చూశాడు. ఎవరూ కనబడలేదు. ఇంటిప్రక్కనే ఉన్న దారివెంట కొంత దూరం వెళ్ళాడు. కాని యెవరూ యెదురుపడలేదు. తిరిగి సింహద్వారం వద్దకు వచ్చాడు. ఇంతలో దూరాన కారు కదిలిపోతున్న చప్పుడు వినబడి క్రమంగా నిశ్శబ్దంలో కలిసిపోయింది.



★ అరుణవలయం ★

సింహద్వారం గడియ, తాళం వేసేసి మళ్లీ తనగదిలోకి వెళ్లాడు. ఆ నల్లని ఆకృతి అతన్ని ఆశ్చర్యంలో ముంచివేసింది. వచ్చినవ్యక్తి ఎవరైనా పార్‌ను చూడలేదు. పార్ తనను చూస్తున్నాడన్న సంగతికూడా ఆ వ్యక్తికి తెలిసివుండదు. రావడం. వెళ్లడం రెండూ అతి శీఘ్రకాలంలో జరిగిపోయి ఉండాలి తెల్లవారినతరవాత ప్రాతఃకాల భోజనం వేళకుగాని అజ్ఞాతవ్యక్తి రాక కారణం బోధపడలేదు

జాక్ ఒక చిన్న నలిగిపోయిన కాగితం పట్టుకుని చదువుతూ హాలులో నుంచుని ఉన్నాడు. అది గోడమీద అతికించిన పోస్టర్ లాగా ఉంది. పార్ దాన్ని చదవకుండానే అది అరుణవలయంవారి సంకేతమని గ్రహించాడు

"ఇదిచూశారా?" అని జాక్ ఇన్‌స్పెక్టరుకు దాన్ని చూపిస్తూ అన్నాడు. "ఇలాంటివి ఒక అరడజను పోస్టర్లు మా ఇంటిముందు చెట్లకు అతికించి ఉన్నాయి ఈ కాగితం నా పడకగది కిటికీకి అంటించి ఉంది."

పార్ దాన్ని చదివాడు: "నీ తండ్రి ఇవ్వవలసిన పైకం ఇంకా చెల్లించలేదు. డెరెక్ యేల్‌ను, పార్‌ను వారు సాగిస్తున్న అపరాధ పరిశోధన విరమించుకునేట్లు నువ్వు ఒప్పించగలిగితే ఆ సొమ్ము చెల్లించకపోయినా ఊరుకుంటాము."

దానికింద చిన్న అక్షరాలతో ఇలా ఉంది:

"ఇకమీద మేము పైరి వేటు వ్యక్తులెవర్నీ పైకం కోసం నిర్బంధించదలచలేదు." ఇది తరవాత చేర్చబడినట్లు కనిపించింది.

"ఒహో! అర్ధరాత్రి వచ్చి అతగాడు చేసిన పని ఇదన్నమాట" అని పార్ అన్నాడు.

"మీరు వాణ్ణి చూశారా?" అని జాక్ ఆశ్చర్యపడ్డాడు.

"నల్లని ఆకృతి మాత్రం చూడగలిగాను. అసలతడు వస్తాడని ముందే అనుకున్నాను. అయితే ఇంతకంటె పెద్ద ఘనకార్యమేదన్నా చేస్తాడనుకున్నాను."

ప్రాతఃకాల భోజనం సమయంలో పార్ మౌనంగానే ఉన్నాడు. జాక్ ఏమన్నా అడిగినా ముభావంగా సమాధానాలివ్వడం తప్పిస్తే మరేమీ మాటాడలేదు. భోజనానంతరం బయటకు వచ్చారు.

"జాక్! నువ్వు థాలియా ప్రేమండ్‌ను ప్రేమిస్తున్నట్టు వాడికి తెలుసునా?" అని పార్ అడిగాడు.

జాక్ ముఖం ఎర్రబడింది

"ఎందుకు అలా అడిగారు? ఒకవేళ థాలియామీద వాళ్లు పగతీర్చుకోవచ్చునా?"

"దానివల్ల కార్యం నెరవేరుతుందని తోస్తే థాలియాను హతమార్చడానికి వాడు వెనుదియ్యడు."

మరికొంత దూరం పచ్చిక బయలులో నడిచి పార్ ఆగాడు.

"చాలు" అన్నాడు.

"మీరు నైపను గేటుదాకా వెడతారనుకున్నానే, మార్ల్ ఆరోజున వచ్చిన మార్గం చూడరూ?" అని జాక్ అడిగాడు.

"అందాకా అక్కర్లేదు. మీ ఇంటికి అతడేదో కన వచ్చిందీ చూస్తే చాలు. ఆ రోజుని మార్ల్ హఠాత్తుగా భయపడి కంపించిన ప్రదేశం చూపగలవా?"

ఎందుకో తెలియక జాక్ తెల్లబోయి "ఆ. అది ఇంటికి బాగా దగ్గరలో ఉంది. నాకా చోటు బాగా జ్ఞాపకం ఉంది," అని జాక్ చూపించాడు. పార్ అక్కడనుంచుని పరీక్షించాడు.

"ఇది చాలా ముఖ్యమైన అంశం. మార్ల్ అబద్ధం చెబుతున్నాడని నాకు తెలుసు. ఇక్కడినుంచి మీ డాబా కనిపించదు. డాబామీద మీ తండ్రిగారు నుంచున్నాడని, ఆ సమయంలోనే తనకు గుండెనొప్పి వచ్చిందని మార్ల్ చెప్పాడు. బహుశా మీ తండ్రిగార్ని చూసి భయపడ్డాడేమోనని నేను మొదట భావించాను"

ఫెలిక్స్ మార్ల్‌తో అతని మరణానికి ముందు నడిచిన సంభాషణ క్రమమంతా పార్ తెలియజేశాడు.

"నాకింతా ఇదివరకే చెబితే నేను యథార్థం తెలియజేసేవాణ్ణిగా. అసలారోజు ఉదయం మా తండ్రిగారు లైబ్రరీ గదినుండి బయటికి రానేలేదు మేము మేడ మెట్లెక్కుతున్న సమయానికిమాత్రమే ఆయన బయటికి వచ్చారు," అని జాక్ చెప్పాడు.

పార్ చేతిలో ఒక నోటుబుక్కు పెట్టుకుని ఎదురుగా కనిపిస్తున్న దృశ్యమంతా స్కెచ్ గీసుకుంటున్నాడు ఎడమపక్కన ఉడ్‌ఫుడ్ భవనం ఉన్నది ఎదురుగా పూలతోట ఉన్నది తోటచుట్టూ ఇనపకంచె, మధ్యలో గేటు ఉన్నది ఆ గేటులోంచే మార్ల్ లోనికి వచ్చిఉండాలి కుడిపక్కన పూలపొదలున్నాయి పొదల మధ్యలో నీడకోసం అమర్చబడిన పెద్ద ఛత్రం ఉన్నది.

"మా తండ్రిగారికి ఈ పూలపొదలంటే చాలా ఇష్టం. వేసవిలోకూడా ఇక్కడ చల్లగా ఉంటుంది. ఈ పొదలమధ్య చల్లటి నీడలో మా తండ్రిగారు గంటలతరబడి చదువుకుంటూ కూర్చునేవారు," అని జాక్ చెప్పాడు.

పార్ ప్రతి వివరమూ జాగ్రత్తగా వ్రాసిపెట్టుకున్నాడు.

"చూడవలసినదంతా చూశాను" అన్నాడు చివరికి.

మళ్ళీ ఇంట్లోకి వచ్చేస్తూండగా ఇన్‌స్పెక్టర్ పార్ తిరిగి అరుణవలయం పోస్టర్ల సంగతి ప్రస్తావించి ఇలా అన్నాడు:

“అరుణవలయం చేసిన పొరబాటు ఇదొక్కటే. మొదట్లో వాళ్ళిలా చేద్దామనుకుని ఉండరు. తరువాత వచ్చిన ఆలోచనై ఉంటుంది.”

పార్ మెట్లమీద కూర్చుని ఎదురుగా కనిపించే మైదానాన్ని శూన్యంగా చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. పొట్టిగా, లావుగా ఏ తెలివితేటలూ ఉన్నట్లు కనిపించని పార్‌ను చూసి ఇతనికి నేరపరిశోధన ఉద్యోగం ఎలా ఇచ్చారా అని జాక్ అనుకున్నాడు.

“అదీ సంగతి” అన్నాడు పార్.

“అసలు ఈ అరుణవలయం మనిషి, నీ దగ్గర్నుంచి మీ తండ్రిగారివ్వవలసిన పైకం గుంజుకోవాలనిమాత్రమే మొదట్లో సంకల్పించాడు. దోవలో అతనికి ఈ కొత్త ఆలోచన వచ్చింది. డెరిక్ రోయ్‌ల్‌ను, నన్నూ ఈ నేరపరిశోధననుండి విరమింపజెయ్యాలని వ్రాయడంలో అతని ఉద్దేశం తను చెప్పేమాటలు నిజమని నమ్మింపజెయ్యాలనే. నిజానికి అతని కేమో ఈ పనినుండి తప్పుకోవాలనే ఉంది. అలా ఎన్నటికీ జరగదనుకో. ఏదీ ఒక్కసారి ఆ పోస్టరిలా ఇవ్వు.”

జాక్ తీసుకొచ్చి ఇచ్చాడు. “అవును. ఇది చాలా తొందర తొందరగా రాసినట్లు కనబడుతోంది. బహుశా కారులోనే రాసి ఉంటాడు. ఏదో పెద్ద ఎత్తే ఎత్తాడు. ఏమై ఉంటుంది,” అని పార్ ఆలోచించసాగాడు.

ఆ ఎత్తు ఏమిటో తెలిసికోవడానికి పార్‌కు ఆట్టే కాలం పట్టలేదు. బట్లరు హడావిడిగా వచ్చి టెలిఫోను అయిదు నిమిషాలనుంచీ మోగుతోందని చెప్పాడు.

“మీకోసమే” అని జాక్ టెలిఫోను అందించాడు.

పార్ రిసీవరు తీసుకున్నాడు. కర్నల్ మార్టిన్ కంఠం వినిపించింది.

“వెంటనే లండన్ వచ్చెయ్యి పార్! ఇవ్వాళ మధ్యాహ్నం మంత్రివర్గం సమావేశం కాబోతుంది.”

పార్ రిసీవరు పెట్టేసి తను ఊహించిందేదో నిజమైనదన్నట్లు నవ్వాడు.

“ఏమిటది?” అడిగాడు జాక్.

“నేను మంత్రివర్గంలో చేరబోతున్నాను” అని పార్ విరగబడి నవ్వసాగాడు. పార్ అంత హాయిగా నవ్వుకోగలడని జాక్ ఎప్పుడూ ఊహించలేదు. (ఇంకా ఉంది)

★ తంజావూరు వీణ ★

(27 వ-పేజీ తరువాయి)

చూపించకుండానే!" తల కొట్టేసినట్లనిపించింది!"

"అదే చూపించబుతున్నాడు! విద్వయ్య భాగవతార్... ఆ రసికుడు ఒకసారి వీణ తీసి మధుర స్వప్నాల్లో ముత్తెక్కింపజేసే రాగ తరంగాలలో అనురాగ వీచికాలు మిళితం చేస్తూ హృదయ వాంఛల్ని లాగేస్తున్నాడు వీణ మీటుతో పాటు! మనిషిలో పత్తావుంది...... కాని సంస్కారం లేదు. ఛీ!...గొప్ప కళాకారుడట!.... కళాకారులకే వికారా లుంటాయేమో! ఛ! ఏమిటలా వీక్షణాలు విసిరేస్తున్నాడు! ఈ కళాకారులంతా యింతే నేమో! రాగంలో రసికత్వమంతా రంగరించేస్తూ.... వెధవ...వికారాలూ వీడూను....ఉత్త.... చూపుల సుందరుడు—ఇక్కడినుంచీ వెళ్ళిపోతే బాగుణ్ను! ఎక్కడికి వెళ్ళినా పాడు గోల.... ఈ వెధవలందరూ కొంతదాసులే! సిగ్గులేని వెధవలు....వీళ్ళకి మాత్రం...అక్క చెల్లెళ్లు లేరూ? పెళ్లాలు లేరూ? భార్యలు.... మాత్రం బయటికి రాకూడదూ? వెధవ అధికారాలూ వీళ్ళూను! తను గబగబా చీడీలు దిగేసింది దుర్గ. తలవంచేసుకుని వెనక్కి తిరిగి చూడకుండా సందుమళ్ళేసింది! అమ్మయ్యో!...కొత్త ఊపిరి పలికింది!...

"నాకు వీణవొద్దు. ఇంటి కెళ్ళిపోదాం నాన్నా!....

"ఇంకొక్క కొట్టుందిగా! అదికూడా చూసి మరి వెడదాం! యింటికి?" నాన్నారు మళ్ళీ ఆ చివరి కొట్టులోకి దూరారు.

ఆ దుకాణంలో "బొబ్బిలి వీణలున్నాయి! చాలా మేలిరకం వే ఉన్నాయి! బొబ్బిలివాళ్ళంతా ఇవే కొనుక్కుంటారు." దుకాణదారుడు దువ్వడానికి ప్రారంభించాడు.

"ఖరీదెంత?" నాన్న ప్రశ్న వేశాడు.

నాన్నకి కావలసింది...ఖరీదు! నాక్కావలసింది...వీణ!"

"చాలా సరసంగానే ఉంటుంది లెండి! మీకు కిట్టుబాటులోనే ఉంటుంది...ఒక్క నూటయాభై!..." వెధవ సరసమూ వీడూను ...నాన్న తలదించేశాడు.

అనుకున్నదానికన్నా! ఒక్క యాభైయ్యే యెక్కువ! ఆ యాభైనీ... ఒక్క యాభైనీ...ఎన్నిసార్లు లెక్క పెట్టాలి? దుర్గకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి!

నాన్న నూటయాభై రక్తపు చుక్కల్ని లెక్క పెడితే నేగానీ తన మధుర స్వప్నాల్లోని...తన తియ్యని కోరికలు నెరవేరవు. ఒక్కటే...ఒక్క కోరిక...తియ్యనికోరిక!

దుర్గకి దుఃఖం వచ్చేస్తోంది. రోడ్డుమీద ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? ఛ! అబ్బ!! ఈ వేళ యెంత గడ్డుదినం? తల బద్దలైపోతూ...ఉంది. ఆ కొట్టువాడు అలా ఎందుకనాలి? నూటయాభైకి తక్కువ వీణలేమిటండీ? కూరగాయల్లా బేరమాడుతున్నారు!" అన్నాడు ఎంత అవమానం...

"ఆవేళ తన పెళ్ళి చూపుల కొచ్చినాయన కూడా—కనీసం మూడు వేలేనా లేందే ఏ చదువుకున్న పెళ్ళికొడుకలా గొస్తాడండీ!" అనేశాడు. తను ఈ పాళంగా యెక్కడే—చచ్చిపోతే!......దావానలం హృదయాన్ని దహించేస్తూంది. మళ్లీ యింటికి ఏ మొహం పెట్టుకుని వెళుతుందీ? అన్నయ్య వాచీ కొనుక్కున్నాడు! తమ్ముడు సైకిలు కొనుక్కున్నాడు! అమ్మ గొలుసు చేయించుకుంది! తనో?......

ఉట్టి చేతులతో...ఉబుకుతున్న ఉప్పెనతో...మండిపోతూన్న...మనస్సుతో... తీరని కోరికతో...బాయని బాధతో... ఈడుపు కాళ్లతో...ఏడుపు ముఖంతో... భగ్న హృదయంతో...బయలుదేరింది!...

బజారునిండా...మంచి వీణలున్నాయి! జేబులనిండా మూలుగుతూన్న ధనముంది! తన హృదయంనిండా తీరని తియ్యని కోరిక లున్నాయి!

గుమ్మంలో అడుగు పెట్టింది!...

"వీధి గుమ్మంలో నే సైకిలెక్కి ఒక అడుగు అరుగు మీదా...మరొక అడుగు సైకిలుమీదా ఉంచి, ఏమే, అక్కా! రిక్త హస్తాలతో దయచేస్తున్నారేం?" దర్జాగా అన్నాడు తల ఊపుతూ......

"ఏమే, శాలీ! రాత్రి తొమ్మిదిన్నర అయింది! వీణలు నచ్చలేదా? బేరం కుదరలేదా?" అంటూ ఆలస్యానికి సానుభూతి చూపిస్తూ వాచీకేసి చూశాడు అన్నయ్య

అరుదు: ఒకరికిచ్చేది మరువగలవారు, ఒకరిచ్చేది మరువలేని వారు.

విజయగర్వంతో!

దుర్గకి దుఃఖం పొర్లుకొచ్చింది!...

గుమ్మంలో అడుగు పెట్టేటప్పటికి వరద ప్రవాహం కట్టలు తెంచుకుంది!

ఒక్కమాటు పట్టెమంచం మీద పడిపోయింది! ఉక్రోషాన్ని వెళ్లగ్రక్కుకుంది.

ఒక్కటే...ఒక్క...కోరిక....తియ్యని కోరిక...తంజావూరు వీణ తల్చుకుంటే తన్మయమైపోతుంది! ఒక్కక్షణం దుర్గమైన ప్రాపంచిక వృత్తిమంతా మరిచిపోయి...మళ్లీ ఒక్కసారి నిర్వికారావస్థ అనుభవించింది!


అందరు అన్నాలు తింటున్నారు.

"అన్నానికి రావే?" అమ్మ పిల్చింది!

"తనకు అన్నమెందుకు?" కోరికలతోటే కడుపు నిండి పోయింది. అంతా ఆవకాయ అన్నం కలుపుకుని తింటున్నారు. అబ్బ! అంతా నాన్న నెత్తురుతో తడిసిన అన్నం! నాన్న రక్తపు చుక్కలతో రంగరిస్తేనే కానీ తీరని తన తీయని కోరికలు!

ఛ! తనకి వీణ అక్కరలేదు. తనకిప్పుడు కోరికలే లేవు! హృదయకుహరంలో పెట్టెలోనుంచి తన నెత్తురు చుక్కల్లోనే రంగరించి చేసుకుంటుంది తనకోరింల్ని!

అది తియ్యని కోరిక
ఇది తీరని కక్ష!
అంతులేని ఆవేదన
ఆశలేని హృదయాన
కరుడు కట్టిన గుండె. ★



వనితాలోకం

స్వతంత్ర భారతములో శిశుజనాభ్యుదయము

"ప్రతిఅంశమూ మానవుడిపైన ఆధారపడి ఉన్నదన్న సత్యాన్ని విస్మరించి, జాతీయాభ్యుదయాన్ని కర్మాగారాల ద్వారాను, యంత్రాల ద్వారాను సాధించవలెనని ప్రణాళికలను తయారుచేస్తున్నాము. అది చాలా ముఖ్యమైనదే-వాటికి ప్రాధాన్యత నివ్వవలసినదే. కాని తుదకు ఈ జగతిలో మానవుడే ప్రముఖ పాత్ర వహించవలసిన వాడు. మానవుని ప్రాముఖ్యత నంగీకరించినప్పుడు వయోజనుడికంటె శిశువుకే ప్రాధాన్యత" అంటారు భారత ప్రధాని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ.

ఈ సూత్రాన్ని జగత్తంతా అంగీకరించింది. భారత దేశము కూడా దీనిని అంగీకరించి ఆమోదించింది; జాతీయ జీవనములో బిడ్డల ప్రాధాన్యతను గుర్తించింది.

భారత దేశములో సమష్టి కుటుంబ విధానము సహకార సంఘాలవలె కుటుంబాభ్యుదయానికి కృషిచేస్తూ ఉండేది. సమష్టి కుటుంబాలలో వాత్సల్యము ప్రేమ, భద్రత బిడ్డలకు లభించేది. ఆర్థికపు ఒడిదుడుకులు సంభవించినప్పుడు, తల్లి దండ్రులు భరించ లేని స్థితిలో ఉన్నప్పుడు సమష్టి కుటుంబాలలో తాత ముత్తవ్వలు, తండ్రి సహోదరులు, మేనత్త మేనమామలు బిడ్డల పోషణ భారము వహించేవారు. సాధారణ పరిస్థితులలో మనదేశములో ప్రతి కుటుంబమూ బిడ్డల నాదరించేది. కొన్ని అసాధారణ పరిస్థితులలో దూరపు బంధువులు కూడా బిడ్డలను తమ సంరక్షణలో ఉంచుకొని పోషించేవారు. ఈ విధమైన కుటుంబ బాధ్యతలు గల సాంఘిక వ్యవస్థలో బిడ్డలకు మంచి రక్షణ భద్రతలు లభించేవి. కాని మన దేశములో కలిగిన ఆర్థిక రాజకీయ మార్పులవల్ల కుటుంబ జీవనములో కూడా అనేకమార్పులు కలుగుతూ వచ్చాయి. ఈ మార్పులతో కుటుంబ వ్యవస్థా విధానముకూడా మారవలసినదయినది. తత్ఫలితంగా కుటుంబాలలో బిడ్డలకు రక్షణ భద్రత తగ్గిపోయినవి. ఆధునిక జీవన విధానములో ఏవ్యక్తి తన బాధ్యతలను తానే వహించవలెనని పరిస్థితులకు లోనవుతున్నాము. ఈ స్థితిలో సామాన్యమైన బిడ్డలకే రక్షణ లభించటము కష్ట సాధ్యమైనప్పుడు అంగవైకల్యముగల బిడ్డల గతి భిక్షాటనమే కదా!

ఇల్లిందల సరస్వతీదేవి

ఈ అంశాలదృష్ట్యా అంతర్జాతీయ శిశు సంక్షేమ సంఘ మొకటి నెలకొల్పబడ్డది. దీని నియమావళిలో (1) జాతిమత వివక్షత లేకుండా బిడ్డలు సంరక్షింపబడాలి. (2) ప్రతి కుటుంబములోను బిడ్డలు తగిన గౌరవ ప్రతిపత్తితో సంరక్షింపబడాలి. (3) ప్రతి బిడ్డ భౌతికముగా, నైతికముగా, ఆధ్యాత్మికముగా అభివృద్ధిచెందటానికి తగిన అవకాశాలు కల్పింపబడాలి. (4) ఆకలితో ఉన్న ప్రతిబిడ్డకూ ఆహారమూ లభించాలి; రోగిగా ఉన్న బిడ్డకు వైద్యోపచారాలు లభించాలి; శారీరక మానసిక వైకల్యము గల బిడ్డలకు తగిన వసతులూ, సౌకర్యాలూ లభింప చేయాలి. (5) చెడు తిరుగుడుకు అలవాటు పడి దురభ్యాసములపాలయిన బిడ్డలకు విజ్ఞాన బోధచేయాలి. అనాథ శిశువులందరికీ ఆశ్రయము లభించాలి. ఆపత్కాలమందు బిడ్డలకు ముందుగా సహాయము లభించాలి. (6) సంఘసంక్షేమకార్యకలాపాలవల్లనూ, సాంఘిక భద్రతాసంఘాలవలను బిడ్డలకు లాభము చేకూరాలి. స్వతంత్ర జీవనాధార భూతమైన విద్యను [illegible] బిడ్డలకు గరపాలి. స్వార్థపరత్వమునుంచి

★ స్వతంత్రభారతములో శిశు జనాభ్యుదయము ★

బిడ్డలు రక్షింపబడాలి. (7) తన శక్తి సామర్థ్యాలను తోడిమానవసేవకై వినియోగించాలన్న జ్ఞానము బిడ్డలకు కలిగించుతూ శిక్షణనివ్వాలి' అను అంశాలు చేర్చబడి ప్రాముఖ్యతకు వచ్చాయి.

'జాతి మత వివక్షత లేకుండా బిడ్డలందరూ సంరక్షింపబడాలి. బిడ్డలందరూ ఒకటే-వారి సమస్యలన్నీ ఒకరకమే' అని జాతులన్నీ అంగీకరించి ఆ విధముగా కృషి చేయటానికి శపథము చేశాయి. దాని జ్ఞాపకార్థము 1955 లో ప్రపంచ శిశుదినము అతి వైభవముగా జరుపబడ్డది. భారతదేశముకూడా తన శక్తి సామర్థ్యాల ననుసరించి అంతర్జాతీయ శిశు సంఘముతో చెయ్యి కలిపింది.

మన దేశములో శిశుజనాభ్యుదయానికై అనేక సంస్థలూ సంఘాలు నెలకొల్పబడి కృషిచేస్తున్నాయి. వాటిలో భారత శిశు రక్షణసంఘము ఒకటి (Society for Protection of Children in India). ఈ సంఘము భారత దేశములోని బిడ్డలను సంరక్షించుట కేర్పడినది ఇది భారతదేశములోని అన్ని జాతులతోను, భారతదేశముపట్ల స్నేహభావముతో మెలగే దేశాలతోను సహకరిస్తుంది. కూలీ నాలీ చేసుకుంటూ, బిచ్చమెత్తుకుంటూ అధమముగా జీవించే బిడ్డలభారము వహిస్తుంది. దేశములో నెలకొల్పబడిన అనాథశిశుశరణాలయాలను ఇతర శిశు సంఘాలను ప్రోత్సహించి తగు విధాన సహాయము చేస్తుంది. దేశములోని అంగవైకల్యముగల శిశువుల సంరక్షణార్థము వైద్యాలయాలు, విద్యాలయాలు, శిక్షణాలయాలు నెలకొల్పవలెననువిషయాన్ని ప్రజా దృష్టికి తీసుకొనివచ్చి, వాటిని వ్యవస్థీకరించటములో సహకరించుతుంది. దుర్గతిపాలయిన బిడ్డలను మంచి నడవడికి తీసుకొనివచ్చే భారాన్ని వహిస్తుంది. అంతేకాక అనాథలయిన కారణమునే త, న్యాయస్థానాల పాలయి, శిక్షలు పొందేవారికి సహకరించి సహాయపడుతుంది. బాలనేరస్థుల కార్యక్రమము మార్చి, వారి అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ సంఘము బిడ్డలను తన స్వాధీనములో ఉంచుకొని విద్యగరపుతుంది. బిడ్డల వారసత్వాధికారాలలోను ఉత్తరోత్తరా బిడ్డలకు చెందే ఆస్తిహక్కుల లోనూ (మరణశాసనాలలోను) కూడా జోక్యము కలిగించుకొని ప్రత్యేకంగా బిడ్డల పక్షాన కృషిచేస్తుంది బిడ్డల వారసత్వాధికారానికి భంగమూ నష్టమూ కలుగకుండా కాపాడుతుంది. సలహాలు కోరినవారికి సలహాలనిచ్చి సహకరిస్తుంది. అసహాయదశలో ఉండి, తన సలహా కోరివచ్చిన బిడ్డలందరికీ ఈ సంఘము తన సహాయ సహకారాల నందివ్వటానికి ఎప్పుడూ సంసిద్ధముగా ఉంటుంది.

ఈ ఆదర్శాలతో నెలకొల్పబడిన సంఘములో అనేకమంది బిడ్డలు చేర్చబడ్డారు. వారిలో పసికందులు కొందరున్నారు. కొంతమంది చిన్న బిడ్డలూ ఉన్నారు. కొందరు విద్యార్జన చేస్తున్నారు. కొంతమంది విద్యార్జనతోపాటు చేతిపనులలో కూడా శిక్షణ పొందుతున్నారు. సుశిక్షితులయిన బిడ్డలు స్వతంత్ర జీవనము చేయగల సమర్థులయినారు.

మన దేశములో జాతీయాభ్యుదయానికై ఏర్పడిన ప్రథమ పంచవర్ష ప్రణాళికలో శిశు సంక్షేమ కార్యక్రమాలు చేర్చబడ్డాయి. అవి మనదేశపు సాంఘిక ఆర్థిక విద్యా వైజ్ఞానికదృష్ట్యా శిశుజనాభ్యుదయాన్ని దృష్టియందుంచుకొని కృషిచేయ సంకల్పించాయి. పంచవర్ష ప్రణాళికలో శిశు సంక్షేమ కార్యక్రమాల క్రింద $13\frac{1}{2}$ లక్షల ధనము వ్యయము చేయబడ్డది. అంగవైకల్యముగల బిడ్డల అభ్యుదయానికీ, బాల నేరస్థుల అభివృద్ధి కొరకూ, శిశు జనాభ్యుదయానికీ మూడు శాఖలు ఏర్పడి దేశమందంతటా పర్యటించి కృషిచేస్తున్నాయి. కేంద్రసంఘ సంక్షేమ సంఘము ఒక బోర్డుగా ఏర్పడి వీటిని శాసిస్తున్నది.

ఇండియన్ కౌన్సిల్ అఫ్ చైల్డు వెల్ఫేర్ సంస్థ (Indian Council of Chiid welfare) కూడా శిశు జనాభ్యుదయానికై నెలకొల్పబడ్డదే. ఇది శిశుజన సంబంధమైన వార్తలను సేకరించటానికీ, వాటిని ఇతర సంస్థలకు అందించటానికీ, భారతదేశములోని శిశుజనసంఘాల డైరక్టరీని సిద్ధము చేయటానికీ, బాల సాహిత్యములో పరిశోధన చేయటానికీ, అంతర్జాతీయముగా పరస్పర సహకార సుహృద్భావ సంబంధాలను అభివృద్ధి చేయటానికీ కృషిచేస్తున్నది.

ఇండియన్ నేషనల్ కమిటీ అఫ్ ది యునైటెడ్ నేషన్సు అప్పీల్ ఫర్ చిల్డ్రన్ (Indian National committee of the United Nations Appeal for Children) 1948 లో నెలకొల్పబడ్డది ఈ కమిటీ పక్షమునను, ఐక్యజాతుల సెక్రటరీ జనరలు అనుమతి ననుసరించే కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి అయిన శ్రీమతి రాజకుమారి అమృత కౌరు నేషనల్ కమిటీకి అధ్యక్షురాలిగా ఎన్నుకొనబడి ఆ సంవత్సరము (1948) నవంబరు 5 వ తేదీన 'శిశుదినోత్సవము' జరపటానికి దేశమందంతటా విజ్ఞప్తిచేసింది. ఆ శుభదివాన అనేక రాష్ట్రాలలో స్థానిక సంఘాలు నెలకొల్పబడ్డాయి; విరాళాలు ప్రోగుచేయబడ్డాయి. తత్ఫలితముగా అంతర్జాతీయ శిశుప్రదర్శనము 1949 లో ఢిల్లీనగరములో అతి వైభవముతో జరుపబడ్డది. 1952 లో ఈ సంస్థ తిరిగి వ్యవస్థీకరింపబడి స్వతంత్రముగా ఉండదలచి భారత శిశు సంక్షేమ సంఘమను పేర రిజిస్టరు చేయబడ్డది.

భారతదేశములో బిడ్డలకు సంబంధించిన శాసనాలకూ శిశు జనాభ్యుదయ సంఘాలకూ సంయుక్త రాష్ట్రాలలోనివి ఆధారాలు. మన దేశములో స్వాతంత్ర్యానికి పూర్వము శిశు సంఘాలు మిషనరీలచేతనూ, విదేశాలలో ఉన్నత విద్యబడసి ఉన్నతోద్యోగాలలో నియమింపబడిన వారిచేతను స్థాపింపబడినవే. అవి చాలావరకూ భారతదేశపు సమస్యలను సాంఘిక స్వరూపాన్ని విస్మరించి స్థాపింపబడిన కారణముచేత, చాలాసంస్థలు కొంతకాలానికి నామరూపాలులేకుండా నశించిపోయాయి కొన్ని నామమాత్రముగా నిలచి ఉన్నాయి. స్వతంత్ర భారతములో నెలకొల్పబడిన వాటి అన్నిటి దృక్పథము పరిస్థితుల కనుకూలముగా రూపొందించబడ్డది.

ఇండియన్ కౌన్ఫరెన్సు అఫ్ సోషల్ వర్కు దేశస్వాతంత్ర్యముతోపాటు నెలకొల్పబడ్డది. దీనిశాఖలు దేశమంతటా వ్యవస్థీకరింపబడి కృషి చేస్తున్నాయి. ఈ సంఘము సాంఘికముగా కృషిచేస్తూ సంఘములో శిశువుల పరిస్థితులను వారికి సంబంధించిన వార్తలను ఇతరసంఘాలకు తెలుపుతుంది.

ఈ ఆదర్శాలతో అనేక సంస్థలు అన్ని ప్రాంతాలలోను వ్యవస్థీకరింపబడి కృషి చేస్తున్నాయి. శిశు జనాభ్యుదయసంఘాలు 17 రాష్ట్రాలలోనూ రాష్ట్ర సంఘాలుగా నెలకొల్పబడ్డాయి. ఇవన్నీ కేంద్ర సంఘానికి అనుసంధించబడినవే.

భారతదేశములో 15 సంవత్సరములలోపు వయసుగల బిడ్డల సంఖ్య 1955 రిపోర్టు ననుసరించి 178,000,000 అని అంచనా వేయబడ్డది. ఇంతమంది బిడ్డల అభివృద్ధికై ఎన్ని ప్రణాళికలు సిద్ధముచేసి ఎన్ని సంస్థలు కృషిచేసినా ప్రస్తుత పరిస్థితులలో దేశానికి కావలసినంతగా సహాయము లభించదు. ఇన్ని సంస్థలు నిర్విరామముగా కృషి చేస్తున్నప్పటికీ పాలబుగ్గల చిన్నారి పాపలు భిక్షాటనము చేస్తూనే ఉన్నారు. చిన్నబాలులు దొంగతనాలు చేస్తూనే ఉన్నారు. ఆడపిల్లలు అవినీతిపాలబడుతూనే ఉన్నారు. దీనికి కొంతవరకూ ప్రచార లోపము కావచ్చు. ప్రభుత్వపరమైన సంస్థలుగాని ప్రజా సంస్థలు గాని ప్రజాభ్యుదయము కొరకే

(56-వ పేజీ చూడండి)

బొమ్మ దొంగ ఆచూకీ

"అన్నయ్యా! ఇక్కడ పెట్టిన బొమ్మలు తీసేవా" అంటూ ఇంట్లోంచి కేకేసింది లక్ష్మి. "ఏం బొమ్మలే" అంటూ ముఖం కడుక్కుంటున్న వాడిని ఆ పని పూర్తి చేసి ఇంట్లోకెళ్ళా. లక్ష్మి బిక్క ముఖంతో విచారంగా బొమ్మల ముందు నిలబడి ఉంది. "రెండు బొమ్మలు కనపడలే దన్నయ్యా" అంటూ లక్ష్మి ఆ బొమ్మ లుండాల్సిన స్థానాన్ని వేలెట్టి చూపించింది. "ఏం బొమ్మలు" అంటూ తిరిగి ప్రశ్నించా. "రాధా కృష్ణుల బొమ్మ లన్నయ్యా! అంత అందమైన బొమ్మలు మనకు ఇక లేనే లేవు" అంటూ బిక్క మొగంతోనే జవాబిచ్చింది. అప్పట్లో లక్ష్మి పరిస్థితి చూస్తే నాకు చాలా జాలి వేసింది. జాలి వేసిందేగాని లక్ష్మిని ఓదార్చటానికే ఉపాయమూ నాకు తోచలా. ఆ రెండు బొమ్మలంటే లక్ష్మికి ఎంతో ఎక్కువ మక్కువ. అసలే గాక ఆరోజే బొమ్మల పండుగ. బొమ్మలపండుగ రోజుల్లో బొమ్మలంటే ఎవరి కిష్టముండదు? ఉన్న బొమ్మలన్నిటిలో నిజంగా ఆ రెండు బొమ్మలే బాగుండేవి. ఆ రెండు బొమ్మలే మిగిలిన వాటికొక కొత్తరకమైన శోభ చేకూర్చేది.

"లక్ష్మీ! ఆ బొమ్మలు మళ్ళీ నీకు తెచ్చియిస్తానులే" అంటూ బుజ్జగింపు ధోరణిలో మాట్లాడాను. లక్ష్మి ఆత్రుతతో "వాటిని నువ్వు తీసి దాచావా అన్నయ్యా?" అంది. "లేదు వాటి నెవరో దొంగిలించారు" అనేటప్పటికి లక్ష్మి విచారంతో అక్కడే కూలబడిపోయింది. "లక్ష్మీ! ఆ బొమ్మలు తిరిగి నీకు తెచ్చియిస్తానుగాని, నిన్న మనింటికి బొమ్మలు చూడటానికి ఎవరెవరు వచ్చారో చెప్పు" అన్నాను. "పాప, రంగడూ, మోహన్, పార్వతి, జయా వచ్చారన్నయ్యా."

"నిన్న ఎప్పుడు వచ్చారు"?

"బొమ్మలు పెట్టిన తరువాతే"

"ఆ రెండు బొమ్మలు అందరికీ చూపించావా?"

"ఆ"

"వాళ్ళందరూ కూడా బొమ్మలు పెట్టుకున్నారా?"

"ఆ"

"మరి నువ్వు వాళ్ల బొమ్మలు చూసివచ్చావా?"

"లేదు."

అప్పుడా రెండు బొమ్మలూ ఉండవలసిన చోటు చూశా. అక్కడ కొద్దిగా బొమ్మలుండవలసిన గుర్తులు కనబడుతున్నయ్. పొద్దున్నే చిన్నపిల్లలెవ్వరూ ఇంటికి రాలేదు. కాబట్టి బొమ్మలు దొంగిలించినవాళ్లెవరో నిన్ననే వాటిని దొంగిలించి ఉండాలి. బొమ్మలు పెట్టింది నిన్న మధ్యాహ్నమేనాయె: కాబట్టి నిన్న సాయంత్రమే బొమ్మలు దొంగిలించి ఉండాలె. బొమ్మలను దొంగిలించే అవసరము పిల్లలకే గాని పెద్దవాళ్ళకుండదాయె! నిన్న సాయంత్రం బొమ్మలు చూడటానికి వచ్చిన ఐదుగురిలోనే ఉంటే దొంగ ఉండాలి అని నిశ్చయించుకున్నా. దొంగను పట్టుకోనటానికేమీ ఆధారాలు దొరకలా. "ఏ విధంగా దొంగను పట్టుకోవాలా" అని ఎంత ఆలోచించినా ఏ ఉపాయమూ తట్టలా. ఇంతలో లక్ష్మి నా ఆలోచనకు భంగంకలిగిస్తూ "అన్నాయ్! బొమ్మలు తెచ్చిఇస్తానంటివే! తెచ్చి ఇవ్వే?" అంది.

"తెచ్చిఇస్తానుగాని ఓ పని చేసి పెట్టు" అన్నాను.

"ఏమిటా పని"

"నువ్వు వాళ్ల ఐదుగురిళ్ళకెళ్ళి ఆ రెండుబొమ్మలు వాళ్ళబొమ్మల్లో ఏమన్నా ఉన్నయ్యేమో చూసిరా" అన్నాను వుండవని సందేహిస్తూనే

"అలాగే" అంటూ లక్ష్మి ఒక్కపరుగున వీధిలోకెళ్లింది. మరో అరగంటకల్లా వీధిలో కెళ్లిన లక్ష్మి తిరిగి వచ్చింది.

"ఉన్నాయా లక్ష్మీ!" అంటూ తిరిగి ప్రశ్నించాను.

పి. మధుసూదన ప్రసాద్

బాలగేయం:

ముత్యాలు

వేజెండ్ల సాంబశివరావు

చిటపట చిటపట
చిత్తడి వానలు
కురిసినవమ్మా! కురిసినవి.

చిత్తడి నేలల
ముత్యము లెన్నో
మెరసినవమ్మా! మెరసినవి.

మెరసిన ముత్యాల్
తొందరగా నే
ఏరెదనమ్మా! ఏరెదను!

ఓరిమితో నే
హారము లెన్నో
కూర్చెదనమ్మా! కూర్చెదను.

దండలు నాచిటి
మెడలో మురియగ
కులికెదనమ్మా! కులికెదను!

పకపక వికవిక
నవ్వెద వేలా!
ముత్యాల్ రాలును నా తల్లీ!

★ బొమ్మ దొంగ ఆచూకి ★

"లేవు."

లక్ష్మి చేతిలో వున్న వస్తువును చూపిస్తూ "చేతిలో ఏముంది?" అని ప్రశ్నించాను.

"ఇదా! ఇది రాధబొమ్మ తలలే, ఉంటే తీసుకొచ్చా."

"ఎక్కడ పడివుంది?"

"రంగడూ వాళ్ళ యింటి కురుగా వున్న ఖాళీస్థలంలో" ఆ వస్తువును చేతిలోకి తీసుకొన్నాను. అది నిజంగా పోయిన రాధ బొమ్మ తలే! 'బొమ్మలు రంగడే కాజేశాడేమో!' అని అనుమానం తగిలింది. 'మరి బొమ్మ ఎందుకు పగిలి పోయింది?' అనేదానికి సమాధానం దొరకలా. కొంతసేపు ఆలోచించిన మీదట దానికి సమాధానం తొందరగానే దొరికింది.

'నిన్న సాయంత్రం చీకటి పడుతున్నప్పుడు లక్ష్మి అమ్మతో పేరంటానికి వెళ్ళింది. అప్పుడు రంగడు లక్ష్మితో ఆడుకోటానికి వచ్చివుండవచ్చు. అక్కయ్యా వాళ్లూ దొడ్లో ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూరాయె! బొమ్మల దగ్గర ఎవరూ లేకపోవటంవల్ల ఆ రెండుబొమ్మలనూ కాజేయాలన్న బుద్ధివాడికి కలిగివుండవచ్చు. అందుచేత ఆ రెండు బొమ్మలను తీసి వుంటాడు. తన్ని ఎవరైనా చూస్తారేమో! అనే తొందరలో బొమ్మలను తీయటంవల్ల రాధ బొమ్మ చెయ్యిజారి క్రిందపడి ఉండవచ్చు. అది గచ్చుమీద పడటంలో పగిలి పోయింది. ఆ బొమ్మ అంత ఎత్తు నుంచి క్రిందపడితే అది రెండు ముక్కలే అవటానికి అవకాశం లేదు. ఇంకా ఎక్కువ ముక్కలై ఉండాలి. ఒక్కటే కనబడుతోంది. మరి తక్కినవేమైనట్లు? వాటిని గూడా వాడు తీసికొని వెళ్లి ఉండవచ్చు. పెద్దముక్కలైతే వాటిని తొందరగా ఏరగలడు. మరి చిన్నచిన్న ముక్కలైనా ఇక్కడ ఉండాలికదా! ఈ ఆలోచనతట్టటంతోనే ముక్కలేమైనా కనబడుతయ్యేమోనని క్రింద చూశా! క్రింద చూడటంతోనే నా ఆశ అంతా నిరాశ అయింది. ముక్కలేవీ లేవు. ఇల్లంతా శుభ్రంగా ఊడ్చి ఉంది. మళ్ళీ ఇంకొక ఆలోచన తట్టటంచేత "లక్ష్మి ఇల్లు ఊడ్చింది ఎవరు?" అని ప్రశ్నించా.

"సుబ్బి" అంది లక్ష్మి.

"అయితే దాన్నొకసారి పిల్చుకొస్తావా!"

"ఆ" అంటూ లక్ష్మి సుబ్బిని పిల్చుకురావటానికి వెళ్లింది.

మరికొంతసేపటికి లక్ష్మి సుబ్బితో సహా తిరిగివచ్చింది. సుబ్బి రావటంతోనే "ఎందుకయ్యాగారూ! పిలిచారుట" అని ప్రశ్నించింది.

"నువ్వేనా ఇల్లు ఊడ్చింది" అని ప్రశ్నించా.

"ఊ"

"ఎంతసేపయింది ఊడ్చి?"

"ఇంతకుముందే! ఏం బాగో లేదా!"

"బాగానే ఉంది. నువ్వు ఊడ్చినప్పుడు బొమ్మలదగ్గిర ఏమైనా ముక్కలు కనుపించాయా?"

"కనబడ్డాయి"

"చిన్నవా! పెద్దవా!"

"చిన్నవే"

"వాటిని నువ్వేం చేశావు?"

"ఊడ్చి అవతల పారబోశా!"

"సరే! ఇక పోయి నీ పని చూసుకో" అన్నాను. వెంటనే సుబ్బి వెళ్ళిపోయింది. నేను లక్ష్మితో "లక్ష్మి యీతల దొరికేచోట కొన్ని ముక్కలు పడుంటాయ్. వాటిని వెతికి తీసుకురా" అన్నాను. వెంటనే లక్ష్మి వాటిని తీసుకురావటానికి వెళ్ళింది.

మరి కొంతసేపటికి కొన్ని ముక్కలతో సహా తిరిగివచ్చింది. "ఇవ్వి అక్కడే దొరికాయా?" అని ప్రశ్నించాను.

"ఇందాక దొరికినచోటకు దగ్గిర్లోనే దొరికాయి."

"ఇంకేం దొరకలా?"

"లేవు"

"సరే ఆ బొమ్మ తెచ్చియిస్తాలే! నీ స్నేహితులొచ్చినప్పుడు వాళ్లతో 'నా బొమ్మలు రెండు పోయాయి' అని చెప్పు. దానికి వాళ్లేమంటారో తిరిగి నాతో చెప్పు. ఇప్పటికి నువ్వు వెళ్లి ఆడుకో" అన్నాను. "సరే" అంటూ లక్ష్మి ఆడుకోటానికి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఆరుగంటలైంది. లక్ష్మి నా గదిలోకి వచ్చి "వాళ్లతో నువ్వు చెప్పినట్లే చెప్పానన్నాయ్" అంది ఆత్రంగా.

"దానికి వాళ్లేమన్నారు" అని ప్రశ్నించా.

"పాప, మోహన్, జయ, ...ర్వతి ఏమన్నారంటే 'ఎప్పుడు పోయినయ్,' 'ఎవరు తీశారు,' 'ఎందుకు తీశారు,' 'మళ్ళీ దొరికినయ్యా' అన్నారు."

"మరి నువ్వేమని సమాధానం చెప్పావ్?"

★ బొమ్మ దొంగ ఆచూకి ★

"ఏమో! ఎప్పుడు పోయినయ్యో! నాకు తెలియదన్నా!"

"రంగడేమన్నాడు?"

"వాడేం మాట్లాడకుండా ఊరుకున్నాడు"

"నిన్న సాయంత్రం నీకోసం ఎవరన్నా వచ్చారేమో! అక్కయ్యనడిగిరా" అన్నాను. వెంటనే లక్ష్మి ఇంట్లోకి వెళ్ళింది. మరి కొంతసేపటికి లక్ష్మి తిరిగివచ్చి "వాళ్ల రంగడు వచ్చాడట అన్నయ్యా" అంది.

బొమ్మలు రంగడు తీశాడనటానికి మూడు చిన్న చిన్న కారణాలున్నాయ్. ఒకటి పగిలిపోయిన బొమ్మ ముక్కలు వాళ్ళ యింటి దగ్గర దొరకటమే! అయినా వాడే తీశాడని వాడిమీద నింద మోపటానికి అదేమంత పెద్ద కారణం కాదు. రెండోదేమిటంటే లక్ష్మి నా బొమ్మలు పోయినయ్యని వాళ్లతో చెప్పినప్పుడు వాడేమీ మాట్లాడకుండా ఉండటమే! బొమ్మలు వాడే తీసి ఉండటంచేత వాడేమీ మాట్లాడకపోవటం, వాటి విషయం వాడికి తెలిసి ఉండటమే! వాడే కారణం మీద మాట్లాడలేదో? ఎవరికి తెలుసు. మూడో కారణం ఏమంటే నిన్న సాయంత్రం లక్ష్మి ఇంట్లో లేనప్పుడు లక్ష్మికోసం వచ్చినవాడు రంగడే! అందుచేత వాడే బొమ్మలు తీశాడనుకోవచ్చు. ఈ మూడు చిన్న చిన్న అనుమానాల ప్రకారం రంగడికే దొంగతనం అంటగట్టటం ఏమంత సమంజసంగాదు. ఇక నా ఆలోచనలను కట్టిబెట్టి "లక్ష్మి! రంగడి నొకసారి పిల్చుకురా!" అన్నాను. వెంటనే లక్ష్మి రంగడిని పిలుచుకు రావటానికి వెళ్లింది.

మరికొంతసేపటికి లక్ష్మి రంగడితోసహా తిరిగివచ్చింది. వాడు రావటం కొంత బెదురుతూనే వచ్చాడు. ఆ బెదురు వాడి కళ్ళల్లోనే కనబడుతూంది. ఆ బెదురు చూచేటప్పటికి నా అనుమానం మరింత ధ్రువపడింది. అందుచేత నేను "రంగడూ! నిన్న నువ్వు తీసుకెళ్ళిన బొమ్మలు తీసుకురా!" అన్నాను. వాడు "ఏంబొమ్మలు?" అని ప్రశ్నించాడు.

"రాధాకృష్ణుల బొమ్మలు"

"వాటి సంగతి నాకేం తెలుసు."

"నీకేం తెలియదా! నిన్న నువ్వు లక్ష్మికోసం వచ్చావు. అప్పుడిక్కడెవరూ లేకపోవటంచేత బొమ్మల్ని తీశావు. తీస్తుంటే ఒకబొమ్మ పగిలిపోయింది. ఆ పగిలిపోయిన బొమ్మ ముక్కలివిగో" అంటూ పగిలిన బొమ్మ ముక్కలను చూపించాను. ఈమాటలనేటప్పటికి రంగడేమనుకున్నాడో ఏమో "అవును. నిన్న నేనే తీశాను. ఇక్కడే ఒక బొమ్మ పగిలిపోయింది" అంటూ వెళ్ళి రెండో బొమ్మ మాత్రం తెచ్చియిచ్చాడు. పోయినబొమ్మ తిరిగి వచ్చేటప్పటికి లక్ష్మిముఖం సంతోషంతో వికసించింది. కాని రెండో బొమ్మ పగిలిందని విచారం కలగకుండా ఉండలేదు. ★

విధిలిఖితము

ఏకశిలానగరమును రాజధానిగ చేసుకొని ఆంధ్ర సామ్రాజ్యమును కాకతీయ వంశీయుడగు ప్రోలరాజు పరిపాలించుచుండెను. ప్రోలరాజునకు లేక లేక తేజశ్శాలియగు పుత్రుడు జన్మించెను. పుత్రోత్సవపు వేడుకలలో గొప్ప దర్బారు జరిగెను. గొప్పగొప్ప జ్యోతిష్కులా సభకు వచ్చిరి. రాజు వారితో నేకాంతమున కుమారుని జాతకము గురించి ప్రశ్న వేసెను. వారు నొక్కింత తడ వేమేమో లెక్కలు వేసిరి. తాటియాకుల గ్రంథములను దిరగ వేసిరి. తుదకొకరి మొగ మొకరు చూచుకొని పెదవి విఱచి మిన్నకుండిరి. ప్రోలరాజు గ్రుచ్చి గ్రుచ్చి యడుగుటచే వారు తప్పుకొనజాలక "ప్రభూ! నీ కుమారుడు దీర్ఘాయుష్మంతుడగును. తండ్రిని మించిన కొడుకనిపించుకొనును. కాని తమ కతని చేతిలో మృత్యువు వ్రాసిపెట్టియున్నది" అని తెలిపిరి. ప్రోలరాజు ఎట్టి విషాదమును దెలియరానీక వారిని సన్మానించి పంపివేసెను.

ప్రోలరాజు దుఃఖముతో క్రుంగిపోయెను. అతడు మంత్రులతో మంతనములు సలిపెను. ఆంధ్ర సామ్రాజ్యము స్థాపితమైనదే కాని స్థిరపడి యుండలేదు. ఇంటను బయటను శత్రువులు పొంచియుండిరి. అట్టి సమయమున ప్రోలరాజునకు హాని గల్గినచో తెలుగువారి యాసలడి యాసలగును. అందుచే శిశువును చంపివేయుట కర్తవ్యమని వారు బోధించిరి. కాని చేతులార నెవ్వరు ఆ ఘోర కృత్యమొనర్పగలరు? కడకు బాలుని అరణ్యములో వదలి వన్యమృగముల పాలు గావించుటకు నిర్ణయింపబడెను. కాని ప్రోలరాజు కడుపు తీపిని చంపుకొనలేక పోయెను. అత డొకనాటి అర్ధరాత్రమున శిశువును రాజధాని ఏకశిలానగర సమీపమునగల స్వయంభూస్వామి ఆలయ మంటపమునొద్ద పరుండబెట్టి వచ్చెను.

మరునాటి ఉదయమున ఆలయ పరిచారకులు కెవ్వు కెవ్వుమని యేడ్చు ఆ పసిబిడ్డను చూచి పూజారుల కెఱుకపఱచిరి. పెద్ద పూజారి రుద్రజియ్యఅను నతడు సంతతి లేనివాడు. అత డా బాలకుని శివప్రసాదముగ గ్రహించి భార్య కప్పగించెను. ప్రోలరాజు ఏమియు నెఱుంగనివానివలె పూజారిని పొగడి "ఎవడైననేమి? పసిపాపడు. వానిని పెంచి పెద్దవానిజేసి విద్యాబుద్ధులు చెప్పించి పిదప సంసారమున కప్పగింపుడు. అప్పుడాతడు స్వతంత్ర[illegible]గ జీవింపగలడు. మీకు పుణ్యము, పురుషార్థము రెండును సమకూడును. బాలుని పోషణమునకగు వ్యయమంతయు ప్రభుత్వమే భరింపగలదు" - అని సబహుమానముగ వీడ్కొలిపెను.

రుద్రజియ్య శిశువునకు రుద్రదేవుడని నామకరణ మొనర్చి అల్లారు ముద్దుగ పెంచుకొనుచుండెను. కన్న మోహముకన్న పెంచిన మోహమెక్కుడుకదా! బాలుడును నాట బెరుగునది పూట బెరుగుచు ముద్దు మురిపెములతో పూజారి దంపతుల నలరించుచుండెను. రుద్రదేవుడు యుక్తవయస్కుడై వేదశాస్త్రాదికముల పాండిత్యము గడించెను. క్షత్రియోచితములైన శస్త్రాస్త్ర విద్యలను సాధించెను. నూనూగు మీసాల నూత్నయౌవనములో సానబట్టిన జాతిరత్నమువలె నాతడు వెల్గొందుచుండెను.

అనుదినము వేకువనే లేచి స్వయంభూదేవు నర్చించి మఱలి వచ్చుట ప్రోలరాజు నిత్యకృత్యములలో నొకటి. నాడునట్లే చనుదెంచెను. పరివారము మామూలు ప్రకారము ప్రాకారము వెలుపల నిలిచిపోయెను. ప్రోలరాజు ఒంటరిగా లోనికెళ్ళి శివార్చనము ముగించెను. తిరిగివచ్చునప్పుడు మంటపమున నొక యువకుడు నిద్రించుచుండు నట్లాతనికి కనపడెను. రాజు కుతూహలముతో వానిని సమీపించెను.

ఆ వ్యక్తి యెవ్వరో కాదు. రూపొందిన శౌర్యమోయన రుద్రదేవుడచ్చట శయనించియుండెను.

ప్రోలరాజింతకముందు రుద్రదేవునొంటిగా గలిసి యుండలేదు. అతనిలోని పుత్రప్రేమ పెల్లుబ్బి కట్టలు తెగి పొంగులు వారెను. కన్నకొడుకు నొక్కమాఱు ఆలింగనము చేసికొనవలెనని అతనికి బుద్ధి పుట్టెను. ఎంత యణుచుకొన్నను చిత్తవికార మాగినది కాదు. అతడు తత్తరముతో నల్వంకల గలయ జూచెను. కనుచూపు మేరలో నెవ్వరును లేరు. ఇంతకన్న నవకాశము లభించుట హుళక్కి. ప్రోలరాజు కాళ్లు తడబడుచున్నను లెక్కసేయక కొడుకును కౌగిలించుకొని శిరమును ముద్దుపెట్టుకొనెను.

రుద్రదేవుడు కలత నిద్దురలో నుండెను. మీదు మిక్కిలి యేదో దుస్వప్నము గనుచుండెను. అట్టి స్థితిలో ప్రోలరాజాతని పరిష్వంగము కోరెను. శత్రువు లెవ్వరో తనపై పడినారని రుద్రదేవుడూహించెను. త్రుళ్లిపడి లేచెను. మైకముతోనే మొలలోని బాకును తీసి ప్రోలరాజు వక్షమున గ్రుచ్చెను. ఈ యలజడి విని పరివారము లోన ప్రవేశించెను. ఆదృశ్యము చూసి వారు భయకంపితులైరి. కొందరచ్చట గాపుండిరి. కొందఱు పట్టణములోనికి దౌడుతీసిరి. దవానలమువలె నీవార్త వ్యాపించుట కెంతో కాలము పట్టలేదు.

పౌరులెక్కడి పనులక్కడ కట్టిపెట్టి దౌడు తీయుచుండిరి. ఒకరికన్న నొకరు ముందడుగు వేయసాగిరి. ఒక్కక్షణములో పురజనులు స్వయంభూస్వామి యాలయమున చేరిరి. హత్య చేయబడిన వ్యక్తి తమ రాజని బోధపడెను. ఆయన వక్షస్థలమున నొక బాకు పిడివరకు గ్రుచ్చబడి యుండెను. హంతకుడు బిత్తరి చూపులతో విభ్రాంతుడై నిలువబడి యుండెను. ప్రజలలో ఉద్రేకము ఆకసమంటెను.

“చంపుడు, పొడువుడు, హంతకుని పట్టి చిత్రవధ నొనర్పుడు” అని ప్రజాసముద్రము ఏకకంఠముగ ఘూర్ణిల్ల జొచ్చెను.

అంతలో ప్రోలరాజు కన్నులు తెరచుకొనెను. ప్రాణవాయువు లింకను ఆతనిని వీడిపోలేదు. ప్రోలరాజు ప్రజల హృదయంలో పగ్వలిడుచున్న భావములను పసికట్టెను. రక్తక్షయ మగుటచే నాతడప్పటికే కడు నీరసించియుండెను. ఊపిరి బరువుగా వచ్చుచుండెను. శక్తినంతయు నొక్కమాఱు కూడ దీసికొని అతడిట్లు పల్కెను. “పౌరులారా! నా ప్రజలకడ ఈ యవసాన దశలోన విషయము చెప్పనవసరము లేదు. ఈ సంగతి రెండవకంటి వానికి దెలియకుండా ఇన్నాళ్లు కప్పిపుచ్చితిని. హంతకు డెవడో కాదు. నా కుమారుడే! ఆంధ్ర సామ్రాజ్యమునకు భావిచక్రవర్తి!!”

రుద్రదేవుని జన్మవృత్తాంతమంతయు రాజు పూసగ్రుచ్చినట్లు నుడివెను. జ్యోతిష్కులసిద్ధాంతము, మంత్రుల నిర్ణయము, వన్యమృగముల వాతబడవేయుట కిచ్చగింపక శిశువును శివాలయమున చేర్చుట, రుద్రజియ్య పెంపకము మున్నగు విషయములు ప్రజలకు దెలుపబడెను. శివార్చన మొనర్ప వచ్చిన రాజు రుద్రదేవుడు ఒంటరిగా నిద్రించుచుండ గాంచుట, పుత్రప్రేమ పట్టజాలక యాతనిని గౌగలించుకొనుట, పౌరులు గ్రహించిరి.

రుద్రదేవుడీ పని తెలిసి చేయలేదు. శత్రు వెవ్వడో పైబడెనని కలత నిద్దురలో నీఘాత మొనర్చెను. విధి మొదటనే మన లలాటపట్టికను లిఖించి పెట్టును. ఆ వ్రాతను భగవంతుడే మార్పు చేయలేడు. మానవులు తప్పించుకొన జూచుట నగుబాటు కాదా! నేటితో నా కాయువు సరి. నా కుమారుడగు రుద్రదేవుని ఏకశిలారత్న పీఠిపై నభిషేకింపుడు. సామ్రాజ్యభారము వహించుటకితడు అన్ని విధముల సమర్థుడు” అని ప్రోలరాజు ప్రజలను కోరెను.

రుద్రదేవుడు తన పుట్టుపు గుఱించి యింత కథ యున్నదని యెఱుగడు. పూజారి దంపతులే తన జననీ జనకులని భావించి యుండెను. తాను నిరపరాధిని హత్య చేసితినని తోచినప్పుడే రుద్రదేవుని పై ప్రాణములు పైని పోయెను. ఆ వ్యక్తి యాంధ్ర సార్వభౌముడని విన్నప్పుడాతడు నిజముగా కొయ్యబారి పోయెను. సార్వభౌముడు తనతండ్రి

రేయని తెలిసినప్పుడాతని స్థితి ఎట్లుండునని చెప్పగలము?

"రాజద్రోహినే కాక పితృహంతకుడను కూడనా? పితృ సామ్రాజ్య ప్రదానమా!" అని రుద్రదేవుడు తండ్రిపైబడి విలపింప జొచ్చెను. ప్రోలరాజాతని నెమ్మను నిమురుచు "నాయనా! నివురు గప్పిన నిప్పువలె ఇన్నాళ్లు సామాన్యునింట పెరిగితివి. స్వార్థమునకై నిన్ను రాచఱికమునకు వెలి యొనర్చితిని. తెలియక చేసిన తప్పు నీది-తెలిసి చేసిన తప్పునాది. అంతయు నీశ్వరేచ్ఛ! త్రిలింగ సామ్రాజ్యమును స్థాపించుటకై నాజీవితమును వెచ్చించితిని. దాని నిప్పుడు నీ చేతులలో పెట్టి పోవుచున్నాను. నీశక్తిచే, నది స్థిరపడినప్పుడే తండ్రి ఋణము దీర్చుకొన్న వాడవగుదవు. అప్పుడే నా యాత్మయు తృప్తిచెందగలదనుచూ ప్రోలరాజు ప్రాణములు విడిచెను. ప్రజలు హాహారవములొనర్చుచు దుఃఖసముద్రమున మునిగిపోయిరి.

రుద్రదేవు డొక్క సుముహూర్తమున ఆంధ్ర సామ్రాజ్యమునకు పట్టాభిషిక్తు డయ్యెను. సామంత మండలాధిపుల తిరుగుబాటులణచి వేయుటయే గాక సామ్రాజ్యమును నలుముఖముల విస్తరింపచేసి తగు కట్టుదిట్టములతో రాజ్యము స్థిరపడునట్లు చేసి తండ్రి యానతి నక్షరాల ఆంధ్రసామ్రాజ్యమును మహావైభవముగ పరిపాలించి తండ్రియగు ప్రోలరాజు ఆత్మకు తృప్తి కలిగించెను. ★



18. వానికోరో ద్వీపం

జరిగిన కథ :—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను దిగ్భ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకల కది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకాప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సెల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ మహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్ళ వర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కాన్సెల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్టుగా భోజనం పెడతారు. భోంచేసి అందరూ హాయిగా నిద్రపోతారు. తిరిగి తమ కన్నవాళ్ళను చూస్తామో లేదో అని అంతా మథన పడుతూంటే వారికి హఠాత్తుగా జలాంతర్గామి అధికారి హెచ్చరిక వినిపిస్తుంది. కెప్టెన్ నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరూ బయటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతర్గామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. ప్రొఫెసర్ అరోనా నీమో గదిలో వింతలు విశేషాలు చూచి ఎంతో ఆశ్చర్యపోతాడు. కెప్టన్ నీమో జలాంతర్గామి నడిపించేపద్ధతి అంతా ప్రొఫెసర్ అరోనాకు తెలియజేస్తాడు. పిమ్మట జలాంతర్గామి కిరువైపులా తెరుచుకున్న అద్దాలలోనించి అద్భుతమైన సాగరగర్భ జలచరాలు కనిపిస్తాయి. ఆ తరవాత జలాంతర్గామి సాగరగర్భంలోని క్రెస్పో ద్వీపానికి బయలుదేరుతుంది. ఆ తరవాత సాగరగర్భంలో క్రెస్పోద్వీపంలో వేట జరుగుతుంది.

ఆ మరునాడు నిద్రలేచేసరికి నేను బాగా తేరుకొన్నాను.

సముద్రం ప్రశాంతంగా నిర్మలంగా ఉంది. క్రమక్రమంగా మా ఓడ క్రెస్పోద్వీపం విడిచిపెట్టి చాలా దూరం వచ్చివేసింది. అతి త్వరితంగా పసిఫిక్ మహాసముద్రంలో పడిపోతూంది.

అనువాదం: "వినాయక"

నావికులు నాటిలస్ జలాంతర్గామి కెన్నెన్నో వలలు కడుతూంటారు. ఆ వలలలో ఎన్నెన్నో చిత్రవిచిత్రమైన చేపలు పడుతూ ఉంటాయి. ఆ చేపలన్నీ ఓడ వంట గదిలో జాగ్రత్త పెడుతూంటారు. రకరకాల చేపలు, చిత్ర విచిత్రమైన వాటి రంగులు చూస్తూంటే నా కళ్ళు చెదిరిపోయాయి.

అటుపిమ్మట కొంతసేపటికి నేను నా గదిలోకి వెళ్ళి ఏదో పుస్తకం తీసి చదువుకొంటున్నాను.

నెడ్‌లాండ్ కొన్సిలు లిద్దరు నగం నగం తెరుచుకున్న అద్దాల గుండా సాగరగర్భంలోని వింతలన్నీ పరిశీలిస్తున్నారు. నాటిలస్ సముద్ర గర్భంలో వెయ్యిగజాల లోతున కదలకుండా మెదలకుండా ఒకేచోట నిలబడి ఉంది. అంతలోతులో చిన్న చిన్న జలచరాలేవీ జీవించవు. పెద్ద పెద్ద జలచరాలు మాత్రమే కని పిస్తాంటాయి.

అంతలో హఠాత్తుగా కొన్సిలు నా గదిలోపలికి వచ్చాడు.

"మీ రొక్కసారి ఇక్కడికి త్వరగా రావాలి." అన్నాడు.

నేను నా చదువాపి వెంటనే కిటికీలున్న గదిలోకి వెళ్లి నిలబడ్డాను. అదేదో బ్రహ్మాండమైన పెద్ద జంతువులా ఉంది. ఆజంతువు కదిలేజాడ ఎక్కడా కనిపించడం లేదు.

"అదేదో మునిగిపోయిన ఓడై ఉండాలి." అన్నాను.

"ఔనౌను! అదే!" అన్నాడు నెడ్‌లాండ్.

అతడు చెప్పినది అక్షరాలా నిజం!

మా నౌక దాని పక్కనించే వెళ్ళిపోయింది. నేను మునిగిన నౌక మీద కనిపించే అక్షరాలు జాగ్రత్తగా పరిశీలించాను. 'ఫ్లోరిడా' అని చదివాను.

అటుపిమ్మట మా మార్గంలో సముద్రంలో మునిగిపోయిన ఓడలెన్నో కనిపించాయి. తరవాత చాలా రోజులదాకా కెప్టెన్ దర్శనం కానేలేదు గాని ఒకనాటి ఉదయాన్నే అతడు తలవనితలంపుగా మా గదిలోకి వచ్చాడు. వస్తూనే ఒక యంత్రంకేసి చూశాడు. అది సముద్రగర్భంలో నౌక నడిచే ప్రదేశం నిర్దేశించి చూపేయంత్రం. ఆ యంత్రంకేసి చూస్తూనే "వానికారో ద్వీపం" అన్నాడు.

"అయితే మన మిప్పుడా ద్వీపం దగ్గిరికి వెడుతున్నామా?" అని అడిగాను.

"ఔను!" అన్నాడు కెప్టెన్.

"ఎంతసేపటిలో?"

"మనం అప్పుడే ఆ ద్వీపం దగ్గిరికి వచ్చివేశాము. అన్నాడు."

మా జలాంతర్గామి చిన్న చిన్న పగడపు దీవులు దాటుకుంటూ నెమ్మదిగా వానికారో ద్వీపం సమీపానికి వచ్చివేసింది. మేమున్న చోట సముద్రం 30, 40 నిలువుల కంటె ఎక్కువ లోతులేదు. మాకు కొంచెం దూరంలో వానికారో ద్వీపంలోని ఆటవికులు కనిపించారు.

అటుపిమ్మట మా నౌక ఆరాత్రే వానికారో ద్వీపం విడిచిపెట్టి చాలా దూరం సాగిపోయింది. తరవాత కొంతసేపటికి మాకు గిల్బోవా ద్వీపం తగిలింది. ఆ ద్వీపానికి మా జలాంతర్గామి సమీపించే సమయానికొక పెద్ద అవాంతరం ఏర్పడింది. హఠాత్తుగా నాటిలస్ జలాంతర్గామి ఒడ్డెక్కినట్టయింది. మేమంతా కంగారుపడ్డాము. మా భ్రమ నిజమే. జలాంతర్గామి ఒడ్డెక్కింది. అటూ ఇటూ కదలడమే మానివేసింది.

కాని కెప్టెన్ నీమో ఎక్కడా చలించినట్టు కనిపించలేదు. మెల్లిగా మేమున్న చోటికి వచ్చి నిలుచున్నాడు.

"ఏదో పెద్ద ఇబ్బందే వచ్చినట్టుందే." అన్నాను.

"ఆ! అంతగా పెద్ద ఇబ్బంది ఏమీ లేదు." అన్నాడు కెప్టెన్.

"మీరిది తేలికగా కొట్టి పారవేస్తున్నారు గాని మీరు కూడా ఇకనించి ఒడ్డెక్కి కాలక్షేపం చెయ్యాలేమో!" అన్నాను.

"అబ్బే! ఇంతలో మన జలాంతర్గామికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. సముద్రానికి బాగా పోటు తగలగానే మళ్ళీ మన ప్రయాణం

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

ప్రారంభించవచ్చును." అన్నాడు కెప్టెన్.

ఆతరవాత నాలుగైదు నిమిషాలలో కెప్టెన్ అక్కడినించి వెళ్లిపోయాడు. కెప్టెన్ వెళ్ళిపోగానే నెడ్‌లాండ్ అక్కడికి వచ్చాడు.

కౌన్సల్ త్వరలోనే జలాంతర్గామి మళ్లీ తేలిపోగలదని అన్నాడు.

దానికి సమాధానంగా నెడ్‌లాండ్ బుజాలెగరవేశాడు:

"ఇదిగో నేను చెప్పేమాట వినండి! ఈ జలాంతర్గామి మళ్ళీ నీటిలో తేలడం పట్టికల్లా. ఇక ఈ నాటితో కెప్టెన్ నిమోకు, మనకు ఋణం తీరిపోయినట్లే."

"నెడ్‌లాండ్! నేనంత కంగారు పడడం లేదు. మళ్ళీ నాలుగైదు రోజులలో జలాంతర్గామి తేలి తీరుతుంది. లేకపోతే ఎలాగో అలాగ బిల్బోవా ద్వీపానికి చేరుకోవాలి. కాని ఆ ద్వీపంలో నివసించడం ఏమీ మంచిదికాదు." అన్నాను.

"ఏది ఏమయితేనేం! మనం మెల్లిగా నేలమీదికి దిగవచ్చును! ఆ నేలమీద చెట్లున్నాయి. వాటి కింద జంతువులున్నాయి. ఆ జంతువుల మాంసం తనివిదీరా ఆరగించవచ్చును!" అన్నాడు నెడ్‌లాండ్.

దానిమీద కౌన్సలు అతనికి వక్కతాళం వేశాడు.

"నెడ్ చెప్పింది చాలా బాగుంది. కెప్టెన్ నిమో అనుమతి తీసుకుంటే మనం హాయిగా ఆ ద్వీపంలో తిరగవచ్చును. అది చాలా మంచి ఆలోచన."

"నేను అనుమతి అడగమంటే అడుగుతాను గాని తీరా చూసి కెప్టెన్ దాని కంగీకరించడేమో!" అన్నాను.

"పోనీ అడిగితే ఏంపోయింది. ఒకసారి అడిగి చూడండి! దానిని బట్టి కెప్టెన్ సంగతి కూడా తెలిసిపోతుంది." అన్నాడు కౌన్సల్.

తరవాత నేను కెప్టెన్ నిమోను చూసి ఆ అనుమతి అడిగాను. అతడు 'సరే' అన్నాడు. అంతేగాని ఏవిధమైన షరతులు విధించలేదు. అయితే అది న్యూగినీ ద్వీపాలకు సంబంధించిన ద్వీపం. అక్కడనించి పారిపోవడం మరింత ప్రమాదకరం. ఆ ద్వీపంలో ఉండే ఆటవికులు మనుష్యులనే తినివేసే జాతి. వాళ్ళ చేతుల్లో పడి హతమారిపోవడం కంటె జలాంతర్గామిలో ఖైదీగా ఉండడమే వేయిరెట్లు నయం!

మర్నాడు ప్రత్యేకంగా ఒక చిన్ననావలో మమ్మల్నందరినీ – ఆ చిన్న ద్వీపానికి పంపించే ఏర్పాట్లు జరిగాయి. జలాంతర్గామి నావికు లెవరు మమ్మల్ని వెంబడించలేదు.

అందుచేత ఆ పడవ నడిపించే భారమంతా నెడ్‌లాండ్ మీద పడింది. అదీగాక ఆ ద్వీపం ఇక రెండుమూడు మైళ్లకన్నా ఎక్కువ దూరంలేదు. అందుచేత నెడ్‌లాండ్‌కు నావ నడిపించుకుపోవడం ఏమీ అంత కష్టంకాలేదు.

మర్నాడు 8 గంటలకు మేమంతా ఆయుధాలతో సహా ఆ చిన్న పడవలో ప్రవేశించాము. మా అదృష్టవశాత్తు సముద్రం అంతా నిశ్చలంగా ఉంది. ఆ పడవ నడిపించడాని కిద్దరు మనుష్యులు కావాలి. నేను, కౌన్సెలు, జోరుగా తెడ్లు వేశాము. నెడ్‌లాండు చుక్కాని పట్టాడు.

ఆ ప్రయాణంలో నెడ్‌లాండ్‌కు కలిగిన ఆనందం ఇంతా అంతా కాదు. అతనేదో ఖైదులోనించి ఇవతల పడ్డట్టున్నాడు:

"మనకంతా ఇంక అసలైన తాజామాంసం దొరుకుతుంది. అది హాయిగా కడుపునిండా తినేసి తిరగవచ్చును!"

"అబ్బ! నీ మాటలు వింటూంటే నాకూ నోరూరుతూంది!" అన్నాడు కౌన్సల్.

"ఏమో ఆ అడివిలో ఎలాంటి విచిత్రాలున్నాయో మనమేం చెప్పగలం. ఇంతా చేసి అక్కడ వేటాడడానికి వీలవుతుందో! కాదో! ఒకవేళ అక్కడ మనల్నే వేటాడేసే వాళ్ళుంటారేమో!" అన్నాను.

ఆ మాటమీద నెడ్‌లాండ్ పళ్ళు కొరికాడు:

"అక్కడ మరే జంతువులు లేకపోతే పెద్ద పులిమాంసమైనా సరే తిని తీరతాను!" అన్నాడు.

"అదిగో! నువ్విప్పుడే తొందర పడిపోతున్నావు!" అన్నాను.

"మరేం కంగారు పడకండి! నావ తొందరగా ఒడ్డుకు పట్టించండి."

"నెడ్‌లాండ్ కేమీ పట్టపగ్గాలున్నట్లు కనబడదే!" అన్నాడు కౌన్సల్.

తరవాత ఉదయం ఎనిమిదిన్నర అయ్యేసరికి చిన్న చిన్న పగడపు గుట్టలు దాటి మా నావ గిల్బోవా ద్వీపం ఒడ్డుకు చేరుకుంది.

నేలమీద అడుగు పెట్టేసరికి

నాకొక్కసారిగా ప్రాణంలేచి వచ్చినట్టయింది. నెడ్ లాండ్ ఈ భూభాగం అంతా తనదే అన్నట్టుగా నేలమీద గట్టిగా అడుగు మోపి నిలుచున్నాడు. మేమంతా జలాంతర్గామిలో అడుగు పెట్టి రెండునెలలే అయింది.

అక్కడి నేల అంతా చాలా వరకు పగడపు పుట్టలతో నిండి ఉంది. అయితే పెద్దపెద్ద వృక్షాల కొమ్మలనీడలతో ద్వీపం అంతా కన్నుల పండువుగా కనిపించింది. దానిలో రెండువందల అడుగుల ఎత్తున్న చెట్లు కూడా ఉన్నాయి.

అంతలోనే నెడ్ లాండ్ అక్కడ కోకో చెట్లున్న విషయం పసిగట్టాడు. వెంటనే కొన్ని కాయలు కోసి పట్టుకువచ్చాడు. మేము వాటి గుంజు కడుపునిండా తిని, పాలు తాగాము. ఆ గుంజు తినడానికి బాగుంది.

"అబ్బ! ఎంతరుచిగా ఉంది!" అన్నాడు నెడ్ లాండ్.

"ఔనౌను! చాలా బాగుంది!" అన్నాడు కాన్సెల్.

"మనం కొన్ని కోకో కాయలు జలాంతర్గామిలోకి తీసుకుపోదాము. దానికి కెప్టెన్ ఏమీ అభ్యంతరం చెప్పడనే అనుకుంటాను." అన్నాడు నెడ్ లాండ్.

"దానికి అతడేమీ అభ్యంతరం చెప్పకపోవచ్చును. కాని వాటి గుంజుతినడేమో!" అన్నాను.

"అతనికది తినే అదృష్టం లేదు. అంతే!" అన్నాడు కాన్సెల్.

"పోనీ ఆకాయలన్నీ మనకే మిగులుతాయి!" అన్నాడు నెడ్ లాండ్.

నెడ్ లాండ్ ఇంకో కోకో చెట్టెక్కబోయాడు.

"ఊరికే ఆ కాయలన్నీ కోసుకాస్తే లాభ మేమిటి? ఏమన్నా మంచి కూరగాయ లున్నాయేమో చూడు!" అన్నాను.

"అవునవును! మీరు చెప్పింది బాగుంది. ఇంకా ఏమైనా మంచి మంచి పళ్లు కూడా దొరుకుతాయేమో చూస్తాను!" అన్నాడు నెడ్.

"అయితే బయలుదేరండి! కాని నాలుగువైపులా కొంచెం జాగ్రత్తగా పరకాయించిచూస్తూండండి." అన్నాను.

అలాగ కబుర్లు చెప్పుకుంటూ మేమొక రెండుగంటలసేపు నడిచి ఆ అరణ్యం మధ్య భాగంలోకి వెళ్ళిపోయాము.

అదృష్టవశాత్తు మా కక్కడ రొట్టెచెట్లు కనిపించాయి. వాటి కాయ లించుమించుగా గోధుమ రొట్టెల్లాగే ఉంటాయి. అవి తింటే మరి గోధుమ రొట్టెలు తినవలసిన అవసర మేమీ ఉండదు. సంవత్సరంలో చాలా భాగం—అంటే 8 నెలలవరకు—రొట్టెచెట్లు కాయలు కాస్తూంటాయి. ఆ కాయల సంగతి కాన్సెలుకు బాగా తెలుసును. అందుచేత అతనికా చెట్లకేసి చూడగానే నోరూరడం మొదలుపెట్టింది.

తరవాత మేమంతా కలిసి రొట్టెచెట్లపళ్ళు కోశాము. చితుకులలో నిప్పుచేసి అవ్వన్నీ ఆ నిప్పులో ఉడకపెట్టాము. అవి తింటూంటే సామాన్యపు గోధుమ రొట్టెలకన్న బాగా రుచిగా ఉన్నాయి. ఆ తరవాత మేము జలాంతర్గామిలోకి తీసుకుపోవడానికి ఇంకా మరికొన్ని పళ్లు జాగ్రత్త చేశాము. అందరు ఇంకా కొన్ని ఫలాహారగించిన తరవాత నెడ్ లాండ్ కళ్ళకు నగ్గుచెట్లు కనిపించాయి. అతడా చెట్ల మొదళ్ళ నరికి కొంత నగ్గుపిండి కూడా జాగ్రత్త చేశాడు. మేము సంపాదించిన విచిత్ర వస్తువులన్నీ చేత్తో పట్టుకొని సాయంత్రం కొంచెం చీకటిపడే సరికి తిరిగి జలాంతర్గామికి చేరుకొన్నాము. తరవాత మా భోజనాలు ముగించుకొని హాయిగా నిద్రపోయాము.

—ఇంకా ఉంది.

సూయజ్ తుఫాను

(4-వ పేజీ తరువాయి)

మొత్తంమీద కంపెనీకి, కాలువ ప్రాంతంలో వున్న సమస్త ఆస్తులనూ (భవనాలు మొదలైనవన్నీ) నిర్ణీతకార్యక్రమం ప్రకారం ఈజిప్టు తీసివేసుకున్నది. నాసర్ ప్రకటన పాశ్చాత్యరాజ్యాలను ముఖ్యంగా బ్రిటనును ఎంతగా క్షోభింపజేసిందో బ్రిటిష్ నాయకుల ప్రకటనలవల్లనే స్పష్టపడింది. ఈజిప్టు చేసిన ఏకపక్ష నిర్ణయాన్ని ప్రతిఘటించడంలో కామన్సు సభలోని అన్ని పక్షాలవారూ ఏకమైనారు. వెంటనే సేనలను పంపి సూయజ్ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనపరుచుకోవాలని కొందరూ, ఒక్క కాలువ ప్రాంతాన్నేగాక ఈజిప్టు అంతటినీ ఆక్రమించుకోవాలనీ మరికొందరూ కామన్సు సభలో, పత్రికలలో వాఖ్యానించసాగారు. ఈ సమస్యకు సంబంధించిన అన్ని విషయాలనూ సాకల్యంగా పరిశీలించడం జరుగుతున్నదనీ, అవసరమైన ప్రతీకార చర్యలను తమ ప్రభుత్వం తీసుకుంటుందనీ బ్రిటిష్ ప్రధాని సర్ ఆంథోనీ ఈడెన్ సమాధానంగా చెప్పాడు.

ప్రతీకారం

ఈ ప్రతీకార చర్యలకు ఉపక్రమణికగా బ్రిటన్ ఈజిప్టుకు ద్వితీయ మహాసంగ్రామ ఫలితంగా ఇవ్వవలసిన పదకొండున్నర కోట్ల స్టెర్లింగ్ నిల్వలను స్తంభింపజేసింది. మాలీనా 2 కోట్ల పౌనుల ప్రకారం చెల్లించి రానున్న ఏడేళ్ళలో (1963 నాటికి) ఈ బాకీని పూర్తిగా పరిష్కారం చేసుకోడానికి ఇది వరలో ఒక ఒప్పందం జరిగింది. ఆ ఒప్పందం ప్రకారం ఈ సంవత్సరారంభం వరకూ బ్రిటన్ ఇవ్వవలసిన మొత్తం పదమూడున్నర కోట్ల పౌనుల క్రిందా రెండున్నర కోట్ల పౌనులు జమవేసింది. మిగత మొత్తాన్ని ఇప్పుడు స్తంభింపజేసింది. ఈ ప్రతీకారానికి విరుగుడుగా ఈజిప్టు ప్రభుత్వం తమ స్టెర్లింగ్ నిల్వల స్తంభన చెల్లనేరదని హేగ్ లోని ప్రపంచ న్యాయస్థానంలో బ్రిటన్‌పై త్వరలో ఫిర్యాదు చేయబోతున్నట్లు వార్తలు వచ్చినవి.

సూయజ్ కంపెనీలో బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, హాలెండు దేశాలు భాగస్వాములైనప్పటికీ, వాటాలలో ఎక్కువభాగం బ్రిటనువే. ఫ్రాన్సుకు వాటాలు అట్టే లేకపోయినా, కంపెనీ పంచిపెట్టే లాభాల మీద పన్ను విధించడం ద్వారా ఆ దేశానికి విపరీతమైన ఆదాయం వస్తున్నది. సూయజ్ కాలువను ఉపయోగించుకునే నౌకలలో ఎక్కువభాగం బ్రిటిష్‌వారివే. అయినప్పటికీ ఒకానొకప్పుడు బ్రిటిష్‌వారికి కంపెనీలో ఒక్క వాటా కూడా వుండేది కాదు.

బ్రిటిష్ వాటాల చరిత్ర

బ్రిటన్ ఏవిధంగా వాటాలను సంపాదించగలిగిందన్నది అద్భుత ప్రత్యేక చారిత్రక గాథ. కంపెనీని ప్రారంభించినప్పుడు ఈజిప్టు పాషా ఒక్కొక్క వాటా 500 ఫ్రాంకుల చొప్పున మొత్తం 2 లక్షల వాటాలను కొనగలిగాడు. 1875 ప్రాంతాన ఈజిప్టును పాలిస్తున్న ఇస్మాయిల్ పాషా అనే అతడు దుర్వ్యయం కారణంగా అప్పులపాలై ఋణబాధానివారణకుమార్గాంతరాలు ఆలోచించడం ప్రారంభించాడు. సూయజ్ కంపెనీలో వున్న వాటాలను అమ్మివేసి ఋణవిముక్తి పొందడం మంచిదనే అభిప్రాయాన్ని ఇతరుల ద్వారా బ్రిటన్ అతిగాడికి కలిగించింది. బ్రిటన్‌లో అప్పుడు పరిపాలన చేస్తున్న బెంజమిన్ డిస్రేలీ ప్రభుత్వం ఆ వాటాలన్నిటినీ కొనివేసింది. ఆవిధంగా కంపెనీ మొత్తం వాటాలలో బ్రిటన్‌కు సగభాగం సంక్రమించినవి. అనంతరం (1876) బ్రిటన్ ఫ్రాన్సులు అక్కడి పాషాను ప్రలోభపరిచి అసలు ఈజిప్టునే హస్తగతం చేసుకున్నవి.

కిం కర్తవ్యం?

ఇక బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా ప్రభుత్వాలు ఏ విధానాన్ని అనుసరిస్తవన్నదే ముఖ్యమైన ప్రశ్న. సూయజ్ కంపెనీని జాతీయం చేసే హక్కు ఈజిప్టుకు లేదని ప్రపంచన్యాయస్థానానికి ఫిర్యాదుచేస్తే ప్రయోజనమేమీ వుండదన్న పశ్చిమ రాజ్యాలకు తెలియనిదికాదు. పర్షియాలోని అబడాన్ నూనెగనుల విషయంలో అప్పటి ప్రధాని మొసాదిక్ ప్రపంచ న్యాయస్థానంలో ఫిర్యాదుచేసి గెలిచిన దృష్టాంతం స్పష్టంగా కనిపిస్తూనే వున్నది; కాబట్టి ఈ పద్ధతివల్ల లాభంలేదు.

1954 జూలై 26న బ్రిటన్ ఈజిప్టులు సూయజ్ సమస్యపై చేసుకున్న ఒప్పందంలో ఒక ముఖ్యమైన విషయంవున్నమాట నిజం: ఏ ఇతర రాజ్యమైనా ఈజిప్టుమీదగాని, ఈ ఒప్పందంమీద సంతకాలు జరిగే నాటికి పరస్పర రక్షణ ఒడంబడికలు చేసుకున్న అరబ్ రాజ్యాలసమితిలోని ఏ ఇతర రాజ్యంమీదగాని, టర్కీ మీదగాని దండయాత్రకు దిగినటయితే, సూయజ్ రక్షణ స్థావరాలను తిరిగి యుద్ధసన్నద్ధం చేయడానికి, వాటిని క్రమపద్ధతిలో నిర్వహించడానికి బ్రిటన్‌కు ఈజిప్టు సకల సౌకర్యాలు సమకూర్చాలి. ఇందుకు కావలసిన రేవుస్థానాలను ఉపయోగించుకునే అధికారం ఈజిప్టు బ్రిటన్‌కు ఇవ్వాలి. సూయజ్ కాలువ ఈజిప్టులో అంతర్భాగమనీ, ఆర్థిక వ్యాపార యుద్ధావసరాల దృష్ట్యా ఇది అంతర్జాతీయ ప్రాధాన్యంగల నౌకాయానమార్గమనీ ఉభయ రాజ్యాలూ ఒప్పుకుంటున్నవి. నౌకాయాన హక్కుల విషయంలో 1888 నాటి నియమనిబంధనలను ఉభయ ప్రభుత్వాలూ భంగపరచకూడదని కూడా ఈ ఒప్పందంలో వున్నది.

ఈ ఒప్పందం ప్రకారం తమ సైనికబలంతో సూయజ్ ప్రాంతంలో తిరిగి ప్రత్యక్షం కావడానికి బ్రిటన్‌కు అవకాశం వున్నప్పటికీ, ఈజిప్టుకుగాని, ఇతర అరబ్ రాజ్యాలకుగాని ఏవిధమైన యుద్ధ ప్రమాదమూ ఇప్పుడు వాటిల్లలేదు. అయితే, ఇరాక్, ఇరాన్‌లు తమ చేతిక్రింద వున్నవి కాబట్టి, పాశ్చాత్య రాజ్యాలు కొంత నాటకం ఆడవచ్చు. ఇస్రేల్ మూలాలన జేసి నానిసరిహద్దులలో లేనిపోని అశాంతి రేచ్చగొట్టవచ్చు. ఈ విధంగా పశ్చిమాసియా ప్రాంతాన్ని పాశ్చాత్య అగ్రరాజ్యాలు క్రీడారంగంగా ఉపయోగించుకోడానికి ప్రయత్నించవచ్చు. ఇదిగాక, బ్రిటన్ యుద్ధ నౌకలను, సేనను సూయజ్ ప్రాంతానికి పంపితే, అది ప్రత్యక్ష యుద్ధంగానే పరిణమించే ప్రమాదం వున్నది. ఇంతపనికి బ్రిటన్ సాహసించలేదు.


ప్రస్తుతం లండన్‌లో అత్యవసర సమాలోచనలు సాగిస్తున్న బ్రిటన్ అమెరికా, ఫ్రాన్సు రాజ్యాలవిదేశాంగమంత్రులు చేసేనిర్ణయాలమీదపశ్చిమాసియా శాంతిఆధారపడివున్నది. ఈచర్చలలో అమెరికా విదేశాంగ మంత్రి జాన్ ఫాస్టర్ డల్లెస్ పాల్గొనకపోవడం ఉపవిదేశాంగ మంత్రి రాబర్ట్ మర్ఫీ మాత్రమే పాల్గొనడం గమనార్హమైన విషయం. పశ్చిమరాజ్యాలు ప్రపంచానికి మరొక యుద్ధ బీభత్సాన్ని తెచ్చిపెట్టకుండా, ఉదాత్తమైన రాజనీతిజ్ఞతతో ప్రవర్తిస్తవని ఆశించవచ్చు. ★

స్వతంత్రభారతములో శిశుజనాభ్యుదయము

(44-వ పేజీ తరువాయి)

స్థాపింపబడి కృషి చేస్తున్నాయనీ వాటి ద్వారా లాభము పొంది దేశానికి వత్ఫలితాన్ని చూపించాలనీ ప్రజలలో చంచలనము బయలుదేరాలి. నా అనువారు లేని బిడ్డలు వీధులలో తిరుగుతుండా, వారిని తీసుకొనిపోయి ఈ రకపు సంస్థలలో చేర్పుటయూ కూడా ఒక పుణ్యకార్యమే. తమ శక్త్యనుసారము విరాళములను ప్రోగుచేసి సంస్థలకందించటముకూడా ఘనకార్యమే. ప్రతి తల్లీ తన బిడ్డల సంగతే కాకుండా అందరి బిడ్డలను గురించి ఆలోచించి వారి శ్రేయస్సును కాంక్షించాలి. తన బిడ్డల అభ్యుదయానికి కృషిచేసినట్లే ఇతరుల బిడ్డలకొరకు కూడా శక్త్యనుసారముగా కృషి చేయాలి. మాతృహృదయముతో బిడ్డలందరికీ తల్లి జీవనలియ్యాలి. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1.



విజయచిహ్నం

ఫొటో : పి. సి ఎమ్. ఈశ్వరబాబు.


Rexona
BLENDED WITH CADYL